అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 09-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 340 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

కొత్త రెవెన్యూ చట్టంపై అసెంబ్లీలో బిల్లు

- ధరణి కోసం కొత్త యాప్
- ఈనెల ఒకటి నుంచి ఎన్ఐసీకి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు
- గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- రోల్ మోడల్‌గా ఆర్వోఆర్ చట్టం : విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్



సోమవారం నుంచి నిర్వహించబోయే శాసనసభ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టం బిల్లును ప్రవేశపెట్టబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఒక వైపు ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన చర్యలు చేపడుతూనే మరోవైపు దానికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఇంకోవైపు కొత్త రెవెన్యూ చట్ట రూపకల్పనకు శ్రీకారం చుట్టి కొలిక్కి తీసుకొచ్చామని చెప్పారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఏడాది కాలంగా పలు నిర్ణయాలు తీసుకుని, రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. తద్వారా ఆ విభాగంలో గణనీయనమైన ప్రగతిని సాధించామని వివరించారు.

ప్రజాపాలన-విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాలు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికపై పొంగులేటి మాట్లాడారు. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతల నుంచి టెర్రాసిస్ అనే విదేశీ సంస్థను తప్పించి, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్.ఐ.సీకి వాటిని అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈనెల ఒకటి నుంచి ఎన్.ఐ.సీ ఆ బాధ్యతలను చూస్తోందని చెప్పారు. ధరణి పోర్టల్ కారణంగా రైతులు గతంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తరతరాలుగా తమ యజమాన్యంలో ఉన్న భూములపై వారు సర్వ హక్కులూ కోల్పోయారని చెప్పారు. భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేసే సమయంలో జరిగిన లోపాలు, అక్రమాలు, అవకతవకల వల్ల లక్షలాది మంది రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని వాపోయారు. రైతులు తమ భూములను అమ్ముకోవడానికి గాని, ఆ భూములపై బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి గాని అనేక కష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాన్యులకు రెవెన్యూ సేవలు అందేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా ధరణి సమస్యలపై సమీక్షించి వాటి పరిష్కారానికి మార్గాలను చూపించేందుకు భూ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రీకృతమై ఉన్న అధికారాలను వికేంద్రీకరించి, మండల స్థాయిలో తహశీల్దార్‌కు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్లకు సమస్యలను అధికారాన్ని అప్పగించామని వివరించారు. ఒక్కప్పుడు ధరణిలో ఏ ఎంట్రీ మారినా, ఎందుకు మారిందో తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లో కానీ, కాగితాలపైగానీ ఎలాంటి ఆధారం ఉండేది కాదన్నారు. కానీ, ఇప్పుడు ఈ విధానాన్ని మార్చి దరఖాస్తు వచ్చినప్పటి నుండి సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రతీదాన్ని కంప్యూటర్‌లో ఉంచి ఎవరైనా, ఎప్పుడైనా చూసుకునేలా చేశామని వివరించారు. గత ప్రభుత్వంలో ఏ కారణం చెప్పకుండానే దరఖాస్తులను తిరస్కరించే వారనీ, కానీ ఇప్పుడు దరఖాస్తు తిరస్కరించాల్సి వస్తే తిరస్కరణకు గల కారణాలు వివరిస్తూ నివేదికను తప్పనిసరి చేశామని పొంగులేటి చెప్పుకొచ్చారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం...

ధరణి సమస్యల పరిష్కారానికి ఈ యేడాది మార్చి 1 నుంచి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 2.46 లక్షల దరఖాస్తుల్లో పెండింగ్‌లో ఉండగా, స్పెషల్ డ్రైవ్ ద్వారా 1.38 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. కొత్తగా 3.16 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన మొత్తం 5.62 లక్షల దరఖాస్తులలో 4.68 లక్షలను పరిష్క రించాం. తద్వారా దాదాపు 83 శాతం దరఖాస్తులను పరిష్కరించి రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా నిలించిందని వివరించారు. గత ప్రభుత్వంలో సంవత్సరాలు గడిచినా దరఖాస్తులకు మోక్షం లభించేది కాదనీ, ఇప్పుడు ఒక్క నెల్లోనే పరిష్కారం లభిస్తోందని తెలిపారు.

ఒక్కో గ్రామానికి ఒక్కో రెవెన్యూ ఉద్యోగి

గత ప్రభుత్వం విఆర్‌వో, విఆర్ఎ వ్యవస్థను రద్దుచేసి గ్రామాల్లోని సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని మంత్రి విమర్శించారు. ఈ క్రమంలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరచటానికి గ్రామాల్లో ఆయా సేవలను పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలోని 10,954 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు వీలుగా ఒక్కో గ్రామానికి ఒక్కో రెవెన్యూ ఉద్యోగిని నియమించడానికి కార్యాచరణను రూపొందించామని వెల్లడించారు.

సిద్ధమైన కొత్త చట్టం

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా 'నూతన రెవెన్యూ చట్టం-2024'ను సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోతున్నామని మంత్రి తెలిపారు. ఆగస్టులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముసాయిదా చట్టాన్ని ప్రవేశపెట్టి, విస్తృతంగా చర్చించామని గుర్తు చేశారు. అదేరోజు సిసిఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా చట్టాన్ని పెట్టామని తెలిపారు. రైతు సంఘాలు, మేధావులు, ప్రజా ప్రతినిధులు, రిటైర్డ్ అధికారుల నుంచి స్వీకరించిన సలహాలు, సూచనలతో కొత్త చట్టాన్ని తయారు చేశామన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ చేసిన సూచనలు కూడా పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా యాచారం, నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలాల్లో పైలట్ ప్రాజెక్టును కూడా నిర్వహించామనీ, పద్దెనిమిది రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, అక్కడ అమలవుతున్న మంచి అంశాలను చట్టంలో పొందుపరిచామని వివరించారు. తరతరాల భూ సమస్యలకు ముగింపు పలికేలా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా, దేశానికే ఆదర్శంగా ఉండేలా ఒక రోల్ మోడల్‌గా '2024-ఆర్వోఆర్ చట్టా'న్ని తీసుకు రాబోతున్నామని వెల్లడించారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు...

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగేండ్లలో దశల వారీగా సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం పూనుకుందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. మొదటి విడతలో భాగంగా ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 నుంచి 4000 ఇండ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలనీ, రెండో దశలో ప్రభుత్వమే నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి కర్మాచారులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఒక్కో ఇంటికి 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఆయన వివరించారు. మహిళల పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ ఇండ్లకు నాలుగు దశల్లో లబ్దిదారులకు చెల్లింపులు చేస్తామనీ, మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో డబ్బును జమ చేస్తామని స్పష్టం చేశారు. పేదలకు ఇండ్లు నిర్మించే గృహ నిర్మాణ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి విమర్శించారు.

ఆ విభాగాన్ని మూసేసి, ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఆ శాఖను పునరుద్ధరించి, లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుందని చెప్పారు. 326 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామని తెలిపారు.



ఆదివాసీ బిడ్డల ఆత్మస్థైర్యాన్ని, పోరాటస్ఫూర్తిని దెబ్బతీసే కుట్ర

- 3సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యా
- నా ఎదుగుదల, ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఆరోపణలు
- బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి : మహబూబాబాద్ మీడియా సమావేశంలో మంత్రి సీతక్క
- 'క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు' అంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందన

నవతెలంగాణ-మహబూబాబాద్

క్యాబినెట్‌లో మాజీ మావోయిస్టులున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు. ఆదివారం మహబూబాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే మురళినాయక్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అట్టడుగు స్థాయి నుంచి ఎదిగొచ్చిన ఆదివాసీ బిడ్డనని, తనలాంటి వారి ఆత్మస్థైర్యాన్ని, పోరాటస్ఫూర్తిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే బండి సంజయ్ ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని భావోద్వేగానికి లోనయ్యారు. క్యాబినెట్‌లో అందరూ అర్బన్ నక్సలైట్లేనని మాట్లాడటం దారుణమన్నారు. మంత్రివర్గంలో నక్సలైట్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చింది తానొక్కదాన్నే అని, అంత మాత్రాన మొత్తం క్యాబినెట్‌కు నక్సలైట్ ముద్ర ఆపాదించడం దుర్మార్గమన్నారు. 2004లో మొదటి సారి తాను ఎమ్మెల్యేగా పోటీచేసినప్పుడు బీజేపీ తనకు మద్దతిచ్చి ప్రచారం చేసిందని గుర్తుచేశారు. అప్పుడు తన బ్యాక్ గ్రౌండ్ బీజేపీ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. జనజీవన స్రవంతిలో కలిసాక తాను నల్లకోటు వేసుకుని లాయర్‌గా ప్రజల పక్షాన ఎన్నో కేసులు వాదించానని తెలిపారు. తాను దొడ్డి దారిలో రాజకీయాల్లోకి రాలేదని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని స్పష్టంచేశారు. ప్రధాని, హోం మంత్రి నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతారని, బండి సంజయ్ మాత్రం జనజీవన స్రవంతిలో కలిసిన వారిని అవమాన పరిచేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ ఏ భావజాలమో బండి సంజయ్‌కు తెలియదా అని ప్రశ్నించారు. పేదల ఐఏఎస్‌గా గుర్తింపు పొందిన ఆకునూరు మురళిని అర్బన్ నక్సలైట్ అనడం ఏం సంస్కారమన్నారు. కరీంనగర్‌లో దొరల దౌర్జన్యాలను, దాష్టికాలను ఓడించింది ఏ భావజాలమో మీ తల్లిదండ్రులని అడగండని బండి సంజయ్‌కు సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగాన్ని నమ్ముకుని రాజ్యాంగానికి లోబడి పని చేస్తున్నామని తెలిపారు. బలమైన కుటుంబ నేపథ్యం, కుల నేపథ్యం లేకుండా అడవి జీవితాలు అనుభవించి నేడు పంచాయతీ రాజ్ వంటి పెద్ద శాఖకు మంత్రిగా సేవలందిస్తున్నానని సగర్వంగా చెప్పారు. తన ఎదుగుదల, ప్రజాదరణను చూసి ఓర్చుకోలేక లేని పోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తన ప్రసంగాలను మార్ఫింగ్ చేసి తన ఇమేజ్‌ను డామేజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏండ్ల తన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, దొడ్డి దారిన పదవులు దక్కించుకోలేదని, ప్రజల మధ్య ఉండి కష్టపడి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిస్తేనే మంత్రి పదవి వచ్చిందని తెలిపారు. బండి సంజయ్ ఎన్నోసార్లు తనని వీరవనిత అన్న సందర్భాలు ఉన్నాయని, రాజకీయ దురుద్దేశంతో మమ్మల్ని తొక్కి పడేయాలని చూస్తే సహించేది లేదని చెప్పారు. మతాలు, కులాల పేరుతో విద్వేశ రాజకీయాలు చేయొద్దని, బండి సంజయ్ తన వ్యాఖ్యలను తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యలు, ఎన్‌కౌంటర్లు లేకుండా రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఉండాలని, అందరూ స్వేచ్ఛ, సమానత్వంతో బతకాలంటూ.. ములుగు ఎన్‌కౌంటర్‌పై మీడియా ప్రశ్నలపై మంత్రి పైవిధంగా స్పందించారు.

మెట్రో కారిడార్లు, స్టేషన్లలో ప్రజాపాలన విజయోత్సవాల సంరంభం

- తెలంగాణ తల్లికి ఘన నీరాజనం
- 25 మెట్రో స్టేషన్లలో 'తెలంగాణ తల్లి' చిత్రాల ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రజాపాలన- ప్రజా విజయోత్స వాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిశానిర్దేశంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శించింది. 'జయ జయహే తెలంగాణ-జననీ జయకేతనం' అంటూ తెలంగాణ స్ఫూర్తిని అంది పుచ్చుకుంటూ మొత్తం 25 మెట్రో స్టేషన్లలో కొత్తగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' చిత్రాలను ఏర్పాటు చేసినట్టు హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రజాపాలన విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో జోరుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మెట్రో రైల్ రెండవ దశ ముఖ్య అంశాలను తెలియజేసేలా స్టేషన్ల కాన్‌కోర్స్, ప్లాట్‌ఫామ్‌లపైన స్టాండ్‌లను ఏర్పాటు చేశామని, ప్రధాన మార్గాల్లో మెట్రో పిల్లర్లకు హోర్డింగ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సంవత్సరం కాలంలో ప్రభుత్వ విజయాలను, మెట్రో సాధిస్తున్న ప్రగతిని వివరించామని వెల్లడించారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో ముఖ్యమైన మెట్రో మార్గాలు ప్రజలను విశేషంగా అలరిస్తున్నాయి. కాంగ్రెస్ ఏడాది పాలన విజయాలను ఘనంగా ప్రతిబింబించేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, నేను సైతం అంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటోంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఇన్నా రెడ్డి

- సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరుమల్‌రెడ్డి ఇన్నా రెడ్డి ఖరారైనట్టు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ (సీపీఎస్) యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై యూనియన్‌లో చర్చించామని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ హాజరైనట్టు తెలిపారు. 28 ఏండ్లుగా తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ఉపాధ్యాయులకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ అధ్యాపకున్ని, మరోవైపు పాత పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయున్ని అభ్యర్థులుగా పోటీలో నిలిపి, సీపీఎస్ ఓపీఎస్ అనే తేడా లేకుండా ఉపాధ్యాయ వర్గం నుండి పెట్టుబడిదారి పెన్షన్ విధానాన్ని పారదోలేందుకు సీపీఎస్ విధానంపై రెఫరెండంగా ఎన్నికల్లో బరిలో ఉంటున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, పోల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లి కార్జున్, రాజేష్ వనమాల, సిర్పూర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాల్ రెడ్డికి టీఆర్‌టీఎఫ్ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పీఆర్‌టీయు టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్ రెడ్డికి టీఆర్‌టీఎఫ్ మద్దతు ప్రకటించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, మారెడ్డి అంజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దతు లేఖను శ్రీపాల్ రెడ్డికి వారు అందజేశారు.

తమిళనాడు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏఐకేఎస్ బృందం పర్యటన

- జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- కేంద్రం తగిన నిధులు ఇవ్వాలని నాయకుల డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఫెంగల్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను ఆదివారం ఏఐకేఎస్ బృందం పరిశీలించింది. ఆదివారం తమిళనాడులోని విలుపురం, కడలూరు జిల్లాల గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను, బాధిత రైతులను కలిసి వారి ఇబ్బందులను, కష్టాలను తెలుసుకున్నారు. ప్రతినిధి బృందంలో ఏఐకేఎస్ ఆర్థిక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పి. కృష్ణప్రసాద్, సహాయ కార్యదర్శి టి.సాగర్, ఉపాధ్యక్షులు రవీంద్రన్, కేపీపెరుమాళ్, తమిళనాడు కిసాన్‌సభ నాయకులు ఆర్‌టి మురుగన్, తాండవరాయన్, రవిచంద్రన్, ఆర్.శరవణన్, వెల్‌మారన్, సీపీఐ(ఎం) నాయకులు ఎన్. సుబ్రమణియన్, మాజీ ఎమ్మెల్యే ఆర్.రాంమూర్తి, సీకేసీ సభ్యులు ఉన్నారు. రైతులు, గ్రామీణ కార్మికులను పరామర్శించి, వారికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫెంగల్ తుఫాన్ లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణనష్టంతోపాటు దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరి, లక్ష ఎకరాల్లో మినుము, లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలు, ఇతర పంటలు దెబ్బతినడంతో రైతులు వేలకోట్లమేర నష్టం జరిగిందన్నారు. దాదాపు ఐదు వేల ఇండ్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలనీ, పునరావాసం కోసం తగిన నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఒక్క విలుపురం జిల్లాలోనే దాదాపు 15000 ఎకరాల్లో పంట నాశమైందన్నారు.. తమిళనాడు కమిటీకి ఏఐకేఎస్ రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించింది. తమిళనాడు రైతుల కోసం విరివిరిగా విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

విరాళాల ఇవ్వాల్సిన అడ్రస్...తమిళనాడు వివసైగళ్ సంఘం, అకౌంట్ నెంబర్ 414267900, ఐఎఫ్ఎస్ కోడ్ ఐడీఐబీ000టీ092 ఇండియన్ బ్యాంక్, వెస్ట్ తంబరామ్ బ్రాంచ్.



వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలి

- ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు రానున్న ఆర్‌వోఆర్ చట్టంలో వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలని రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. కొత్త ఆర్వోఆర్ చట్టం రూపకల్పన, తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో అధికారాల వికేంద్రీకరణ, రెవెన్యూ ఉద్యోగులపై దాడులు, భవిష్యత్ కార్యచరణపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతర ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను ఎత్తేయడం వల్ల మొత్తం ప్రభుత్వ వ్యవస్థనే నిర్వీర్యం అయ్యిందని పేర్కొన్నారు. ఫలితంగా లగచర్ల, నిర్మల్ వంటి ఘటనలు జరిగే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సంతోషకరమనీ, ఈ ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగులుగా అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీజీఆర్ఎస్ఏ నూతన కమిటీ ఎన్నిక

టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర నూతన కమిటీని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిక్షం, కోశాధికారిగా మల్లేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుజాత చౌహాన్ ఎన్నికయ్యారు.

10నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

- టీఎస్ఎస్‌యూఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం(టీఎస్ఎస్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య , కార్యనిర్వాహక అధ్యక్షులు అనిల్ చారి, కోశాధికారి దుర్గం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్ డౌన్, చాక్ డౌన్ తో కేజీబీవీ,యూఆర్ఎస్, భవిత సెంటర్లలో బోధన ఆగనున్నదని పేర్కొన్నారు. సమ్మెలో జిల్లా విద్యా, మండల విద్యా శాఖ కార్యాలయాల సిబ్బందితో పాటు క్లస్టర్ పాఠశాలల సిబ్బంది, ఉన్నత పాఠశాలలోని ఒకేషనల్ ఇన్ స్ట్రక్టర్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com
14 పేజీలు వెల : 6.50
సోమవారం 09-12-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 340
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar



వైభవంగా ప్రజాపాలన ఏడాది విజయోత్సవాల వేడుకలు

ఎయిర్ షో..అదరహో

ఆకట్టుకున్న వాయుసేన విన్యాసాలు

- రాహుల్ సిప్లిగంజ్ ధూంధాం
- స్వయంగా వీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- ఆసక్తిగా తిలకించిన వీక్షకులు
- కట్టిపడేసిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు
- ఉర్రూతలూగించిన బతుకమ్మ పాటలు..కోలాటాలు
- ట్యాంక్‌బండ్‌పై సండే సందడే సందడి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్
ఇసుకేస్తే రాలనంత జనంతో ఆదివారం సంధ్యాసమయంలో ట్యాంక్‌బండ్ కిటకిటలాడిపోయింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా ఇండియన్ ఫోర్స్ ఆధ్వర్యంలో అజయ్ నేతృత్వంలో 9 సూర్యకిరణ్ విమానాలతో నిర్వహించిన ఎయిర్‌షో అదరహో అనిపించింది. ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద వాయుసేన విన్యాసాల కార్యక్రమాన్ని, భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డు వద్ద ఉన్న హెచ్ఎండీఏ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ట్యాంక్‌బండ్‌పై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సందర్శించారు. పిల్లాపాపలు..చిన్నాపెద్దా..అనే తేడా లేకుండా వైమానిక దళాలు ప్రదర్శించిన విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విమానాలు తమ సమీపానికి వచ్చిన ప్రతిసారీ కేరింతలు కొడుతూ ఎంజాయ్ చేశారు. తమ సెల్‌ఫోన్లలో బంధించారు. వాయుసేన విమానాల ప్రదర్శనతో వీక్షకులు కుటుంబ సమేతంగా సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. ఎయిర్‌షోలో విమానాలు 360 డిగ్రీల ...13లో

అధ్యక్షా..!

నేటి నుంచి అసెంబ్లీ

ఒక్కరోజే..మళ్ళీ 16 నుంచి కొనసాగింపు



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో
రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, యూపీఏ చైర్‌పర్సన్‌గా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు ధన్యవాద తీర్మానంపై చర్చించి, సంతాప తీర్మానాల అనంతరం సభను మళ్ళీ ఈనెల 16వ తేదీకి వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. సోమవారమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మెన్లతో పాటు మంత్రులంతా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దాదాపు లక్షమంది మహిళలను తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అన్ని జిల్లాల కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు టార్గెట్లు విధించినట్టు సమాచారం. దీనితో ఆదివారం నుంచే సచివాలయం, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో జనసమ్మర్థం పెరిగింది. ఇక్కడ నిర్వహించిన వాయుసేన విమాన విన్యాసాలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అట్టహాసంగా నిర్వహించిన ప్రజాపాలన వార్షికోత్సవ వేడుకల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులంతా బిజీగా ఉన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు జనసమీకరణ సహా అనేక బాధ్యతలు వారిపై ఉన్నాయనీ, అందువల్ల సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించి, వారం తర్వాత తిరిగి కొనసాగించాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం అసెంబ్లీ కార్యాలయంలో సమావేశమై నిర్ణయించినట్టు సమాచారం. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు రాతపూర్వకంగా సమాధానాలు ఇవ్వాలని స్పీకర్ ప్రసాదరావు ఆదేశించారు. అయితే ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం తలమునకలై ఉండటంతో ఆ పనులు పూర్తికాలేదని తెలిసింది. ఈ వారం రోజుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలన్నింటికీ రాతపూర్వక సమాధానాలు ఇచ్చాకే, తిరిగి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ వారం రోజుల్లోనే సీఎం సహా కొందరు మంత్రులు ఢిల్లీకి వెళ్లాల్సి ఉందనీ, మంత్రివర్గ విస్తరణతో పాటు కేంద్రం నుంచి రావల్సిన నిధుల విషయంలో అధికారుల్ని కలిసిరావాల్సి ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యుత్ కమిషన్ నివేదికపై కూడా అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో దాన్ని అధ్యయనం చేయాల్సి ఉంది. రైతు భరోసాకు సంబంధించిన విధివిధానాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ...5లో

కొత్త రెవెన్యూ చట్టంపై అసెంబ్లీలో బిల్లు

ధరణి కోసం కొత్త యాప్
ఈనెల ఒకటి నుంచి ఎన్ఐసీకి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు
గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
రోల్ మోడల్‌గా ఆర్వోఆర్ చట్టం
విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి 2లో..

అసెంబ్లీ సమావేశాలకు మూడంచెల బందోబస్తు

రెండువేల మంది పోలీసులతో సెక్యూరిటీ
బందోబస్తును సమీక్షించిన సెంట్రల్ జోన్ డీసీపీ 13లో..

నిలదీద్దాం

కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఆధారంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ భేటీ
అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం
హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
కాంగ్రెస్ ఏడాది పాలనపై హరీశ్‌రావు, కేటీఆర్ విమర్శలు



నవతెలంగాణ–మర్కుక్
కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గట్టిగా నిలదీయాలని మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలను వారికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ఆధారంగా వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి.. పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చటం మూర్ఖత్వమేననీ, ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా..? ఇలా మార్పులు చేసుకుంటూ పోతే ఎలా..? అని చెప్పారు.

ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతోపాటు హైడ్రా, లగచర్ల ఘటనలపై కూడా ప్రశ్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, చింతా ప్రభాకర్, సుధీర్ రెడ్డి, అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాణిక్‌రావు, వివేక్ మందా గౌడ్, బండారు లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సుంకరి రాజు, షేర్ సుభాష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, వంటేరు యాదవ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, మధుసూదనా చారి, మహమూద్ అలీ, రమణ, దేశపతి శ్రీనివాస్, మధుసూదన్ టాటా, వాణీ దేవి, రమణరెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాడుతాం : ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్

ప్రజా సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పి పోరాడుతామనీ, ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం దిశా నిర్దేశం చేసిన అనంతరం విలేకరులతో హరీశ్‌రావు, కేటీఆర్ వేర్వేరుగా మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుకు మొదటి శాసనసభలో చట్టబద్ధత తెస్తామని హామీనిచ్చినా అమలు చేయలేదన్నారు. ఇలాంటి ఎన్నో హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఫార్మాసిటీ పేరుతో లగచర్లలో గిరిజనుల భూములను అక్రమంగా లాక్కొని వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా రెండు పంటలకు ఇవ్వడంలో విఫలమయ్యారని తెలిపారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం గళం విప్పి పోరాటాలు చేస్తున్నదన్నారు. దళిత బంధు, బీసీ బంధు, గిరిజ బంధు వాటిపై ...13లో



రైతులపై మళ్ళీ జులుం

శంభు సరిహద్దులో బాష్పవాయుగోళాల ప్రయోగం

ఢిల్లీ సరిహద్దులో ముండ్ల కంచెలు, రోడ్లపై మేకులు, ఇనుప బారికేడ్లు
యూపీ జైళ్లలోనే రైతుల నిరాహార దీక్ష
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

తమ సమస్యలను వినిపించటానికి బయలుదేరిన రైతుల్ని మోడీ సర్కార్ ఢిల్లీలో అడుగుపెట్టనీయటంలేదు. బీజేపీ పాలిత ప్రభుత్వాలు అన్నదాతల్ని అడ్డుకుంటున్నాయి. ఢిల్లీలో శాంతి భద్రతలు కేంద్రం చేతిలో ఉండటంతో కేంద్ర సర్కారు మరింతగా రెచ్చిపోతోంది. ఇటు శంభు సరిహద్దులోనూ, అటు యూపీలోనూ అన్నదాతలపై పాలకుల అరాచకం అస్సలు ఆగటంలేదు. తాజాగా ఆదివారం శంభు సరిహద్దు వద్దకు చేరిన రైతులపై హర్యానా సర్కార్ బరితెగించింది. ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా బాష్పవాయుగోళాలను ప్రయోగించింది. ఢిల్లీలో అడుగడుగునా ముండ్ల కంచెలు, రోడ్లపై మేకులు, బారికేడ్లతో అడ్డుకున్నది.

న్యూఢిల్లీ : కేంద్రం చర్చలకు సిద్ధపడకపోవడంతో తిరిగి ప్రారంభించిన పంజాబ్ రైతుల ఢిల్లీ మార్చ్‌ను హర్యానా పోలీసులు శంభు సరిహద్దు వద్ద మరోసారి అడ్డుకున్నారు. ఫిబ్రవరి నుంచి కాంక్రీట్ కంచె వేసి, కేంద్ర బలగాలను ...13లో

ఏడాది పాలనంతా

ఎడతెగని వంచనే


ప్రజాస్వామ్యం అపహాస్యం
భావప్రకటనా స్వేచ్ఛకు భంగం
నిరసన తెలిపే హక్కే లేకుండా పోయింది :
బీఆర్ఎస్ చార్జిషీట్‌ను విడుదల చేసిన హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్
రేవంత్ సర్కార్ ఏడాది పాలనంతా ఎడతెగని వంచనేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఈ కాలంలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైందనీ, భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని వాపోయారు. నిరసన తెలిపే హక్కే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు 'కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన చార్జిషీట్‌'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రేవంత్ సర్కార్ లోపాలను ...13లో

మాపై చార్జిషీట్ కాదు

ప్రజలు మిమ్మల్నే డిశ్చార్జి చేశారు :
బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి సెటైర్లు
కేసీఆర్‌దే తుగ్లక్ పాలనంటూ ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్
'మాపై చార్జిషీట్ విడుదల చేయటం కాదు.. ఆస్పత్రి నుంచి పేషెంట్‌ను పంపినట్టు, ప్రజలే మిమ్మల్ని, మీ పాలనను డిశ్చార్జి చేసి పంపారు...' అని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... బీఆర్ఎస్ నేతలనుద్దేశించి సెటైర్లు విసిరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే రాంచంద్రనాయక్‌తో కలిసి పొంగులేటి మాట్లాడారు. రేవంత్ ఏడాది పాలనపై మాజీ మంత్రి హరీశ్‌రావు చార్జిషీట్‌ను విడుదల చేశారనే విషయాన్నిఈ సందర్భంగా విలేకరులు ప్రస్తావించగా... పొంగులేటి ఘాటుగా స్పందించారు. 'పోలీసులను పార్టీ కార్యకర్తలుగా వాడుకోవడం, ప్రతిపక్షాల ...13లో



మెజార్టీ కోరిక ప్రకారమే

భారత్ నడుస్తుంది

వీహెచ్‌పీ కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి వివాదస్పద వ్యాఖ్యలు 6లో..

సిరియాలో తిరుగుబాటు

దేశం విడిచి పారిపోయిన అధ్యక్షుడు అసద్

అధికారం మాదేనన్న తిరుగుబాటుదారులు
తాజా పరిణామంపై మిశ్రమ స్పందన




దమాస్కస్: సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పదవీచ్యుతులయ్యారు. అమెరికా మద్దతు కలిగిన సిరియన్ 'ఫ్రీ ఆర్మీ' దళాల తిరుగుబాటుదారులు ఆదివారం ఉదయం రాజధాని డమాస్కస్‌ను ఆక్రమించుకోవడంతో సిరియా తిరుగుబాటుదారుల వశమైంది. అధ్యక్షుడు అసద్ దేశం విడిచి విమానంలో అజ్ఞాత ప్రదేశానికి వెళ్లిపోయారని సీనియర్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. దీంతో 24 ఏళ్ల అసద్ పాలనకు తెరపడిందని ఆర్మీ కమాండ్ అధికారులు చెప్పారు. హయత్ తెహ్రీర్ అల్–షామ్ (హెచ్‌టిఎస్), ఫ్రీ సిరియన్ ఆర్మీ (ఎఫ్ఎస్ఎ), ఇతర స్థానిక మిలీషియా గ్రూపులతో కూడిన కూటమి వారం రోజుల తిరుగుబాటులో కీలకమైన నగరాలను ఒకటి తరువాత ఒకటి ఆక్రమిస్తూ చివరి దుర్గమైన డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవడంతో అసద్ ప్రభుత్వం పతనమైంది. తిరుగుబాటు నాయకుడు అబూ మహ్మద్ అల్ జొలాని నేతృత్వంలోని హయత్ తెహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) ఒక ప్రకటన చేస్తూ 'ఈ రోజుతో ఒక చీకటి శకం ముగిసింది. కొత్త శకానికి నాంది పలుకుతున్నాం' అని పేర్కొంది. సిరియాలో చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలపై రష్యా, ఇరాన్, ఇరాక్ తదితర పశ్చిమాసియా దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ తదితర దేశాలు దీనిని ...13లో

ప్రభుత్వాధికారులకు ఆమ్యామ్యాలు

66 శాతం వ్యాపార సంస్థలు వెల్లడి | అన్ని విభాగాల్లో అదే పరిస్థితి

లోకల్ సర్కిల్స్ నివేదిక మేధావులు, సామాజికవేత్తల ఆందోళన



న్యూఢిల్లీ : భారత్‌ను అవినీతి మహమ్మారి ఎన్నో ఏండ్ల నుంచి పట్టి పీడిస్తున్నది. ప్రభుత్వాలు మారినా.. ఈ జాఢ్యం మాత్రం వదలటం లేదు. ప్రభుత్వాధికారులు తమ బాధ్యతలను విస్మరించి.. ధనార్జనే ధ్యేయంగా పని చేస్తుండటంతో ఆమ్యామ్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వ విభాగాలకు చెందిన పలు విభాగాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. పని అక్రమమైనా, సక్రమమైనా.. అధికారుల చేతులు తడపనిదే పని కావటం లేదు. ఇప్పుడు, దేశంలోని వ్యాపార సంస్థలూ ఇవే పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. గత పన్నెండు నెలల్లో తాము లంచాలిచ్చినట్టు దాదాపు 66 శాతం సంస్థలు చెప్పాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'లోకల్‌సర్కిల్స్' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఇందులో భాగంగా, ఈ ఏడాది మే 22 నుంచి నవంబర్ 30 మధ్య దేశంలోని 159 జిల్లాల్లో సర్వే నిర్వహించి 18వేల స్పందనలను తీసుకున్నారు. ఈ సర్వే సమాచారం ప్రకారం.. ప్రక్రియ వేగవంతం కోసం 54 శాతం సంస్థలు బలవంతంగా, 46 శాతం సంస్థలు స్వచ్ఛందంగా లంచాలు చెల్లించాయి. అనేక వ్యాపారాలు అనామకంగా ఉన్నందున అనుమతి లేదా సమ్మతి ప్రక్రియను వేగవంతం చేయటానికి ప్రభుత్వ శాఖలను కావాలనుకున్నపుడు లంచాలు జీవన విధానంగా మిగిలిపోతాయి. అథారిటీ లైసెన్స్ పొందాలన్నా లేదా ఆస్థి విషయాలకు సంబంధించి ఏదైనా విషయంలోనైనా ఇది కనిపిస్తుంది. గత 12 నెలల్లో 66 శాతం వ్యాపారాలు ముడుపులు ముట్టజెప్పాయి. తాము ఎలాంటి లంచం చెల్లించకుండానే పని చేయించుకోగలిగామని 16 శాతం వ్యాపారసంస్థలు వెల్లడించాయి. తమకు అలా చేసే అవసరమే రాలేదని 19 శాతం వివరించాయి. అనుమతులు, సరఫరాదారు అర్హతలు, ఫైల్‌లు, ఆర్డర్‌లు, చెల్లింపులు సాధారణంగా నిలిపివేయబడిన వంటి విషయాల్లో ప్రభుత్వ ఏజెన్సీలతో వ్యవహరించేటపుడు ఈ రకమైన లంచం దోపిడీకి సమానమని సామాజికవేత్తలు అంటున్నారు. చాలా ప్రదేశాల్లో కంప్యూటరీకరణ జరిగినప్పటికీ ...5లో



సాహితీ వార్తలు

వర్తన ఆరవ సమావేశం

సాహిత్యరంగంలో నవీన ధోరణులు పాదుకొల్పాలన్న లక్ష్యంతో ఏర్పాటయిన వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆరవ సమావేశం ఈ నెల 12 గురువారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ సమావేశంలో 'తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం – ఆవశ్యకత – ఆచరణ' అనే అంశంపై సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి గుడిపాటి అధ్యక్షత వహిస్తారు. ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ సమన్వ యకర్తగా వ్యవహరిస్తారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

'ఎదురుచూపులు' కవితాసంకలనం ఆవిష్కరణ

కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో ప్రచురించబడిన 'ఎదురుచూపులు' కవితాసంకలనం డిసెంబర్ 11,2024న హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళామారుతి కళావేదికపై సాహితీవేత్త డా॥వోలేటి పార్వతీశం ఆవిష్కరిస్తారు. ఈ సభకు నేటినిజం సంపాదకులు బైసదేవదాసు అధ్యక్షత వహించగా, డా॥వై.రామకృష్ణారావు, గుదిబండి వెంకటరెడ్డి, డా॥పులివర్తి కృష్ణమూర్తి, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, కొసరాజు రాజేంద్రప్రసాద్, పొత్తూరి జయలక్ష్మి అతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా సాహితీకిరణం సౌజన్యంతో 'కన్నవారి కలలు–పిల్లల బాధ్యతలు' అనే అంశంపై నిర్వహించిన కవితలపోటీ విజేతలకు బహుమతి ప్రదానం కావించబడుతుంది.


పరిశీలనాత్మక కథలు బల్కావ్

చూసే సినిమాకు చదివే కథకు ఎంతో వ్యత్యాసం ఉంటుంది. సినిమా ఏ దృశ్యాన్ని చూపుతుందో మెదడు దానినే నిక్షిప్తం చేసుకుంటుంది. అదే ఏదైనా కథ చదువు తున్నప్పుడు ఊహకు రెక్కలు వస్తాయి. ఆకాశంలో విహరిస్తాము. ఏ ఒక్క ఆలోచనకు సరిహద్దులంటూ ఉండవు. అదే కదా కథ గొప్పతనం. అందుకే పేదరాశి పెద్దమ్మ కథల నుంచి ఇప్పటికీ కథ అంటే చెవి కోసుకొని వినాలనుకుంటారు. చదవాలనుకుంటారు. అందుకే కథలు ఇప్పటికీ పచ్చగా మనగలుగుతున్నాయి.

ఊహకు అంతం లేనట్లే, శ్రీ ఊహ కలానికి అందని సబ్జెక్టు లేదేమో అనిపిస్తుంది ఈ కథలు చదువుతున్నప్పుడు. ఒక కథా ప్రపంచాన్ని సృష్టించేటప్పుడు ఆ ప్రపంచం ఎంతైనా విస్తరించి ఉండొచ్చు. పంచభూతాలను ఏకం చేస్తూ ఏ అంశాన్నైనా ఎంపిక చేసుకోవచ్చు అది రచయితకుండే స్వేచ్ఛ. సౌలభ్యం. ఈ కథా సృజనలో శ్రీ ఊహ తనకున్న వెసులుబాటును చక్కగా వినియోగించు కున్నారనిపిస్తుంది. తాను ఊహించిన ప్రపంచానికి వాస్తవిక రంగులద్దారు.

ఇటీవలే ఇసుక అద్దం పేరుతో సరికొత్త కథలను తనదైన శైలిలో పరిచయం చేసారామె. ఆ కథలు పాఠకుల ఆదరణ చూరగొన్నాయి. తదుపరి పుస్తకం బల్కావ్ లోనూ వైవిధ్యమైన కథలను అందుబాటులోకి తెచ్చారు. బల్కావ్ అంటే బాల్కనీ. ఈ కథలను ఏ చాయ్ తాగుతూనో, ప్రకృతిని ఆస్వాదిస్తూనో ఒక్కో కథను చక్కగా ముగించవచ్చు. ముగించిన తరువాత కూడా కథావరణంలోకి చొచ్చుకొని పోయిన మనం అంత తొందరగా బయటకు రాలేము. ఆ బస్తీ గల్లీల్లోనో, ఆ రోడ్డైలపైనో కథల్లో తారసపడిన మనుషులను వెతుక్కుంటాం.

బల్కావ్‌లో పది కథలు ఉన్నాయి. పది కథలద్వారా పది ప్రపంచాలు పరిచయం అవుతాయి. ఒక కథ అకస్మాత్తుగా పాతబస్తీలో పరిచయమైతే మరో కథ ఏ వర్జీనియాలోనో మొదలవొచ్చు. పదింటికీ పది ప్రాంతీయ నేపథ్యాలు ఉన్నాయి. పది జీవన వేదనలు ఉన్నాయి. కథల కోసం ఎంపిక చేసుకున్న వస్తువులు కేవలం తన మస్తిష్కంలో పుట్టిన ఊహా నేపథ్యాలు మాత్రమే కావు. తనకు తెలిసిన చిన్న సంగతికి తనకేమాత్రం తెలియని అతిపెద్ద చరిత్రను వెతికి, పరిశోధించి కథలను పరిపుష్టం చేసిన శ్రమ కథలు. ఈ కథలను పరిశోధన పరిశీలన కలగలుపుగా చెప్పవచ్చు. ఈ ప్రక్రియ తనకు గొప్ప అనుభూతినిచ్చిందని ఒకచోట తన సంతృప్తి వెలిబుచ్చారు రచయిత్రి.



కథలను కథలుగానే చూడకుండా అందులోనే భాష కూడా ప్రత్యేకంగా నిలిచిందని చెప్పవచ్చు. అలాగే మనదైన ఈ భాషను ఆస్వాదించవచ్చు. గోవాలో ప్రారంభమయ్యే కథ కావచ్చు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నేపథ్యంలో జరిగే ఒక ధూల్పేట కుర్రాడు జీవనాన్వేషణ కావచ్చు. ప్రతి దాంట్లోనూ పొరలు పొరలుగా విడివడుతూ కథకు కొత్తదారులు మన ఊహ లోకంలోనే తెరుచుకుంటాయి. ఈ కథలన్నీ మనం చదువుతూ ఎంతవరకు ఊహించగలమో అంతటి ఊహకు అవకాశం ఉన్న కథలు.

సాధారణంగా ట్రావెలాగ్ అనగానే తాము వెళుతున్న లేదా తమ సందర్శించిన ప్రాంతాల చరిత్రను వాటిని సందర్శించిన అనుభూతులను పంచుకుంటూ ఉంటారు. శ్రీ ఊహ వీటికి తన మనసును జోడించారు. అందుకే ప్రతి కథలోనూ జీవన లాలస కనబడుతుంది. ఒక కొత్త ఆశను జోడించుకున్న ప్రేమైక కథలయ్యాయి. ప్రతి మనసు పడే సంఘర్షణకు అద్దంపట్టే కథలూ అయ్యాయి. ఒంటరిగా, స్వేచ్ఛగా ఒక ప్రాంతాన్ని సందర్శించినప్పుడు మనకు తెలియకుండానే సెల్ఫ్ రిఫ్లెక్షన్ ఏ రకంగా ఉంటుందో అనుభవ పూర్వకంగా చెప్తారు రచయిత్రి. తాను వెళ్లిన ప్రతి ఊరు ఒక కొత్త కథాస్థలే తనకు. తాను కలిసిన ప్రతి మనిషీ ఆమెకో హ్యూమన్ లైబ్రరీయే. తన వెతుకులాట అంతా కూడా వివిధ ప్రాంతాల్లోని మనుషులంతా ఒక్కటేనని, వారంతా సమానమైన జీవన వేదనలే అనుభవిస్తున్న వారని చెబుతారం. స్థలం, కట్టుబొట్టుల్లో మాత్రమే మార్పు ఉంటుంది అంటారు.

ఈ ప్రయాణాన్నంతటినీ తను 'ఒక సోల్ లిబరేటింగ్ ఎక్స్పీరియన్స్'గా చెప్పుకున్నారు. ఇది మాత్రమే కాదు విజయవాడలో ఆదిలాబాద్, వరంగల్, ఢిల్లీ, కోకాపేట్, బందర్ సీంద్రి తదితర ప్రాంతాల్లోనూ తాను స్వేచ్ఛగా సందర్శించి, తనకు కావలసిన సమాచారాన్ని సేకరించి దానికున్న ఆథెంటిసిటీని పరిశీలించి మరీ కథలుగా రూపుదిద్దిన ఈ ప్రయత్నానికి రచయిత్రికి ప్రత్యేక అభినందనలు. పుస్తకము చదువుతున్నంతసేపూ ప్రతి కథకు ఒక్కొక్క ప్రాంతాన్ని మనం సందర్శిస్తూ వెళ్ళిపోతూ ఉంటాము. ఆ కథలో మనము ఇమిడిపోయి ఆ ప్రాంతాల్లో ఆ పాతబస్తీ గల్లీలో మనము ఒక స్కూటీ వేసుకునో బైక్ లోనూ తిరుగుతూ అక్కడి ప్రజలను గమనిస్తూ ఉంటాం. ఇవన్నీ కూడా మనం సాధించుకున్న అనుభవాలే సాధిస్తేనే తప్ప తెలుసుకోలేని అనుభూతులు ఇక్కడ మరొక అంశాన్ని కూడా జోడించదలిచాను మహిళలు.. అందునా రచయిత్రులు ఏ బాదరబందీ లేకుండా వివిధ ప్రాంతాలను స్వేచ్ఛగా సందర్శించగలిగితే ఇటువంటి చక్కటి కథలు మరిన్ని వస్తాయని ఆశిస్తున్నాను.

- నస్రీన్ ఖాన్
writernasreen@gmail.com

రెక్కల కష్టం

రాళ్లపొలంలో నాగలికట్టి
సాలుకిరువాలుగా దున్నుతున్న
రైతన్న సేద్యంమీద
ఎన్ని జీవజాతుల భవిత దాగుందో!..

రోడ్డు పక్కన పండ్ల బండి
పెట్టుకుంది ఓ అక్క
అమ్ముడుపోనీ పండ్లవైపు చూస్తున్నప్పుడు
ఆ కళ్లలో ఎన్ని ఆకలి కావ్యాలో
లిఖించబడ్డాయో..

నెత్తిమీద కూరగాయల
గంప మోస్తున్న ఆమెపై
ఎంత మంది సన్నపిల్లల డొక్కలు
ఆధారపడ్డయో..

సంతలో పాత చీరల మూట అమ్ముడుబోతేనే
సాయబు ఆకలి తీరుతది లేదంటే
ఆ చీరలే ఉరితాళ్ళుగా మారుతాయోనని
ఆ సంతలో ఎన్ని దుఃఖపువాగులు పారెనో..

ప్రభుత్వ కొలువుకోసం
గ్రంథాలయాలలో అర్థరాత్రి దాకా
చదివే నిరుద్యోగి ఉద్యోగంపై
ఏ తల్లిదండ్రుల
కలలపంటలు దాగున్నాయో..

వరి కోతకు వంగి వంగి లేసి చూస్తూ
బొబ్బలుపోయిన అమ్మ రెక్కలపై
ఏ బిడ్డ బంగారు భవిష్యత్తు దాయబడిందో..!

బస్తాలమీద బస్తాలు మోసి
దేహంపై చెమట నది పారిస్తున్న నడుములపై
ఏ కన్న కొడుకు బత్కు
రూపుదిద్దుకుంటుందో..!

పేదలకు రెక్కలే ఆస్తులు
ఆ రెక్కలమీదనే బత్కుదెరువుకు
పునాదులు తవ్వుకుంటారు..

-అవనిశ్రీ.
9985419424.

14న 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్' పుస్తకావిష్కరణ

ఈ నెల 14 న రవీంద్రభారతి మినీ కాన్ఫరెన్సు హాల్లో కుందుర్తి కవిత 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్', ఫ్రీవర్స్ ఫ్రంట్ వాట్సాప్ సమూహం పోటీ కవితల సంకలనం 'ఆనవాళ్ళు' ఆవిష్కరణ ఉంటాయి. సభలో శివారెడ్డి, శిఖామణి, శీలా సుభద్రాదేవి, అనిల్ డ్యానీ, శ్రీరామ్, సమత తదితరులు పాల్గొంటున్నారు.

కులకష్పే

మంద వెట్టి శెండ్లల్లా వడకుంటా
సుట్టు జాలనో తడకలో కట్టినట్లు
మనం అక్షరాల వైపు పోకుంటా
కాళ్ళకు సూట్టుకున్న కులకష్పేను
పాతాళానికి దిగ్గొట్టేందుకు
క్రాంతి కొయ్యల జాడ దోరుకుతదేమో లెంకలే

పాల్మర్వని పిల్లలు
తల్లేంబడి వడకుంటా గూద్మా గప్పినట్టు
బడిబాట పట్టకుంట
మనల్ని నిర్బంధించిన కులకష్పే
గప్పను ఎత్తెందుకు
హైడ్రలెమన్న ఇటుబందుకు
అస్తున్నయేమో సూడలే

మేత కోసం మందను మన్నెం తోలినట్టు
కులకష్పేను ఏ గుట్టకన్న గెద్మి
మనల పుస్తకాలు పట్టిపిచ్చేందుకు
సుట్టు ఏడెదు పద్నాలుగు ఊర్ల అవుతలన్న
మాయల మరాఠీ పాణం చిలుకలున్నట్టు
సూది మొనంత అవకాశం ఉన్నదేమో అడిగి రావలే

మంద ఆకలి దిర్స తుమ్మకాయ దులిపినట్టో
యాపమండ నరికినట్టో
అడువులకు జోగు దొలుతున్న కులకష్పే
అంటును నరికి పలక బలపల సద్ది గట్టే
గొడ్డలసుంటి గట్టి సుట్టమేవరన్న
మనకున్నరేమో ఆలోచన జేయ్యలే


గొవర్దన గిరిని మొసినట్టు
2020 విజన్ దాటేసి అచ్చిన
నిరక్షరాస్యతను భుజాల మీద ఎత్తుకుని
మొస్తున్న
జాతి కులకష్పేను దించి
అక్షరాలతో 2050 వైపుకు నడిపించే
అల్లా ఉద్దీన్ అద్భుత దీపం
ఎమన్నా ఉన్నదేమో కనుగొనలే

అక్కడిక్కడ దేవులడుతు ఎతుకుదు బంజేసి
ఇంకా కులకష్పేనే బతుకుదెరువు
జేసుకొని బతుకుమని
కుల పథకాలు పెడుతున్న
పాలకుల కుతికే విస్కలా
అప్పుడే సుద్దముక్క మన చేతిలోకచ్చి
విద్యతో విలువైన ఆయుధంగా తయారవుతం

- జి.యం.నాగేష్ యాదవ్
9494893625

ప్రజలకు చేరాల్సిన కథలు 'చారల పిల్లి'

చారల పిల్లి పుస్తకంలో వేంపలదిశీఅవగ్లె షరీఫ్ రాసినవి కథలుగా బయటికి కనిపిస్తున్నా వాటిలో అంతర్లీనంగా ఒక వాస్తవికత, దానితో అనుసంధానించి ఒక అనుభవం, దాన్నుంచి సమాజానికి ఒక సందేశం, ఓ హెచ్చరిక, ఓ సూచన దాగి ఉన్నాయి. అవన్నీ అవగాహన చేసుకున్నప్పుడే ఆయన కథల తాలూకు పూర్తి ప్రయోజనం నెరవేరినట్టు. పుస్తకంలో అన్ని కథలూ బావున్నా ప్రధానంగా "సైకిలు చక్రాలు', 'చారలపిల్లి', "పత్తి గింజలు" అనే మూడు కథల గురించి మాట్లాడుతాను. వీటి గురించే ఎందుకు ప్రస్తావించాలనుకుంటున్నాను అంటే ఈ మూడు కథలను ఒక అంతస్సూత్రం బంధిస్తూ కనిపిస్తుంది కాబట్టి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో ఏదో ఒక కారణంగా యుద్ధవాతావరణం నెలకొని ఉంది. అది ప్రచ్ఛన్న యుద్ధం కావచ్చు, ప్రత్యక్ష యుద్ధం కావచ్చు. మనదేశంలో కూడా కంటికి కనిపించని యుద్ధం (రెండు మతాల మధ్య) జరుగుతోంది. దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఇలా ఎన్నో మతాల వారున్నా ముఖ్యంగా హిందూ – ముస్లిముల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉంది. కారణాలు ఏవైనా కానీ పరాకాష్టకు చేరుతున్న ఈ ఘర్షణ వాతావరణానికి పునాదులు ఎలా పడతాయి? అవి తిరగకూడని మలుపులు (ఉగ్రవాదం వంటి) ఎలా తిరుగుతున్నాయి? వాటికి అసలు



పరిష్కారం సాధ్యమా? వంటి విషయాలు ఈ కథల్లో అంతస్సూత్రంగా కనిపిస్తాయి. నేరుగా మీదేసుకుని చెప్పకుండా రచయిత కథను చెబుతూ మనకు అనేక విషయాలు బోధపరుస్తాడు. ఇక్కడ ఇతను చూపిన నైపుణ్యం ఇప్పటి కథకుల్లో అరుదైందిగా భావించాలి. 'పత్తిగింజలు' కథలో (ఘర్షణ వాతావరణానికి పునాదులు), చారలపిల్లిలో(తిరగకూడని మలుపులు), 'సైకిలు చక్రాలు లో ఈ సమస్యలకి పరిష్కారాలు కనిపిస్తాయి. మతోన్మాదం ఇప్పుడు దేశాన్ని పట్టిపీడిస్తోంది. అది ఏ మతానికి చెందినదైనా కావొచ్చు. దీని వల్ల ఎన్నో దారుణ మారణకాండలు జరుగుతున్నాయి. సమాజంలో వ్యక్తుల మధ్య వైషమ్యాలు లేకపోయినా, కొన్ని స్వార్థశక్తులు తమ ప్రయోజనాలకోసం సాగించే క్రీడలో సమాజం బలి అవుతోంది. దిక్కుతోచని స్థితిలో ఆక్రోశిస్తోంది. కురుక్షేత్ర సంగ్రామ యుద్ధంలో కర్తవ్య విమూఢుడైన అర్జునుడిలా ఆక్రోసిస్తున్న సమాజానికి, ఈ మూడు కథలు షరీఫ్ చేసిన గీతోపదేశాలు. ఈ కథలను పూర్తిగా చెబితే పాఠకులకు అందే అనుభూతి తగ్గిపోతుంది. అందుకే కథల కన్నా వాటిల్లోని సారం మీదే మాట్లాడాను. సమాజానికి ఈ కథల అవసరం ఉంది. వీటిని అర్థం చేసుకుని ముందుకు సాగితే, ఏ కుటిల శక్తులు మనుష్యుల మధ్య అంతరాలు సృష్టించలేవు. రచయిత నర్మగర్భంగా చెప్పిన ఈ అంశాలు ప్రజల మధ్యకు తీసుకు వెళ్లేందుకు విజ్ఞులు, మేధావులు కృషిచేస్తే బావుంటుంది. ఈ రచన విస్తృతంగా ప్రజలను చేరాలి.

- కె. లక్ష్మి
78935 19128

కనిపించని కుశల ప్రశ్నలు


పెనకలో దోపిన పాత కాయితం ఒకటి
కుంభ నిద్ర నుండి తెలివికున్నదేమో
పరాకులో నేల మీద పడి చిట్లిపోయింది
విరిగిపోయిన అక్షరాలు కొన్ని
పాలిపోయిన అక్షరాలు ఇంకొన్ని
కొన ఊపిరితో ఉన్నవి మరికొన్ని
అన్నిటికీ అన్ని కొట్టుమిట్టాడుతున్నవే
రూటం మాత్రం పదిలంగానే ఉంది

చానడు మాటకలుపులతో ఉన్న
ముందు జమనా ఉత్తరం ముక్క
బంధువులందరినీ పేరుపేరునా పలకరిస్తూ
ఆత్మీయత, అనుబంధాల కుశల ప్రశ్నలతో
ప్రేమానురాగాలకు రుజువుగా
ఎలాగోలా మిగిలిపోయిన కులాసాల ముక్క
చివరిలో.. మీ యోగక్షేమాల కొరకు
వేయి కళ్ళతో ఎదురుచూస్తుంటాం!

చదువుతున్నప్పుడు మైమరచిపోయి
సెల్‌ఫోన్‌తో మమతానురాగాలు తరిగి
బంధాల మధ్య కనిపించని కుశల ప్రశ్నలతో
పానుగొట్టుకున్నదేదో కళ్ళంట పూసింది
ఏకరవు పెట్టి పదే పదే మోగుతున్న
సెల్‌ఫోన్‌తో తెములుకొని తీరా చూస్తే
రానొచ్చిందొక్కటీ ఉత్తరం లాంటిది లేదు
అన్నీ, పైసల పత్రాకుల పరుగూ నడకలే!

- వినోద్ కుత్తుం, 9634314502

ఊరి తలపోత, యాదుల నెమరేత



రెండోగుండె లాంటిది గతం ..అది లోలోపల లోలకంలా కొట్టుకుంటుంది... అందరి మానసిక స్థితీ అంతోఇంతో అంతే కానీకొందరు మాత్రమే మనసు అనే స్కైత్ తో దాని వేగాన్ని కనిపెట్టగలరు. గతంలో ఏముంటుంది ఏమున్నా ఉండకపోయినా కోల్పోయినతనం ఉంటుంది కోల్పోయిన బాల్యం, స్నేహాలు, అనుబంధాలు ఆప్యాయతలు, ఇవి అందరిజీవితాల్లోనూ ఉంటాయి. కానీ సొంతఊరినే కోల్పోతే ఉనికినేకోల్పోవటం అది ఆఊరందరికీ ఊరంతటి విషాదం. ఇది చెల్లాచెదురైన జీవితాలకోసం గాలింపు , మొన్నల్లో మాయమైన మనుషులకై వెతుకులాట.. స్నేహాలు, ఆప్యాయతల్ని కోల్పోయిన ఒక పసివాడి పరితాపం.. సింగరేణి ఇనుపకాళ్ల కిందనలిగిన అల్లీపూలకు కు ఊరిచెరువు రాసుకున్న ఎలిజీ..

అందరికీ నోరున్నా కొందరు మాత్రమే పాడగలరు.. అందుకే ఊరందరి కంఠాల్ని తన గొంతులో కూర్చుకొని ఆ బ్లాక్ అండ్ వైట్ గురుతుల్ని మన కళ్లముందు రంగుల్లో నిలిపే యత్నమే ఈ పుస్తకం.. కవి, కథకుడు, ఆక్టివిస్ట్ నరేష్ కుమార్ సూఫీ వెలువరించిన 'మెమొరీస్ ఆఫ్ మంగలి పల్లె' పుస్తకం నిండా గుండెను తడిచేసే అనేక యాదుల మనాదులు. గుల్ దస్తా లాంటి ఈ పుస్తకానికి అరుణాంక్ లత రాసిన ముందుమాట కథల ప్రత్యేకత ఏమిటో తెలియజేస్తుంది.

ఇసుక తింటూ బొగ్గు విసర్జిస్తూ లోలోపల కుములుతున్న కుప్ప కూలుతున్న అండర్ మైనింగ్ కాదు.. ఇది ఊరిని ఉమ్మడి సంస్కృతిని, చెరువుని చెట్టుచేమని నోరుతెరిచి మింగిన ఓపెన్ కాస్ట్..

చెట్టును నరికేశాక పిట్టలదైన్యం ఈ పుస్తకంలోని కథనాల సారాంశం. మరో తావుకు ఎగరలేక గొడు కూలిన చోట ఉండలేక గుండె తండ్లాట. అక్కడ మాయం చేయబడ్డది భౌతికంగా ఊరినే కాదు పల్లె అనుబంధాలను. ఆప్యాయతలను తవ్విన ఆ శిథిలాలనిండా గతం తాలూకు అస్థి పంజరాలు. చుట్టూ పరిచిన ఎత్తు గుట్టల్లాంటి మట్టిదిబ్బలు గతం సమాధులు. ఖమ్మంలోని ఎస్ ఎస్ పీ క్యాంపు క్వార్టర్స్ కూల్చివేసి స్థానికులను నిర్వాసితులను చేసిన సందర్భంలో ఉప్పొంగిన కన్నీళ్ళు, వియోగాలు, చెల్లా చెదురైన స్నేహాలు, బంధుత్వాలు మరింత భారంగా మారిన బడుగు బలహీనుల బ్రతుకులు స్వయంగా చూసినవాడ్ని..శిథిలాల్లో మొలిచిన అక్షరాలపేరుతో కన్నీళ్ళకు కవిత్వం కట్టిన కవుల్లో నేనూ ఒకడ్ని.. ఒక ప్రాంతాన్ని ధ్వంసం చేస్తేనే అంత విషాదం విస్ఫోటనమైతే ఇక ఊరికి ఊరినే ఊడ్చేస్తే మరెంత ఉత్పాతమో... మీఎది మీదే మాది మాదే అన్న వేర్పాటు వాదం నేపథ్యంలో, తెలంగాణలో కథ ఉందా లేదా, కవిత్వం ఉందాలేదా అన్న చర్చల సందర్భంలో వెలువడిన నిఖార్సు తెలంగాణ సమాధానం.


కంచర్ల శ్రీనివాస్
9640311380

తెలంగాణదే సంస్కృతి సౌరభం.. అందులో నల్ల వజ్రాల గని సింగరేణిది మరింత వత్తైన నిశానీ.. సింగరేణి ఫ్లేవర్ తో వొచ్చిన ఈ కథలు నల్లబొగ్గు పెళ్ళలంత అందంగా, ఎర్ర నిప్పుకణికలంత భావసాంద్రంగా ఉన్నాయి.. రోజూ ఉదయాన్నే ఇళ్ల ముందు వెలిగే బొగ్గు పొయ్యిలు, ఆవాసన సింగరేణి అస్థిత్వాన్ని పట్టిచూపుతుంది. 7వ తారీకు జీతాలు ఆ హడావుడి ఆ పండుగ ఆ దావత్ లు, ఆప్రభావంతో వెలిగే వ్యాపారాలు కోల్ బెల్ట్ నల్లమట్టిలో విరిసే రంగు సింగిడి ప్రత్యేకత. కొత్తగూడెం, ఇల్లెందు, 8 ఇంక్ లైన్, వెంకటేష్ ఖని బొగ్గుబాయి ముంగిళ్ళలో గడిపిన నా.. నాన్ సింగరేణి బాల్యానికి ఆదృశ్యాలు పరిచితమే.

ఈ పుస్తకంలో ఇరవైఒక్క కథలున్నాయి కథలన్నీ రచయిత పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతాయి.. పుస్తకానికి ఎంచుకున్న ముఖ చిత్రమే గాఢమైన భావనను కలిగి ఉంది.. ఎడారి లాంటి ఊరినుంచి తన తల్లితో కలిసి నడుస్తున్న పిల్లవాడి దుఃఖపువెక్కిళ్ళకు చిత్రరూపం. విచ్ఛిన్నమైన ఉమ్మడి సంస్కృతికి దృశ్యరూపం ఈ కథలు. విధ్వంసానికి గురికాబడ్డ పల్లె తనానికి దర్పణాలు.

తెలంగాణ మాండలిక మాధుర్యం ఈ కథలకు ఆయువుపట్టు.. గుండెను కదిలించే మనస్సును చెమ్మబరిచే అంశాలను వస్తువులుగా ఎంచుకోవటంతోపాటు రచయిత తనదైన శైలిలో చెక్కిన శిల్పం మరో ఆకర్షణ. గతంఉన్న ప్రతివారికీ కనెక్ట్ అయ్యే కథలివి..ఇవి ఉబుసుపోని ముచ్చట్లు కావు దశాబ్దాలుగా మోస్తున్న గుండెనుండి దించుకున్న ఆవేదనా భారాలు.

ఈతరహా తలపోత కథలు తెలుగు సాహిత్యానికి కొత్తేం కాదు గతంలో నామిని, ఖదీర్ బాబు అనేకమంది తమ అస్థిత్వ యాదులను తలపోతలను కథలుగా పరి చారు. ఆ కథలు ఎంతటి విశిష్ట స్థానాన్ని పొందాయో ఈకథలూ వాటికి తక్కువ కాకుం డా ఉన్నాయి. పల్లె మంత్రసానులు, వీధి బళ్ళు, గ్రామీణ ఫొటోగ్రాఫర్లు, మెకానిక్‌లు, పంచరు దుకాణాలు, టైలరింగ్ షాపులు, చిల్లర కొట్లు, కాకా హొటళ్లు, ఇట్లా ఎన్నో చేతివృత్తులు చిరు వ్యాపారాలు కళ్లముందు మెదులుతాయి.

అగ్రవర్ణాల అహంకారాలకు గురైన కొన్ని కులాల దైన్యం ఈకథల్లో ఉంది.. ఆనాటి ఆవేదనకు ఇప్పటి అక్షర రూపం.. అమానుషం మరిచిపోలేదన్న సాక్ష్యం.. వేటికవే విభిన్నతను కలిగిఉన్న ఈకథలను అన్నీ చదివి తీరాల్సిందే ప్రత్యేకంగా ఒకటో రెండో కథలను పరిచయం చేయటంకన్నా అన్ని కథలతో స్నేహం చేయాలి.. అనపపూల వాసన, మా ఊరిసమ్మక్క జాతర, మొంబత్తీల పండుగ, మావాడ చెట్ల తీర్థాలు, అల్లీపూలు, పోశమ్మ శిలుకలు ఔసులోళ్ళ రమేష్, మా అమ్మ మంత్ర సాని, గంగ నీళ్ల తొవ్వ, నారాయణ సావుకారి, పాటల దావత్, జమాల్ ఓటల్ కథల శీర్షికలన్నిటిలో తెలంగాణ పరిమళం...కథలు చదివాక అనేక పాత్రలు మనకళ్లల్లో చిరస్థాయిగా మిగులుతాయి. ■

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అధోగతి

- కాంగ్రెస్ పాలనలో సమానంగా సంక్షేమం,అభివృద్ధి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ- మరిపెడ

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, వారు చేసిన రూ.7వేల కోట్ల పైచిలుకు అప్పులకు వడ్డీలు కడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెద్ల లెక్క సమానంగా నడుపుతూ ముందుకు తీసుకెళుతున్నామని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం కేంద్రంలో అమృత్ పథకం కింద రూ.25.58కోట్ల అంచనాతో అభివృద్ధి కార్యక్రమాలు, కురవి మండలం కందికొండలో సుమారు రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాలల భవన సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పండిన మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తున్నదని అన్నారు. సన్న రకాలకు రూ.500 బోనస్‌తో పాటు రైతులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్టు చెప్పారు. పేదవారి కలలను నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టి రూ.5లక్షల రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అన్ని తరగతుల ప్రజలు కుల, మత భేదం లేకుండా ఒకే దగ్గర చదువుకునేలా కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారికత, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉచిత బస్సు సర్వీసు, పేద విద్యార్థులకు భారం కాకుండా మెస్ చార్జీలు పెంచడం, క్షేత్రస్థాయిలో గ్రామీణ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జిల్లా అధికారులు కిరణ్‌కుమార్, మరియన్న, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, హౌసింగ్, మెప్మా జయ శ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో కేంద్రం బాధ్యతలను విస్మరించడం తగదు

- రైతు బిడ్డగా తెలంగాణ తల్లి విగ్రహం
- రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం : కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రైతులకు రుణమాఫీ చేసే విషయంలో ఒక రాష్ట్రానికే బాధ్యత ఉంటుందా.. కేంద్రానికి బాధ్యత లేదా అని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యూపీఏ హయాంలో కేంద్రమే బాధ్యత తీసుకుని రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిర భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బిడ్డను పోలి ఉండేలా విగ్రహాన్ని రూపొందించినట్టు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు విషయంలో బీఆర్ఎస్ విమర్శలు తగవన్నారు. తెలంగాణ తల్లి అనేది సామాన్యుల తల్లి, అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం, రూ.500లకే సిలిండర్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రైతులు పండించిన సన్న రకం వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వడం లేదన్నారు. మహిళా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో అమలు చేస్తున్నామన్నారు. దేశంలో మీరెక్కడైనా అమలు చేస్తున్నారా అని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాను ప్రశ్నించారు.

ప్రభుత్వాధికారులకు ఆమ్యామ్యాలు

(మొదటిపేజీ తరువాయి)

'వ్యాపార ముడుపులు' కొనసాగుతున్నాయి.

అవినీతిని తగ్గించటానికి ప్రభుత్వం ఈప్రొక్యూర్‌మెంట్ వంటి పద్ధతులను తీసుకొచ్చినా.. సప్లయర్ క్వాలిఫికేషన్, బిడ్ మ్యానిప్యులేషన్, సర్టిఫికెట్, పేమెంట్ పూర్తికి సంబంధించిన విషయాల్లో ఇంకా అవినీతి కనబడుతున్నది. 75 శాతం ఆమ్యామ్యాలు న్యాయ, మెట్రాలజీ, ఫుడ్, డ్రగ్, ఆరోగ్యం వంటి విభాగాల అధికారులకు వెళ్లాయి. అలాగే, జీఎస్టీ అధికారులు, కాలుష్య నియంత్రణ విభాగం, మునిసిపల్ కార్పొరేషన్, విద్యుత్ విభాగాల్లో లంచాలు చెల్లించినట్టు సంస్థలు తెలిపాయి. అనేక సంస్థలు.. విధానాలు, విధానాల పరంగా కనీస స్థాయిని నిర్వహించటం ద్వారా ఎలాంటి నియంత్రణ పరిశీలనా, శిక్షా చర్యలూ ఉండవని అనుకుంటాయని అవినీతి వ్యతిరేకత అంశంపై మాట్లాడుతూ డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఆకాశ్ శర్మ అన్నారు. బలమైన అవినీతి-వ్యతిరేక కార్యక్రమాన్ని ఆయన సూచించారు.అవినీతి అంతం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కొందరు అధికారులకు ఆయుధంగా మారుతున్నదని మేధావులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి వ్యతిరేకంగా పలు చట్టాలు, సంస్థలు వంటి వ్యవస్థ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో బలంగా పని చేయకపోవటం కారణంగానే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి, అవినీతిపై రాజీలేని పోరాటం చేయాలని వారు సూచిస్తున్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లతో పాటు ఈఎస్ఐ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని కోఠిలో ఆ సంఘం మొదటి జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రఫూఫ్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి వంది మంది నాయకులు హాజరయ్యారు. రిమోట్ గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీల అలవెన్స్, 142 జీవో సవరణ, టీవీవీపీ ని డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చు, ఈఎస్ఐ డైరెక్టర్‌గా డాక్టర్‌ను నియమించడం తదితర డిమాండ్లపై సమావేశంలో చర్చించి తీర్మానించారు. ఈ డిమాండ్లతో వచ్చే వారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్టు నాయకులు తెలిపారు.

ఏడాదిలో రూ.90 వేల కోట్ల పెట్టుబడులు

ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధికి కొత్త పాలసీ తెచ్చాం | **టీ ఫైబర్‌తో మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్ సేవలు : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలో రూ.90 వేల కోట్ల పెట్టుబడులు సమీకరించిందని ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రజావిజయోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని పార్క్‌హయత్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు కంపెనీలతో పెట్టుబడులకు సంబంధించిన ఎంవోయూలను కుదుర్చుకుంది. టీఫైబర్, మీ సేవ, టీ-వర్క్స్, టీజీన్యాబ్ అప్లికేషన్, అడెక్స్, ప్రాజెక్టు సన్మతి మొదలగు ఐటీ సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో రూ.40 వేల కోట్లు, అమెరికా, దక్షిణకొరియా పర్యటనలో రూ.32 వేల కోట్లు, స్థానికంగా మరో రూ.19 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాల పోటీలను తట్టుకుని తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలను ఒప్పించామని పేర్కొన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడం ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నామని చెప్పారు. పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే వారికి అనుమతుల నుంచి మొదలుకుని రాయితీల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధివిధానలతో ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. గత సర్కార్ పదేండ్ల పాలనలో రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు పీకల్లోతు కష్టాల్లో కొట్టుమిట్టాడాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే వాటి స్థితిగతులపై అధ్యయం చేసి దేశంలోనే మొదటి సారిగా కొత్త ఎమ్ఎస్ఎమ్ఈ పాలసీ తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. పదేండ్లుగా రాయితీలు అందక ఈ రంగానికి వివిధ సబ్సిడీల రూపంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,000 కోట్లకు చేరుకున్నాయని చెప్పారు. వీటన్నింటిని దశల వారీగా చెల్లించేందుకు తమ సర్కార్ సిద్ధంగా ఉందని అన్నారు. టీఫైబర్ సేవల ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. దీని ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీ వినియోగించవచ్చని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద పెద్దపల్లి జిల్లాలోని అడవి శ్రీరాంపూర్, సంగారెడ్డి జిల్లాలోని సంగుపేట, నారాయణపేట జిల్లాలోని మద్దూర్‌లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటి పని తీరు ఆధారంగా మార్పులు, చేర్పులు చేసి త్వరలో రాష్ట్ర మంతా విస్తరిస్తామని పేర్కొన్నారు. అడవి శ్రీరాంపూర్, మద్దూర్ వాసులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీ సేవ ద్వారా కొత్తగా 150 రకాల పౌర సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగానికి సేవలందించేందుకు అడెక్స్, మాదకద్రవ్యాలను నివారించేందుకు టీజీన్యాబ్ అప్లికేషన్, గ్రామీణ, అల్పాదాయ వర్గాల్లోని మహిళకు డిజిటల్‌పై అవగాహన పెంచేందుకు ప్రాజెక్టు సన్మతి యాప్‌లు ఎంతగానో ఉపయోగ పడుతాయని మంత్రి పేర్కొన్నారు.



నాలుగు కంపెనీలతో ఎంవోయూలు కొత్తగా 5,200 మందికి ఉద్యోగాలు

కొత్తగా నాలుగు ప్రముఖ కంపెనీలతో పెట్టుబడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలను కుదుర్చుకుంది. ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీ రూ.800 కోట్లు, ప్రీమియర్ ఎనర్జీస్ 1,950 కోట్లు, ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ కంపెనీ సోలార్ రంగంలో రూ.3,342 కోట్లు, లెన్స్‌కార్ట్ సంస్థ రూ.1,500 కోట్లు మొత్తం రూ.7,592 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటికి సంబంధించి ఆయా సంస్థల ప్రతినిధులు మంత్రి సమక్షంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. వీటి ద్వారా 5,200 మందికి ఉద్యోగ అవకాశాలు అందనున్నాయి. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ మల్సూర్, టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.వి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఆజాద్ ఇంజినీరింగ్, లెన్స్‌కార్ట్, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రతినిధులు భూపతి రాజు, అమిత్ చౌదరి, రేవతి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌కు అమెరికా నుంచి డాలర్ల వరద

- సాయాన్ని వేగవంతం చేసిన బైడెన్ సర్కారు
- ట్రంప్ అధికారంలోకి రావటానికి ముందు కీలక పరిణామం



వాషింగ్టన్ : అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌కు సాయాన్ని వేగవంతం చేశారు. ఆ దేశానికి మళ్లీ డాలర్ల వరదను పారించారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేసే రోజు దగ్గరపడే కొద్దీ.. బైడెన్ సర్కారు ఉక్రెయిన్‌కు సాయాన్ని వేగవంతం చేస్తుండటం గమనార్హం. తాజాగా ఉక్రెయిన్‌కు దీర్ఘకాలంలో దాదాపు బిలియన్ డాలర్లు (రూ.8.4వేల కోట్లు) సాయం చేస్తామని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ప్రకటించారు. ఇప్పటికే దేశ కాంగ్రెస్ ఆమెదముద్ర వేసిన ప్యాకేజీల మొత్తాన్ని ట్రంప్ కార్యవర్గం అధికారం చేపట్టకముందే.. కీవ్‌కు అందజేసేందుకు తొందరపడుతోంది. "త్వరలోనే ఈ బాధ్యత కొత్త ప్రభుత్వం చేతికి వెళ్తుంది. వారే ఈ యుద్ధం ఏ మార్గంలో వెళ్లాలో నిర్ణయిస్తారు. మేము కొన్నేండ్లుగా వేసిన బలమైన పునాదిపై వారూ ముందుకెళతారని ఆశిస్తున్నాను" అని లాయిడ్ ఆస్టిన్ వివరించారు. ఈ తాజా ప్యాకేజీల్లో డ్రోన్లు, హిమార్స్ రాకెట్ వ్యవస్థల్లో వాడే మందుగుండు సామగ్రి వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధం ఉన్న దశను బట్టి వీటి అవసరం చాలా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్ సెక్యూరిటీ అసిస్టెన్స్ ఇనీషియేటివ్ కార్యక్రమం కింద వీటిని అందిస్తున్నారు.

భవిష్యత్తులో యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ఆయుధ సామగ్రి అందజేస్తున్నామని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 725 మిలియన్ డాలర్ల ప్యాకేజీని ఇటీవలే ప్రకటించారు. తాజాగా దానికి అదనంగా 988 మిలియన్ డాలర్ల సామగ్రిని ఇస్తామని బైడెన్ కార్యవర్గం ఉక్రెయిన్‌కు హామీ ఇచ్చింది. అమెరికా నుంచి కీవ్‌కు 2022 నుంచి ఇప్పటి వరకు 62 బిలియన్ డాలర్లు ఆయుధాలు, ఇతర సాయం అందించారు. ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌పై రష్యా దాడులను గణనీయంగా పెంచింది. దీనికి తోడు ఉత్తర కొరియా దళాలు కూడా వచ్చి పోరాడటం మొదలు పెట్టాయి. అమెరికా మిత్ర దేశమైన డెన్మార్క్ ఇప్పటికే ఉక్రెయిన్‌కు రెండో విడత సాయం కింద ఎఫ్-16 యుద్ధ విమానాలను ఇటీవలే అందించింది. వీటి సాయంతో తాము రష్యా క్షిపణులను కూలుస్తున్నట్టు జెలెన్‌స్కీ కూడా ధ్రువీకరించారు. రెండేండ్ల నుంచి జరుగుతున్న భీకర యుద్ధంలో నాటో కూటమి ఉక్రెయిన్‌కు అండగా నిలిచింది. ఇటీవల రష్యా భూభాగంలో దాడులకు వీలుగా దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగానికి కూడా అమెరికా నుంచి కీవ్‌కు అనుమతులు లభించాయి.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలిరండి

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీ ఎత్తున తరలి రావాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి ఆయన పార్టీ నాయకులతో ఆయన జూమ్‌లో మాట్లాడారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మెన్లతో ఆయన మాట్లాడారు. ఏడాదిలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. మోజార్టీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఏడాది పాలనపై ప్రభుత్వం నిర్వహిస్తున్న సభలకు ప్రజలు లక్షలాదిగా తరలి వచ్చారని అన్నారు. సోమవారం జరిగే ముగింపు ఉత్సవాల్లో భాగంగా సచివాలయం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు.

విగ్రహ రూపశిల్పి రమణారెడ్డికి అభినందనలు

రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ అమరవీరుల జ్యోతి రూపశిల్పి రమణారెడ్డిని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. తెలంగాణ తల్లి విగ్రహంలో అమరవీరుల పిడికిళ్లను జోడించడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

హక్కులతో పాటు బాధ్యతల కోసం పరిశ్రమించాలి

- రేపటి భారతావనిలో నైతిక విలువలు పెంచాలి : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హక్కులతో పాటు బాధ్యతల కోసం పరిశ్రమించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎస్‌టీయూటీఎస్ 78వ వార్షిక కౌన్సిల్ సమావేశాలు పర్వతరెడ్డి అధ్యక్షతన జరిగాయి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి భావి భారతావనిలో నైతిక విలువలు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఉపాధ్యాయులకు హక్కులతో పాటు ప్రశ్నించే తత్వాన్ని సామాజిక కోణాన్ని అలవాటు చేయడం మంచి పరిణామమన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా కొనసాగడం, క్షేత్రస్థాయిలో అసంబద్ధతలను విధానాలను సలహాలను సూచనలను ప్రభుత్వానికి నివేదించడం అభినందనీయమన్నారు. రాజ్యాంగ విలువల కోసం పరిశ్రమించే వారికి అన్ని రకాల మద్దతు లభిస్తుందని హామీ ఇస్తూ ఇటీవల విద్యార్థులు ఉపాధ్యాయులపై దాడి చేయడం బాధాకరమన్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా రేపటి తరానికి నైతిక విలువలను పెంపొందించాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగం, ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా ఉండడం శుభసూచకమన్నారు. సమస్యల పరిష్కారంలో తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. సంఘం పూర్వ అధ్యక్షులు ఏపీ మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ బలపరిచిన, జాక్టో ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థి పూల రవీందర్,ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, ఎస్‌టీయూ ఏపీ అధ్యక్షులు సాయిశ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- రాజ్యాంగ, మౌలిక విధానం, లౌకికతత్వాన్ని కాపాడాలి : టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభల్లో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, రాజ్యాంగ, మౌలిక విధానం, లౌకికతత్వాన్ని కాపాడాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభల్లో నాగేశ్వర్ పాల్గొని మాట్లాడారు. ఈ దేశ ఐక్యతను, ప్రతిష్టతను, అభివృద్ధిని చాటే భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, సామ్యవాదం.. అంశాలను తొలగించాలని ఆలోచనలు చేయడం అభివృద్ధి నిరోధకాలే అవుతాయన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు గడిచిన సందర్భంగా ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలైనా లౌకికవాదం, సామ్యవాదం తొలగించాలనే ఆలోచన చేయడం సరైంది కాదని, వాటి మీద చర్చను కూడా జరపాల్సిన అవసరం లేదని తోసిపుచ్చిందని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం కొన్ని మౌలిక అంశాల ఆధారంగా నిర్మించబడిందని తెలిపారు. పార్లమెంటుకు రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఉందా.. అనే వాదనకు ఆయన రాజ్యాంగం మార్చే అధికారం లేదని, రాజ్యాంగంకు లోబడే పని చేయాలన్నారు. భారతదేశం వివిధ మత విశ్వాసాలతో కూడినదని, మత విశ్వాసాన్ని రాజ్యానికి రుద్దొద్దని హితవుపలికారు. ఎవరి మతం వారు స్వేచ్ఛగా విశ్వసించవచ్చని, ఇతర మతంపై పెత్తనం చెలాయించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఆర్టికల్ 14 ప్రకారం పౌరులందరూ సమానులే అని ప్రాథమిక హక్కుగా చేర్చాలన్నారు. సోషలిస్టులుగా ఉండాలా క్యాపిటలిస్టులుగా ఉండాలా అనేది ప్రజలు నిర్ణయిస్తారని అంబేద్కర్ అన్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు పుస్తక పఠనానికి దూరం కాకూడదని, నిత్యం నిత్య విద్యార్థులుగా అధ్యయనం పెంపొందించుకోవాలని తెలిపారు. భారత దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, కాబట్టి ఆ గురుతర బాధ్యత నిర్వర్తించడానికి టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయులను ముందుండి నడిపిస్తోందని, ఆ సంఘం బాటలో నడవాలని ఉపాధ్యాయులకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

అధ్యక్షా..!

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలోని సబ్‌కమిటీ సిఫార్సులనూ పరిశీలించి, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అన్నింటికీ ప్రజాపాలన విజయోత్సవాలే ప్రధాన అవరోధంగా ఉండటం, జిల్లాలు సహా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అంతా అవే పనుల్లో నిమగ్నమై ఉండటంతో అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, మళ్లీ వారం తర్వాత పూర్తిస్థాయి చర్చలు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నది. స్పీకర్, మండలి చైర్మెన్ల సంయుక్త సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.

ఇదీ తొలిరోజు ఎజెండా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ సమావేశాల ప్రారంభ తొలిరోజు రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఆర్డినెన్సుల్ని సభలో ప్రవేశపెట్టనుంది. 2024 తెలంగాణ జీతాలు, ఫించను చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్, పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్, హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్, వస్తుసేవల పన్ను ఆర్డినెన్స్, పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్సుల్ని శాసనసభలో ప్రవేశపెడతారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 2022-23 ఆర్థిక సంవత్సర తెలంగాణ విద్యుత్ ఆర్థిక సంస్థ 9వ వార్షిక నివేదిక ప్రతిని సభలో ప్రవేశపెడతారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రకటన చేస్తారని శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- గజ్వేల్, అశ్వారావుపేటలో ఘటనలు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యేలు



(ఫైల్)

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్/ అశ్వారావుపేట

సిద్దిపేట జిల్లా గజ్వేల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ రూరల్ మండలంలోని రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న వర్కల్ పరంధాములు(46), పూసల వెంకటేష్(38) ఇద్దరూ కలిసి రాయపోల్ నుంచి హైదరాబాద్ ఈసీఐఎల్‌లో రన్నింగ్ మారథాన్‌కు ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై బయలుదేరారు. అయితే గజ్వేల్ పట్టణ సమీపంలోని జాలిగామ బైపాస్ రోడ్డుకు వచ్చే సమయానికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ప్రమాదం గురించి గజ్వేల్ సీఐ సైదా జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దాంతో ఎస్పీ డాక్టర్ అనురాధ, అడిషనల్ డీసీపీ యస్.మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు గజ్వేల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సైదా, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మార్చురీలో ఉన్న మృతదేహాలపై పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి.. తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డిపార్ట్‌మెంట్ తరఫున రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామన్నారు.

తక్షణ ఖర్చుల కోసం ప్రభుత్వం తరపున ఇరు కుటుంబాలకు కలిసి రూ.60 వేలు అందజేశారు. అదే విధంగా, మృతుల స్నేహితులు, అధికారులు, సన్నిహితులు పలువురు వారి మృతదేహాలను సందర్శించి పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు. పలు సామాజిక సేవ కార్యక్రమాల్లో వీరిద్దరూ ముందుండేవారని వారు కొనియాడారు. కాగా, ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు.. వారి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు.

అశ్వారావుపేటలో ఇద్దరు మృతి

ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని లారీ వేగంగా ఢీ కొట్టడంతో వాహనంపై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. వారిలో ఇద్దరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం (నారాయణపురం)కు చెందిన పేరాబత్తుల మనోజ్ (27) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మారెప్ప గూడెంలో కౌలు పద్ధతిలో వేరుశనగ సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం తన స్వగ్రామానికి చెందిన మొగిటి వీరభద్రంతో పాటు అశ్వారావుపేట మండలం పాపిడిగూడెంకు చెందిన బద్దే వెంకటేశ్వరరావు(57)ను తీసుకుని ద్విచక్ర వాహనంపై ఆదివారం బయలుదేరాడు. వీరు ముగ్గురు ద్విచక్ర వాహనం ప్రయాణిస్తూ నారంవారిగూడెం కాలనీ సమీపంలోకి రాగానే లారీ ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోజ్, వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు.

వీరభద్రం తీవ్రంగా గాయపడటంతో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్ఐ యయాతి రాజు మృతదేహాలను పంచనామా నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, లారీ డ్రైవర్ గోళ్ళ సైదులు మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మృతుడు మనోజ్ తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బాధిత కుటుంబ సభ్యులు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.

చట్టవిరుద్ధంగా ఫిజిషియన్ శాంపిళ్ల నిల్వ

- క్రాంతి మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌లో తనిఖీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్ కంట్రోల్ అధికారులు చేసిన దాడుల్లో అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. హన్మకొండ జిల్లా, వేలేర్ మండలం, వేలేర్ గ్రామంలోని క్రాంతి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌పై చేసిన దాడిలో పెద్ద మొత్తంలో ఫిజిషియన్ శాంపిళ్లను పట్టుకున్నారు. వీటితో పాటు కాలం చెల్లిన మందులను కూడా డీసీఏ అధికారులు సీజ్ చేశారు. వీటి విలువ రూ.ఒక లక్ష వరకు ఉంటుంది. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు చేసిన ఈ దాడిలో ఉచితంగా డాక్టర్లు ఇవ్వాల్సిన ఫిజిషియన్ శాంపిళ్లు కూడా ఉన్నాయి.

పోరాటాలకు సిద్ధమవ్వాలి

హక్కుల సాధన, రక్షణకు ఉద్యమాలే శరణ్యం | ఉద్యమాల ఖిల్లా.. జగిత్యాల జిల్లా..

- బీజేపీ మతోన్మాదంపై కార్మికరంగాల్లో అవగాహన అవసరం
- మతవైషమ్యాలే బీజేపీ ఎజెండా
- గుజరాత్ అల్లర్లు మొదలుకుని మణిపూర్ హింసాకాండ వరకూ..ఎక్కడ విద్వేషాలు రగిలినా.. దానివెనుకుండేది ఆర్ఎస్ఎస్, బీజేపీయే..
- అదానీని రక్షించే పనిలో ఉన్న శ్రద్ధ.. దేశ ప్రజలపై మోడీకి లేదు..
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపైనా నిలదీయాలి.. ఇచ్చిన హామీలపై పోరాడాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య
- జగిత్యాల జిల్లా మూడో మహాసభలు ప్రారంభం



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'పోరాటాలకు ప్రజలు సిద్ధమవ్వాలి. అటు కేంద్రంలో బీజేపీ ప్రజల మధ్య మతవైషమ్యాలు చెలరేపుతూ ఓట్ల రాజకీయం చేస్తూ అధికార పీఠంపై కూర్చుంటోంది. క్రమంగా ప్రజల హక్కులను హరిస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ వస్తోంది. గుజరాత్ అల్లర్లు మొదలుకుని ఇటీవలి మణిపూర్ హింసాకాండ వరకూ ఆ పార్టీ చేస్తున్న ఆరాచకాలు అంతాఇంతా కాదు. ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా.. రాజ్యాంగాన్ని మార్చి మనుస్మృతిని అమలు చేయాలనే కుట్ర చేస్తోంది. ఇది కచ్చితంగా ప్రజల హక్కులను హరించడమే.. మరోవైపు రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు సైతం ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయడం లేదు. పాలకులుగా ప్రజల ఆస్తులు కాపాడాల్సింది పోయి.. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాల్సిందే. అందుకు ఎర్ర జెండా ఎళ్లప్పుడూ వెంట ఉంటుంది. ఉద్యమాల ఖిల్లా అయిన జగిత్యాల జిల్లాలో కమ్యూనిస్టు పోరాట చరిత్ర మరువలేం. ఆ స్ఫూర్తితోనే ఉద్యమాలకు సిద్ధం కావాలి' అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జీ.నాగయ్య పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జగిత్యాల జిల్లా మూడో మహాసభలను కోరుట్ల పట్టణంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బస్టాండ్ నుంచి సినారె భవన్ (సభాప్రాంగణం) వరకు పెద్దఎత్తున ప్రజాప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రాంగణ వేదికపై కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలు వేసి నివాళ్లు అర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం పార్టీ నాయకులు ఇందూరి సులోచన, ఎంఏ చౌదరి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో నాగయ్య ప్రసంగించారు. గుజరాత్ అల్లర్లు మొదలుకుని మణిపూర్ హింసాకాండ వరకూ చోటుచేసుకున్న ప్రతి మత ఘర్షణల్లో ఆర్ఎస్ఎస్, బీజేపీ పాత్ర ఉందని వివరించారు. పైగా మణిపూర్‌లో గిరిజనుల మధ్య హింసాకాండను చెలరేపి అక్కడి కొండప్రాంతాలను ఖాళీ చేయిస్తోందన్నారు.



అందు కు అక్కడి భూగర్భం లోని ఖనిజాలు అదానీ లాంటి కార్పొరేట్లకు అప్పగించే కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాజ్యాంగ యంత్రాన్ని తన చెప్పు చేతల్లో పెట్టుకొని రాచరిక పాలన సాగిస్తోం దన్నారు. మతం, ఆహారపు అల వాట్లు వ్యక్తిగ తమైనా.. అందులోనూ ఆంక్షలు చెలరేపుతూ ప్రజల మధ్య చిచ్చుపెడు తోందన్నారు. రాజస్థాన్‌లో అజ్మీరా దర్గా ఒకప్పటి హిందూ ఆలయ మని, దేశంలో మసీదులు, చర్చీలు కూలదూసే పనిగట్టుకుందని తెలిపారు. మరోవైపు ఆదిలాబాద్ లాంటిప్రాంతంలో ఓ మైనార్టీ వ్యక్తి గిరిజన మహిళపై లైంగికదాడి చేస్తే.. యావత్తు మైనార్టీ ఇండ్లన్నీ ధ్వంసం చేసేలా ఉసిగొల్పిం దన్నారు. సనాతన ధర్మం గొప్పదంటూ ప్రచారం చేస్తున్న ఆ పార్టీ.. ఆధర్మంలో దళితులకు, మహి ళలకు ఏ స్థానం ఉందో చెప్పగలరా అని ప్రశ్నించారు. అదానీకి దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా లంచాలు ఇస్తూ సంపద దోచుకుం టున్న తీరు ఇటీవల బట్టబయలైందని, అమెరికాలో ఏకంగా ఆయనపై కేసు కూడా నమోదైం దని తెలిపారు. అయినా ఆయనపై చర్యలు తీసుకోకుండా రక్షించే పనిలో కేంద్రంలోని బీజేపీ ఉందని విమర్శించారు. బీజేపీ తీరు ఇలానే కొనసాగితే శ్రీలంక ఉదంతమే పునరావృత మవుతుందని చెప్పారు. ఆ దేశంలో ప్రజలంతా ఆకలికేకలతో రోడ్డెక్కితే అప్పటివరకూ ఉనికిలో లేని ఎర్రజెండానే అండగా నిలబడిందని, ఏకంగా ఇప్పుడు కమ్యూనిస్టు నేతనే దేశాధ్యకుడిగా ఎన్నికయ్యాడని తెలిపారు.

హామీల అమలులో రాష్ట్ర సర్కారూ విఫలం

ఆరుగ్యారంటీలు సహా సుమారు 400లకుపైగా హామీలిచ్చి ప్రజాస్వామ్య పాలన అందిస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు ఈ రాష్ట్ర ప్రజలు అధికారం కట్టబెట్టారని తెలిపారు. అయితే మహిళలకు ఫ్రీబస్సు పథకం తప్ప మిగిలిన గ్యారంటీలన్నీ మరిచిపోయిందన్నారు. మహిళలకు రూ.2500సాయం, దళితబంధు స్థానంలో అంబేద్కర్‌పేరుతో రూ.12లక్షలిచ్చే పథకం, రైతుభరోసా, రైతుబీమా వంటి పథకాలకు ఇంకా రూపకల్పనే చేయలేదన్నారు. రూ.2లక్షల్లోపు రైతుల రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం లక్షన్నర వరకు రుణాలు మాత్రమే దశలవారీగా మాఫీ చేసిందని, అందులోనూ ఇంకా అర్హులు మిగిలారని, వారితోపాటు మిగిలిన రైతుల రుణాల మాఫీపై ఇంకా స్పష్టత ఇవ్వలేదన్నారు. మరోవైపు పేదలంతా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటుంటే బుల్డోజర్లతో బీఆర్ఎస్ కూల్చిందని అన్నారు. అదే సంస్కృతి కాంగ్రెస్ కొనసాగిస్తోందన్నారు. పాలకులు మారినా మారని విధానాలపై ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. సీపీఐ(ఎం) ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, ఈ మహాసభల్లో అందుకు అవసరమైన భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ మహాసభల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు పీ.శ్రీకాంత్, టీ10 సీఈఓ సుందర్, సీపీఐ(ఎం) జగిత్యాల జిల్లా కన్వీనర్ జీ.తిరుపతినాయక్, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరయ్యారు.

'మెజార్టీ' కోరిక ప్రకారమే భారత్ నడుస్తుంది

వీహెచ్‌పీ కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి వివాదాస్పద వ్యాఖ్యలు



అలహాబాద్ : మెజార్టీ కోరిక ప్రకారమే భారత్ దేశం నడుస్తుందని అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ వ్యాఖ్యలు చేయడం వివాదంగా మారింది. ఆదివారం అలహాబాద్ హైకోర్టు లైబ్రరీ హాల్ న్యాయవాదులు, వీహెచ్‌పీ వాలంటీర్లతో మాట్లాడుతూ జడ్జి ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇది హిందూస్థాన్ అని చెప్పడానికి నాకు ఎలాంటి సందేహం లేదు. ఇది మెజార్టీ కోరిక ప్రకారమే నడుస్తుంది' అని అన్నారు. ముస్లింలు తమ సంస్కృతులు అనుసరించాలని హిందువులు కోరుకోరని, అయితే ముస్లింలు తమ దేవుళ్లని, సంస్కృతిని, గొప్పవారిని అవమానించకూడదనే హిందువులు కోరుకుంటున్నారని చెప్పారు. అలాగే, ముస్లిం పేరును ప్రస్తావించకుండా వారు హిందువుల జంతువులను చంపుతున్నప్పుడు వారి పిల్లలు దయ, సహనంతో ఎలా ఉంటారని ప్రశ్నించారు. 'మేం (హిందువులు) మా పిల్లలకు సహనం, దయ నేర్పుతాం. జంతువులు, ప్రకృతిని ప్రేమించడం నేర్పిస్తాం. కానీ మీకు అలా ఉండదు. మీ పిల్లల ముందే మా జంతువులను వధిస్తారు. దీంతో మీ పిల్లలు సహనం, దయ ఎలా నేర్చుకుంటారు' అని ప్రశ్నించారు. అలాగే, ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) కూడా జడ్జి ఈ సమావేశంలో ప్రస్తావించారు. ముస్లింలు అనేక మంది భార్యలను కలిగిఉండటం, ట్రిపుల్ తలాక్, హలాల్.. ఇక చెల్లవని చెప్పారు. యూసీసీ సుప్రీంకోర్టు కూడా సమర్థిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ దినేష్ పాఠక్ కూడా పాల్గొన్నారు. అయితే ఆయన అక్కడ ప్రసంగించలేదు.

కాగా, జడ్జి శేఖర్ కుమార్ యాదవ్ ప్రసంగం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పదవిలో ఉన్న ఒక జడ్జి వీహెచ్‌పీ కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే వివాదాలు జడ్జి యాదవ్‌కు కొత్త కాదు. 2021లో 'ఆక్సిజన్‌ను పీల్చే, విడుదల చేసే ఏకైక జంతువు ఆవు'అని చెప్పడం ద్వారా వార్తల్లోకి వచ్చారు. ఆవును జాతీయ జంతువుగా మార్చాలని డిమాండ్ చేశారు.



ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో "తెలంగాణ" మాస పత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా పాలన

- శ్రీలంక తరహాలో కమ్యూనిస్టులకు పూర్వ వైభవం తథ్యం : సీపీఐ (ఎం) ఖమ్మం డివిజన్ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వాలు మారినా ప్రజా సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయని, ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శ్రీలంక తరహాలో మనదేశంలోనూ కమ్యూనిస్టుల పాలన తథ్యమనే విశ్వాసంతో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో సీతారాం ఏచూరి, బుద్దదేవ్ భట్టాచార్య ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ మహాసభలో తమ్మినేని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ పదేళ్ల ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా పాలించారన్నారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే ఏ పార్టీ చెప్పినా సమస్యలు ఒకే విధంగా ఉంటాయన్నారు. విద్య, వైద్యం, భూమి, ఉద్యోగం, ఉపాధి, సరైన వేతనం, సామాజిక న్యాయం ఉన్నప్పుడు ప్రతి కుటుంబం హాయిగా... సోషలిజం తరహాలో జీవిస్తాయని వివరించారు. ఏ పార్టీ చెప్పినా ఈ ఏడు అంశాల గురించే చెబుతుంటాయని, కమ్యూనిస్టులు వీటన్నింటినీ ప్రభుత్వమే సమకూర్చా లంటున్నాయని, కానీ బూర్జువా పార్టీలు వీటిని ప్రయివేట్ చేతిలో పెడతాయని తెలిపారు. కమ్యూనిస్టు రాజ్యంలోనే విద్య, వైద్యం ఉచితంగా లభిస్తాయని చెప్పారు. పరిశ్రమలు రావాలన్నా.. ఉద్యోగ కల్పన జరగాలన్నా.. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్నా.. ఎర్రజెండా లోనే సాధ్యమని వివరిం చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పా... మిగిలిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. రైతుబంధు కింద ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు వస్తాయని ఓటు వేస్తే ఉన్న రూ.10 వేలు పోయాయని అన్నారు. ఏడాది కాలంగా రైతు భరోసా పంట పెట్టుబడి పథకాన్ని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు రూ. 12వేలు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగులకు భృతి ఇవేవీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా గత కేసీఆర్ ప్రభుత్వం 5 లక్షల ఎకరాలకు పోడు పట్టాలిస్తే.. రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చాక మిగిలిన మూడు లక్షల ఎకరాలకు పట్టాలిస్తామన్న హామీ, హామీగానే మిగిలిందన్నారు. పట్టాలు ఇవ్వకపోగా భూములు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

> ప్రభుత్వాలు మారినా అపరిష్కృతంగానే ప్రజా సమస్యలు

రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ లో ఫార్మసిటీ పేరుతో లగచర్లలో 3000 ఎకరాల గిరిజనుల భూములను బలవం తంగా లాక్కు నేందుకు యత్నిం చారని గుర్తు చేశారు. సీపీఐ (ఎం) బృందం లగచర్ల పర్యటనకు తొలుత అనుమతి నిరాకరించిన సీఎం.. రాష్ట్రవ్యాప్తంగా ఎర్రజెండాలు ఉద్యమిస్తా యని హెచ్చరించడంతో అనుమతిం చారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం అక్కడున్న భూములకు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం నాలుగు రెట్లు అదనంగా చెల్లిం చాలని తాము సీఎంను డిమాండ్ చేసినట్టు చెప్పారు. అంతేకాదు, ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవడం కమ్యూనిస్టుల విజయంగా తెలిపారు.

ఓట్లూ సీట్లూ లేకున్నా ఎర్రజెండా గుండె బలంతోనే ఇదీ సాధ్యమైందన్నారు. పక్కనున్న శ్రీలంకలో మూడు శాతం ఓట్లున్న కమ్యూనిస్టులు అప్పటి ప్రధాని రాజపక్సే నిరంకుశ విధానాలపై తిరుగుబాటు చేయడంలో విజయం సాధించారని, ఫలితంగా ఆ దేశ ప్రజలు కమ్యూనిస్టు నాయకులు దిసనాయకే 49శాతం ఓట్లతో పట్టం కట్టారని తెలిపారు. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ మూడింట రెండొంతుల సీట్లను కమ్యూనిస్టులు సాధించటం గమనార్హం అని అన్నారు. మన దేశంలోనూ ప్రభుత్వాలు అదే తరహా పాలను కొనసాగిస్తున్నాయని, ఇదే నిరంకుశ పాలన కొనసాగితే దేశంలోనూ కమ్యూనిస్టుల పాలన వస్తుందనే విశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. సాయిబాబు, పోతినేని సుదర్శన్ కూడా ప్రసంగించారు. ఈ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటే శ్వరరావు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బొంతు రాంబాబు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కస్టడీ వేధింపుల కేసులో నిర్దోషిగా మాజీ ఐపీఎస్ సంజీవ్ భట్

గుజరాత్ కోర్టు తీర్పు



పోరుబందర్ : 1997 కస్టడీ వేధింపుల కేసులో మాజీ ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్‌ను గుజరాత్‌లోని పోరుబందర్‌లో కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసులో సంజీవ్ భట్‌పై అభియోగాలను 'సందేహం లేకుండా నిరూపించలేకపోయారు' అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముఖేష్ పాండ్యా శనివారం తీర్పు వెల్లడించారు. తీర్పు వివరాలు ఆదివారం వెల్లడయ్యాయి. సాక్ష్యాధారాలు లేని కారణంగా 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' కింద సంజీవ్ భట్‌ను నిర్దోషిగా ప్రకటించారు. ప్రభుత్వోద్యోగిగా నిధులు నిర్వర్తిస్తున్న నిందితుడ్ని ప్రాసిక్యూట్ చేయడానికి అవసరమైన అనుమతి కూడా తీసుకోలేదని కోర్టు గుర్తించింది.

పోరుబందర్ ఎస్పీగా సంజీవ్ భట్ పనిచేస్తున్న సమయంలో ఆయుధాల చట్టం, టాడా కింద నమోదైన కేసులో నేరాన్ని అంగీకరించాలని శారీరకంగా, మానసికంగా తనను హింసించారని భట్, కానిస్టేబుల్ విజుభాయి చౌపై నారన్ జాదవ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. 1994 ఆయుధాల ల్యాండింగ్ కేసులో 22 మంది నిందితుల్లో జాదవ్ ఒకరు. ముందుగా 1997, జులై 6న పోరుబందర్ మేజిస్ట్రేట్ కోర్టును నారన్ జాదవ్ ఆశ్రయించారు. తనను పోలీసుల బృందం చిత్ర హింసలు పెట్టిందని, ప్రయివేట్ పార్ట్స్‌తో పాటు శరీరంలోని వివిధ భాగాలకు విద్యుత్ షాక్ పెట్టారని జాదవ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. జాదవ్ ఫిర్యాదును స్వీకరించిన కోర్టు 1998, డిసెంబరు 31న భట్, చౌలకు సమన్లు జారీ చేసింది. ఈ కోర్టు ఆదేశాలతో 2013, ఏప్రిల్ 15న పోరుబందర్ సిటీ బి-డివిజన్ పోలీస్‌స్టేషన్‌లో భట్, చౌ (మరణానంతరం)పై ఎఫ్ఐఆర్ నమోదయింది. ఐపీసీ సెక్షన్లు 330, 324 కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడి ఆరోపణలను నిరూపించలేకపోయారని కోర్టు భట్‌ను నిర్దోషిగా ప్రకటించింది.

కాగా, సంజీవ్ భట్ ప్రస్తుతం రాజ్‌కోట్ సెంట్రల్ జైల్లో రెండు కేసులకు సంబంధించిన శిక్ష అనుభవిస్తున్నారు. 1990 జామ్‌నగర్‌లో కస్టడీ మృతి కేసులో జీవిత ఖైదు, 1996లో రాజస్థాన్‌కు చెందిన లాయర్‌ను డ్రగ్స్ కేసులో ఇరికించిన కేసులో భట్ శిక్ష అనుభవిస్తున్నారు. అలాగే 2002 గుజరాత్ అల్లర్ల కేసులో కృత్రిమ సాక్షాధ్యారాలు సృష్టించారన్న కేసులో భట్ ఒక నిందితుడిగా ఉన్నారు.

2002 గుజరాత్ అల్లర్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి మోడీ పాత్ర కూడా ఉందని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేయడం ద్వారా సంజీవ్ భట్ అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే ఈ ఆరోపణలను ప్రత్యేక దర్యాప్తు బృందం తోసిపుచ్చింది. విధులకు 'అనధికార గైర్హాజరు' కారణంగా సంజీవ్ భట్‌ను గుజరాత్ ప్రభుత్వం పోలీస్ సర్వీస్ నుంచి తొలగించింది. దీనికి వ్యతిరేకంగా భట్ వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణలో ఉంది.

రైతులపై పోలీసుల్ని ఉసిగొల్పుతారా..?

- బీజేపీ ప్రభుత్వాలతీరుపై డీఎంకే ఎంపీ కనిమొళి



చెన్నై : పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం పోరాడుతున్న రైతులపై పోలీసులను ప్రయోగించడం అమానుషమని డీఎంకే ఎంపీ కనిమొళి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. తక్షణమే రైతు ప్రతినిధులతో చర్చలు జరపాలని, డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. "పంటలపై ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీతో సహా తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా, అమానుషంగా పోలీసులను ప్రయోగించడాన్ని ఖండిస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశాన్ని పోషిస్తున్న అన్నదాతలపై లాఠీ, టియర్ గ్యాస్‌తో దాడి చేయడం దారుణం అని కనిమొళి తెలిపారు.

పేదలను అంటిపెట్టుకుని ఉంటే మంచి ఫలితాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- ముగిసిన మేడ్చల్ జిల్లా మూడో మహాసభలు
- నూతన జిల్లా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎర్ర జెండా.. పేదలను అంటిపెట్టుకుని ఉంటే మంచి ఫలితాలు వస్తాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రగతి నగర్‌లో జరుగుతున్న పార్టీ మూడో మహాసభలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. శ్రీలంకలో భయానక పరిస్థితులు ఉన్న చోట కమ్యూనిస్టు నాయకుడు అధ్యక్షుడయ్యాడని తెలిపారు. ప్రజల కోసం ఐక్యంగా పని చేస్తే మన దేశంలో కూడా ఎర్రజెండా ఎగరడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. మన దేశంలో జరిగే అరాచకాలు శ్రీలంకలో జరిగిన మారణహోమం కంటే ఎక్కువేమి కాదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, డీజీ నర్సింహారావు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి గా పి.సత్యం



సీపీఐ(ఎం) మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కార్యదర్శిగా పి.సత్యం వరుసగా మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ముగిసిన జిల్లా మహాసభల్లో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కార్యదర్శితో పాటు కె.రవి, జె.చంద్రశేఖర్, ఏ. అశోక్, ఎం.వినోద, జి.శ్రీనివాసులు, ఐ.రాజశేఖర్ ఎన్నికవ్వగా, జిల్లా కమిటీలో ఆర్.సంతోష్, ఆర్. వరప్రసాద్, ఎం.శంకర్, ఎన్.సబిత, కె.లక్ష్మణ్, ఎంపీ నరేష్, ఎన్.శ్రీనివాస్, టీవి వెంకట్ రామయ్య, జె.వెంకన్న, జి. లక్ష్మణ్, లింగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వాహనాలు దగ్ధం చేసిన వ్యక్తి అరెస్ట్





నవతెలంగాణ-మలక్‌పేట్

చాదర్ఘాట్ మెట్రో స్టేషన్ దగ్గర రెండు రోజుల క్రితం ఐదు ద్విచక్ర వాహనాలను దగ్ధం చేసిన కేసును పోలీసులు చేదించారు. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్ర నుంచి పనుల నిమిత్తం జాకీర్ హైదరాబాద్‌కి వచ్చాడు. డబీర్పుర పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలోనూ వాహనాలను దగ్ధం చేసిన కేసులో నిందితుడుగా ఉన్నాడు. రెండు రోజుల క్రితం చాదర్ఘాట్ మెట్రో స్టేషన్ వాహనాలు నిప్పంటిం చిన కేసులో సీసీ కెమెరాలు ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ఈ మెరకు కేసు నమోదు చేసి జాకీర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

7

ఎల్బీనగర్ -మహేశ్వరం

సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com



చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ ముదిరాజ్ అన్న కూతురు వివాహానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కి గౌడ్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, ఎల్బీనగర్ కాంటెస్ట్ ఎమ్మెల్యే ముద్ద గోని రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చంపాపేట్

గురుకుల పాఠశాలల బలోపేతానికి
అందరూ సహకరించాలి



- గురుకులాల జే.ఏ.సి.అధ్యక్షులు నారాయణ

నవతెలంగాణ-చంపాపేట్

గురుకుల పాఠశాలల బలోపేతానికి అందరు సహకరించాలి అని రాష్ట్ర గురుకులల జేఏసీ అధ్యక్షులు ఎం. నారాయణ అన్నారు. శనివారం రాష్ట్ర గురుకుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1971సం॥లో పి.వి.నరసింహ రావు ఆలోచన మేరకు.. ఏర్పాటు చేసిన ప్రభుత్వ గురుకుల వ్యవస్థ విజయవంతంగా నడుస్తున్న పరిస్థితులను బేరీజు వేసుకొని.. స్వర్గీయ మాజీ సీఎం రామారావు 1984లో ఎస్సీ గురుకులాలను స్థాపించటం జరిగిందన్నారు. జనరల్, ఎస్సీ గురుకులాల అభివృద్ధిని చూసి 1998లో ఎస్టీ గురుకులాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేవలం 3వందల గురుకుల పాఠశాలల మాత్రమే ఉండేవన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిన తరువాత 1023 ఏర్పాటు కావటంపై గురుకుల విద్య వ్యవస్థపై అందులో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గంపై ఆర్భుత్వానికి ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో చదువుతున్న 6లక్షల మంది విద్యార్థులు పూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పేద మధ్య తరగతి వారు మాత్రమే ఉన్నారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గురుకులాల్లో చిన్న చిన్న పొరపాట్లను రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవటం సరైనది కాదన్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం ఏదైన విచారణకు ఆదే శిస్తే 2012 నుంచి 2023వరకు జేఏసి పూర్తిగా సహ కరిస్తుందన్నారు. వెంటనే విచారణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 9వేల నూతన నియామకాలు, 3వేల మందికి ప్రమోషన్లు,4వేల మందికి బదిలీలైన ఉద్యోగ, ఉపాధ్యాయులు సంతోషంతో మరింత ఉత్సాహంతో పనిచేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గత సంవత్సరం విద్యార్థులకు పెరిగిన మెస్ ఛార్జీలతో నాణ్యమైన ఆహారం, విద్యను అభినందిస్తూ.. ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గురుకుల పాఠశాలల జేఏసీ ఎస్సీ సొసైటి అధ్యక్షులు నరసింహ గౌడ్, ప్రధాన కార్యదర్శి డా.మధుసూదన్, జనరల్ సెక్రటరీ గణేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూన జనార్దన్, ఉపాధ్యక్షులు భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే సక్సెస్

- ఇక డే అండ్ నైట్ డేటా ఎంట్రీ
- 3 షిఫ్ట్స్ లాలో క్వాలిఫైడ్ డేటా ఆపరేటర్స్ ఎంట్రీ
- ప్రత్యేక దృష్టి సారించిన డీప్యూటీ కమిషనర్









నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అధికారులు సమన్వయంతో జోనల్ అండ్ డీప్యూటీ కమిషనర్స్ చొరవతో 5 వార్డ్స్ అధికారుల సమన్వయంతో ఎట్టకేలకు విజయవంతం ముగిసింది. దీనితో అధికారులు సర్వే ద్వారా సేకరించిన 7,550 కుటుం బలకు సంబంధించిన పూర్తిస్థాయిలో డేటాను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం..

ప్రొ. జయశంకర్ ఇండోర్ స్టేడియంలో


తార్నాక డివిజన్ పరిధిలో ప్రొ.జయశంకర్ ఇండోర్ స్టేడియం లో ఇటీవల డేటా ఎంట్రీ పక్రియను సర్కిల్ 29 సర్కిల్ డీప్యూటీ కమిషనర్(డీసీ), డి.సుభాష్‌రావు గత మంగళవారం ప్రారంభించారు.

3 షిఫ్ట్స్ లాలో క్వాలిటీఫైడ్ ఆపరేటర్స్‌తో

ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జామున 6 గంటల వరకు.. ఇలా 3 షిఫ్ట్స్ లాలో 24/ 7 గంటల పాటు 70 మంది క్వాలిఫైడ్ గల డేటా ఎంట్రీ ఆపరేటర్స్‌తో డేటా ఎంట్రీ చేస్తున్నారు. వార్డ్‌కు 10 మంది చొప్పుల డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పనిచేస్తున్నారు. ఐదు వార్డ్స్‌కు సంబంధించిన వార్డ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్స్, సూపర్ వైజర్స్, పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు.

నిత్యం సుమారు 1500 నుంచి 2000 వరకు కుటుంబాల డేటాను ఎంట్రీ చేస్తున్నారు. ఈ నెల 15 వరకు ఈ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు. డేటా ఎంట్రీ పక్రియ కొనసాగుతోంది.. సర్కిల్ 29 సికింద్రాబాద్ డీసీ డి.సుభాష్ రావు ప్రొ. జయశంకర్ ఇండోర్ స్టేడియంలో డేటా ఎంట్రీ ప్రక్రియ క్వాలిటీ ఫైడ్ డేటా ఆపరేటర్స్ 70 మంది తో డే అండ్ నైట్ చేస్తున్నాము. ఐదు వార్డ్స్ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా అప్రమత్తం చేస్తున్నాం. ఐదు వార్డ్స్‌లో 79,550 కుటుంబాలకు గాను 69,553 గృహాల వివరాలు ఇప్పటి వరకు సేకరించాము. సర్వేకు సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఏమ్యూనరేటర్స్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



నవతెలంగాణ-ఎల్బీ నగర్

పేదలకు వరం సీఎం సహయనిధి అని ఎల్‌బి నగర్ శాసన సభ్యులు సుధీర్ రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న నర్సింహా తలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడు తున్న నేపథ్యంలో.. వారి ఆర్థిక స్థితులు బాగలేక కుటుంబ దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందిం చిన ఎమ్మెల్యే ఆపరేషన్‌కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. దానికి గాను వారికి రెండు లక్షల రూపాయలు ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లా డుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన వై ద్య సేవలను పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాన్సూరాబాద్ డివి జన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, రుద్ర యాదగిరి నేత తదితరుతలు పాల్గొన్నారు.

హస్తినాపురం: ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉప యోగపడుతుందని పీసీసీ ప్రచారకమిటీ చైర్మెన్ ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కి గౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీ చెందిన రిజ్వాన్ ఖాన్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితుల కారణంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ.2 లక్షల 50 వేల రూపాయల ఎల్‌ఓసిని ఆదివారం రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ధార్‌పల్లి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులు ఎల్వోసీలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా శ్రీను తదితరులు ఉన్నారు.



విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం స్థానిక సుప్రజ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో.. నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జైపూర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామల యాదగిరి, సభ్యులు కటకం నర్సింగరావు, చెరుకు చిరంజీవిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. తమ ఆరోగ్యాలను పరీక్షించుకుని వైద్యులు అందించిన సలహాలు సూచనలను పాటించి, ఆరోగ్యాలను కాపాడుకోవాలని వారు సూచించారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి ప్రారంభమైన ఉచిత వైద్య శిబిరానికి జైపూర్ కాలనీతో పాటు పరిసర కాలనీలకు చెందిన 85 మంది బిపి, షుగర్, ఈసీజీ, బిఎంపి సీబీపీ పలు వైద్య పరీక్షలను చేయించుకున్నారు.

అనంతరం వారి వారి పరీక్షలను బట్టి వైద్యులు సలహాలను సూచనలను సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో కటకం నర్సింగరావు, చెరుకు చిరంజీవి, జైపూరి కాలనీ అధ్యక్షులు శ్యామల యాదగిరి, కార్యదర్శి కస్తూరి అశోక్, ఆర్గనైజర్ వేణుగోపాల్, గుమ్మడి వెంకట్ రెడ్డి దాక్షారావ్, కిరణ్, శ్యామల పద్మ, ఎం పద్మ ,సావిత్రి వినోద్‌లతోపాటు సుప్రజ ఆస్పత్రి వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-నాగోల్

హైదరాబాద్ నగరంలోని ఇందిరానగర్ ఆంజనేయ స్వామి మందిరంలో జరిగిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో.. టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఇందిర నగర్‌లో వెలసినటువంటి సుబ్రహ్మణ్యేశ్వర వల్లి దేవసేన అమ్మవారికి సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా.. జరిగిన స్వామివారికి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారని ఆయన అన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోభక్తులు విశేషంగా పాల్గొని స్వామివారికి కళ్యాణం వీక్షించారు అని స్వామివారి ప్రసా దాన్ని భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత ఉమా రాణి, కళ్యాణ దంపతులు శ్రీ విజయ్ కుమార్, శ్రీమతి నిత్య సంతోషి సూర్య ప్రకాష్ స్వాతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా జల్‌పల్లి మున్సిపాలిటి షాహీన్ నగర్‌కు చెందిన ఫాజిల్ ఖాద్రి ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించి ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో పేద ప్రజల సంక్షేమానికి ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా తన వంతు కృషి చేస్తానని,అదే విధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జిగా చల్లా నూతన్ కృష్ణరావును నియమిస్తూ.. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుంజి సంతోష్ కుమాన్, తమ్మిశెట్టి శివకృష్ణలు నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివారం బేగంపేట్ వైట్ హౌస్ బిల్డింగ్లో వీఆర్పీఎస్ భవిష్యత్ కార్యచరణపైన నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేసినట్టు వీఆర్పీఎస్ నూతన రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి చల్లా నూతన్ విజయ్ కృష్ణారావు తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల ఉపేంద్ర, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చంపాపేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లోని సామల పాపిరెడ్డి గార్డెన్‌లో బాలాపూర్ గ్రామానికి చెందిన కళ్లెం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో.. సోదరుని అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో మహేశ్వరం మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బడంగ్‌పేట్



అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్లెం ఎల్లారెడ్డి సోదరుడి అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, చిగురింత పెద్ద నరసింహారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గుండోజి రఘునందన్ చారి, అత్తాపురం శ్రీనివాసరెడ్డి, అరవింద్ గౌడ్, హరి గౌడ్, తిమ్మని గిరేష్,మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి,కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, సిద్దాల బీరప్ప,మాజీ ఉప సర్పంచ్ పోరెడ్డి వెంకట్ రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఫతేనగర్‌లో కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఫతేనగర్ డివిజన్‌లో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన విజయోత్సవ కేకును నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై కట్ చేశారు. ఈ విజయోత్సవాలో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నినాదాలు చేస్తూ రేవంత్ రెడ్డి జిందాబాద్, రమేష్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదా లు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా కంటక పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని అన్నారు. ప్రజలందరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ మల్లిగారి లక్ష్మయ్య, కూకట్ పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, మాజీ



కౌన్సిలర్ కుక్కల రమేష్, బాకీ, రాజు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

వ్యాపార రంగంలో రాణించాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

డా.ఏఎస్‌రావు నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మండి రెస్టారెంట్‌ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటిగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్ నగర్ కార్పొరేషన్ నాల్గొవ డివిజన్ కార్పొరేటర్ మారగోని నాగరాణి వెంకటేష్ గౌడ్‌ల కూతురు స్వాతి నిఖిత్‌గౌడ్‌ల వివాహానికి మేడ్చల్ నియోజవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, కార్పొరేటర్లు, శారద మనోహర్ రెడ్డి, బింగి లావణ్య సతీష్ గౌడ్, బల్లి రోజా శ్రీనివాస్, ప్రేమల శ్రీనివాస్, కో ఆప్షన్ శ్వేత ముఖేష్‌లతో కలిసి హాజరై ఆశీర్వదించారు.

నవతెలంగాణ-జవహర్‌నగర్

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-కాప్రా

ప్రజా పాలనా విజాయత్సంలో భాగంగా ఆదివారం అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు, ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోలేగొని శ్రవణ్ కుమార్ గౌడ్, అక్కిపల్లి అర్జున్‌లు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నివాసములో మర్యాదపూర్వకంగా కలిసి ప్రజాపాలన ఏడాది పూర్తి అయినా సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.

జనవిజ్ఞాన వేదిక నూతన కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జన విజ్ఞాన వేదిక జూబ్లీ జోన్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం ఏఫ్-65 మధుర నగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన జోన్ కార్యదర్శిగా పి.రమాదేవి ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఎల్. రాజేష్ హైకోర్టు న్యాయవాది, వై.యాదగిరి ఎల్ఐసీ ఏజెంట్, సహాయ కార్యదర్శిగా జి.రాజశేఖర్ ప్రాజెక్ట్ లీడర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులందరికీ సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ జోన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కాప్రాలో ప్రజాపాలన విజయోత్సవాలు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్‌లోని నిర్మల్ నగర్‌లో ప్రజా పాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా పాలన.. ప్రజా విజయోత్సవాలకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏడాది కాలంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను గురించి ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాప్రా డివిజన్ అధ్యక్షుడు నాగశేషు , మేడ్చల్ మల్కాజిగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విట్టల్ నాయక్, గుణ శేఖర్, ధర్మేందర్ మల్లా రెడ్డి, శ్రీధర్, రాజు, శ్రీకాంత్, శ్రీహరి, సంతోష్ చారీ, సతీష్ యాదవ్, జగదీష్, శ్రీకాంత్, సంతోష్, మనోజ్, జీవన్, ప్రశాంత్, ఇమ్రాన్, చంద్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే మనశ్శాంతి

- ఆనంద సాయి చారి టబుల్ ట్రస్ట్ సభ్యులు, కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్.



నవతెలంగాణ-జవహర్‌నగర్

సేవ చేయడంలో మనశ్శాంతి ఆనందం ఉన్నదని ఆనంద సాయి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిసా కాలనీలో ట్రస్ట్ సభ్యుడు రజత్ పుట్టిన రోజు సందర్భంగా కాలనీ అధ్యక్షులు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో లెప్రసీ పెషేంట్లకి, వృద్దులకీ 100 మందికి నిత్యావసర సరుకులు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ దుర్గమ్మ, సాయి మూర్తి, హేమ, దాతలు రవీంద్ర గుప్తా, బాల సాయి, కృష్ణ, షేక్ రంజాన్, బల్ల వరలక్ష్మి వనజ, శ్యాం, సురేష్, మంజుల రవి, శారద రాకేష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో బాబా ఫసియుద్దీన్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా ఒక ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజపాలనలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం విజయవంతంగా నడుస్తున్న సందర్భంగా ఆదివారం మొహమ్మద్ బాబా ఫసియుద్దిన్, కార్పొరేటర్ బోరబండ మాజీ డీప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో సీఎంకి కృతజ్ఞతగా ఆర్టీసీ బస్సులో బోరబండ బస్‌స్టాఫ్ వద్ద నుంచి స్థానిక మహిళలతో కలిసి ప్రయాణం చేశారు. మహిళ ప్రయాణికులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి మహిళలు దన్యవాదాలు తెలిపారు. అనంతరం వినాయక రావు నగర్‌కు చెందిన మురళికి వీల్ చైరు పంపిణీ చేశారు.

ఘనంగా గాయత్రీ మాత యజ్ఞ పూజలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ డివిజన్ మదురానగర్‌లోని భారత సేవాశ్రమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల రెండవ ఆదివారం నిర్వహించే శ్రీ గాయత్రి మాత యజ్ఞంను శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ బిర్రు బాల మల్లయ్య సహకారంతో శ్రీ గాయత్రి మాత యజ్ఞంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాయత్రీ మాత దీవెనలతో సబ్బండ ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మయబ్రహ్మ లక్ష్మణాచారి, హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మెన్ కె.ఎల్ నారాయణ రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సంధ్య థియేటర్ ఘటనలో ముగ్గురు అరెస్ట్

- చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్
- అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు
- ఘటనకు కారణమైన ప్రతి ఒక్కరిని శిక్షిస్తాం



నవతెలంగాణ-ముషీరాబాద్

సంధ్య థియేటర్ పుష్ప టు సినిమా ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవలే అల్లు అర్జున్ నటించిన పుష్ప టు సినిమా విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో శ్వాస ఆడక మహిళ మృతి చిన్నారి శ్రీ తేజ చికిత్స పొందుతుండడంపై ప్రాథమిక దర్యాప్తు ద్వారా సంధ్యా థియేటర్ ఏడుగురు యజమానుల్లో ఒకరైన ఎం సందీప్, సీనియర్ మేనేజర్ నాగరాజు, అప్పర్, లోయర్ బాల్కనీ ఇన్‌చార్జి మేనేజర్ విజయ్ చందర్‌ను అరెస్ట్ చేసి వారిపై 105, 118(1) r/w3(5) బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి ...జ్యూడిషల్ రిమాండ్‌కి తరలించా మని తెలిపారు. సంధ్య థియేటర్ యాజమాన్యం ముందస్తు సమాచారం ఇవ్వకపోవ డంతో ఈ సంఘటన జరిగిందన్నారు. ప్రస్తుతంపై అధికారు లు లీగల్ టీంతో సంప్రదింపులు జరిపి సీసీటీవీ ఫుటేజ్ సాక్ష్యాలతో లోతైన దర్యాప్తు చేపట్టి ఘటనకు బాధ్యులైన ప్రతి ఒక్కరిని శిక్షిస్తామన్నారు. చట్టం ఎవరికి చుట్టం కాదని చట్టం ముందు అందరూ సమాను లే అని ఈ ఘటనలో హీరో అల్లు అర్జున్ పాత్రపై దర్యాప్తు చేసి నోటీసులు ఇస్తామన్నారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి నిలకడగా వుంది చికిత్స కొనసాగుతుంది. ఇటువంటి సంఘటనలు పునరవృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలు అభిమానులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిక్కడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, అడిషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో
తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది





- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పలు పథకాలు దేశానికి దిశా దశ నిర్దేశిస్తూ ఆదర్శంగా మారే పరిస్థితి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ పట్టణంలోని ఓం శివసాయి ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని ఘట్కేసర్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, జవహర్ నగర్, కాప్రా, మేడ్చల్ మండలాలకు చెందిన 584మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి రూ.5కోట్ల 90లక్షల విలువచేసే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత బస్సు సౌకర్యం దేశంలో ఎక్కడ లేని విధంగా లక్షలాది మంది మహిళల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. అలాగే ఆరు గ్యారెంటీలలో భాగంగా సబ్సిడీపై అందిస్తున్న వంట గ్యాస్, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా, రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ లాంటివి రాష్ట్రంలో గొప్పగా అమలై దేశంలోని అన్ని రాష్ట్రాలు అనుసరించే స్థాయికి వచ్చాయన్నారు. రైతులకు రుణమాఫీతో పాటు మద్దతు ధర సక్రమంగా అందిస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్సింహులు యాదవ్, డైరెక్టర్ రేగు రాజు, పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

- పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది

నవతెలంగాణ-జవహర్‌నగర్

పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ నియోజకవర్గంలోని కాప్రా, మేడ్చల్, మూడు చింతలపల్లి మండల లబ్ధిదారులకు మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని శివ సాయి ఫంక్షన్ హాల్లో కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు శారద మనోధర్ రెడ్డి, కాప్రా తహశీల్దార్ సుచరిత, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కార్పొరేటర్లు బింగి లావణ్య సతీష్ గౌడ్, ప్రేమల శ్రీనివాస్, కో ఆప్షన్ శ్వేత ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్
- కీసరలో ఘనంగా 150వ జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కీసర

అంబేద్కర్ ఆశయాలను అందరం కలిసి ముందుకు తీసుకెళ్లాలని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు. కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 150వ వారం జ్ఞానమల కార్యక్రమంలో భాగంగా అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 150వ వారం జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 150వ జ్ఞానమాన కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు అందరం కలిసి తీసుకువెళ్దామని తెలిపారు. ఆయన రాసిన రాజ్యాంగం వలనే నేడు రాజకీయ రంగంలో కొనసాగుతున్నామని అలాగే అంబేద్కర్ గారిని ప్రపంచంలోనే మహోన్నతమైన వ్యక్తిగా పేర్కొంటున్నారని తెలిపారు. అంబేద్కర్ రాసిన ఆర్టికల్ ప్రకారం దేశంలో సంస్కరణలు జరుగుతున్నాయని రాబోయేకాలంలో ప్రతి యువత ముందుకోచ్చే రోజుందని, ఆయన ప్రపంచంలోనే గొప్ప శక్తిమంతుడని కొనియాడారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, బత్తుల వేణు గోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొల కృష్ణ యాదవ్, చీర్యల గ్రామ మాజీ సర్పంచ్, తుంగ ధర్మేందర్, ఉద్ధమర్రి మాజీ సర్పంచ్ బాల్ నర్సింహ, జలాల్ పురం మాజీ సర్పంచ్ కురాకుల ఎల్లయ్య, మూఢు చింతల పల్లి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శశిధర్, ఎంసిపల్లి యువజన ఉపాధ్యక్షుడు భాను చందర్, నాయకులు యూసుఫ్ చిర్యాల్ మాజీ వార్డు సభ్యులు హన్మంత్ రెడ్డి, మంకీ రాజు, మండల మాజీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వనందాస్ లక్ష్మి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

24 ఏండ్లుగా పడిపూజ నిర్వహిస్తున్న కేంద్రమంత్రి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కాలేజీలో అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించారు. భక్తుల అయ్యప్ప శరణు ఘోషతో ప్రాంగణం పరిసరాలు మార్మోగాయి. అయ్యప్ప స్వామి మాలధారులు భజనలతో హోరెత్తించారు. మణికంఠుని నామస్మరణతో రంగురంగుల పూలతో 18 మెట్లను సుందరంగా అలంకరించి పడి వెలిగించారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాలధారణ ప్రాముఖ్యతను గురు స్వాములు వివరించారు. అత్యంత పవిత్రమైన ఈ వేడుకను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి దంపతులు 24 ఏండ్లుగా ఏటా అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్నారని గురు స్వాములు అన్నారు. అయ్యప్ప దీక్ష మతసామరస్యానికి ప్రతీకగా కులం, మతం, చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే దీక్ష పరమార్థం. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి అభిషేక కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పూజారి ఆత్రేయ ఆధ్వర్యంలో అభిషేకం మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. ఈ పూజ కార్యక్రమంలో ఎంపీలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, దణపల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి, పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణ పనులు చివరి దశకు



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ కుమ్మరి గూడలోని ముత్యాలమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్టు ఎమ్మెల్యే శ్రీ గణేష్ స్పష్టం చేశారు. కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్టాపన కార్యక్రమం ఈనెల 11న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల ఉన్మాది చేతిలో ఆలయ విగ్రహం ధ్వంసమైన నేపథ్యంలో భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టినట్టు వెల్లడించారు. ఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదేశించారు.



జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్, ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఊహాత్మకంగా మొదలై జీవితానికి దగ్గరకు తీసుకెళ్లేదే కవిత్వం



- కేంద్ర సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత శివారెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఏ వస్తువునైనా వినియోగించి పద్య రూపంలో వ్యాస రూపంలో ఊహాజనితంగా.. నిజ జీవితానికి చేరువ చేస్తూ తన కవిత్వాన్ని ప్రజలకు పద్య రూపంలో అందజేసే వారే రచయిత అవుతారని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత రచయిత శివారెడ్డి అన్నారు. ఆదివారం వసీరా ఏనుగమ్మ ఏనుగు పుస్తక ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఆయన మనవడు అరుణ్బిమ్, వసీరా మనుమడు అన్విత్, జిన్ని, నానిలతో కలిసి పుస్తక ఆవిష్కరణ చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవి తన కవిత్వాన్ని ఏ వస్తువునైనా వినియోగించి అద్భుతంగా వ్యాసాన్ని, పద్యాన్ని రాసి ప్రజలకు ప్రజా జీవితంలో జరిగే పలు విషయాలకు దగ్గరగా తీసుకువెళ్లి తన కవిత్వంతో మెప్పిస్తే అద్భుతం అనుకోవడం మూర్ఖత్వమని అన్నారు. కవి రాసిన రచనలు వ్యాసాలు పద్యాలు తప్పకుండా చదివి, రచయిత ఏ వస్తువుని ఏ విధంగా వినియోగించి పద్యం వ్యాసం రచన చేశారో తెలుసుకుని దాని అసలు నకలు ఏమిటో తెలియజేయడమే మనిషి యొక్క నైజాం అని పేర్కొన్నారు.

132వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల్ జమ్మిగడ్డ ప్రాంత, బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం 132వ వారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డా.బీ.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 132వ వారం పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు. జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు నర్సింహ్మాచారి, వెంకటయ్య, నగేష్ పాల్గొన్నారు.

మనువాదం నక్సలిజం కంటే ప్రమాదం

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి
- బండి సంజయ్ మనువాదుల ఏజెంట్



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ ప్రాంతంలో భూస్వాముల, దొరల గడీల నుంచి సామాన్యులను విముక్తి చేసిన నక్సలిజం మేమంచిదని, నక్సలిజం కంటే మనువాదం చాలా ప్రామాధకరమని, మనిషిని మనిషిగా చూడని మనువాదం అంతం చేయడమే తెలంగాణ ప్రాంత చైతన్యవంతుల లక్ష్యమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. తరతరాలు నుంచి నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో మమ్మల్ని విద్యకు సంపదకు దూరం చేసింది మనువాదమని, తెలంగాణ ప్రాంతంలో మనువాదులను తరిమికొట్టి ఈ ప్రాంత అభివృద్ధి కోసం అంబేద్కర్ స్ఫూర్తితో నక్సలిజం విద్యకు సంపదకు సబండ వర్గాలను దగ్గర చేసిందని అన్నారు. బీజేపీలో నక్సలైట్లు ఉన్నారని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో మనువాదానికి చోటు లేదని ఇక్కడి ప్రజలు దానిని అంగీకరించరని అన్నారు. బండి సంజయ్ కాంగ్రెస్‌లో నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులను అర్బన్ నక్సలైట్లు అనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
9
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

పేదలకు దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-సీటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సారా పేదలకు అండగా నిలుస్తున్నారు. దుప్పట్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు.. అల్వాల్‌లోని స్లమ్ ఏరియా, రోడ్ సైడ్ ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ సారా గతంలోనూ పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని సాయికృష్ణ హిల్స్ వాసుల ఆహ్వానం మేరకు... ఆదివారం కాలనీకి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి విచ్చేశారు. కాలనీ సమస్యలతో పాటు అభివృద్ధి పనులపై విన్నవించారు. ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలోనే వారి సమస్యలను పై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, 17 వ డివిజన్ అధ్యక్షులు తిరుపతి, వెంకటేశ్వర్లు, జనార్దన్ రెడ్డి, విజయ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

ప్రజా విజయోత్సవాల వేడుకలకు

జలమండలి తాగునీటి శిబిరాలు

- హుస్సేన్ సాగర్ చుట్టూ 45 వాటర్ క్యాంపులు
- తనిఖీ చేసిన ఎండీ.అశోక్ రెడ్డి



నవతెలంగాణ సిటీబ్యూరో

ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకలకు తిలకించేందుకు వచ్చే ప్రజలకు కోసం జలమండలి ఏర్పాటు చేసిన తాగునీటి శిబిరాలను ఎండీ.అశోక్ రెడ్డి ఆదివారం ఈడీ మయాంక్ మిట్టల్‌తో కలిసి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఐ-మాక్స్, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో ఉన్న శిబిరాలకు వెళ్లిన ఆయన.. అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు. నీటి నాణ్యత, క్లోరిన్ పరీక్షల వివరాలు అధికారుల్ని అడిగి తెలుసుకుని వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మొదటగా 40 శిబిరాలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించామని.. అయితే ప్రజల తాకిడి దష్ట్యా మరో 5 కొత్త తాగు నీటి శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. రద్దీని బట్టి అవసరమైతే మరింత తాగునీరు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే గత రెండు రోజులుగా ఇప్పటికే 6 లక్షల మంచినీటి ప్యాకెట్లను బాటసారులకు అందించామని, వీటితోపాటు వాటర్ బాటిళ్ల, డ్రమ్ముల్లో సైతం మంచి నీటిని అందులోబాటులో ఉంచామని ఈ సందర్భంగా చెప్పారు. దీంతోపాటు రేపు చివరి రోజు ముగింపు వేడుకలకు కోసం మరో 3 లక్షల మంచినీటి ప్యాకెట్లను సిద్ధం చేసినట్లు చెప్పారు. జలమండలి క్వాలిటీ అస్యూరెన్స్ టీమ్(క్యూఏటీ)లు ఎప్పటికప్పుడు వాటర్ క్యాంపుల్లో మంచినీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు క్లోరిన్ లెవల్స్ తగిన మోతాదులో ఉండేలా చూస్తున్నాయి. వేడుకలు జరిగే అన్ని రూట్లలో ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా వాటర్ లీకేజీలు, సివరేజీ ఓవర్‌ఫ్లోలు లేకుండా జలమండలి ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టింది. మంచినీటి శిబిరాల పర్యవేక్షణ, ఇతర సమస్యలు తలెత్తకుండా చూసేందుకు జలమండలి నోడల్ అధికారులను నియమించింది. దీంతో పాటు ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో రెండు కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్-1 అమరేందర్ రెడ్డి, సిజిఎం ప్రభు జిఎంలు, బ్రిజేష్, దామోదర్ రెడ్డి, హరి శంకర్, ప్రభాకర్, జాన్ షరీఫ్, వినోద్, సాయి రమణ డిజిఎంలు మేనేజర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు మంచి స్పందన



నవతెలంగాన-సీటీబ్యూరో

ప్రజా పాలన -ప్రజా విజయోత్సవాలు ఉత్సవంలో భాగంగా ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన కార్యక్రమాలలో భాగంగా ట్యాంక్ బండ్ నెక్లెస్ రోడ్ పీపుల్ ప్లాజా సెక్రటేరియట్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉచిత వైద్య శిబిరాలు మొత్తం 21 ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది మొత్తం 125 పాల్గొంటున్నారు. అన్ని రకాల మందులు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. ప్రతిరోజు ఉదయం 12 గంటల నుండి కార్యక్రమం పూర్తి అయ్యేంతవరకు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ప్రతి ఉచిత వైద్య శిబిరం దగ్గర ఒక 108 అంబులెన్స్ వైద్య ఆరోగ్యశాఖ హైదరాబాద్ అంబులెన్స్‌లు ఉంచింది. శనివారం, ఆదివారం జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరాలను ఆర్.వి కర్ణన్, కమిషనర్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తెలంగాణ, డాక్టర్ రవీంద్ర నా యక్, డైరెక్టర్ ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తెలంగాణ సందర్శించి.. సందర్శకులకు అందుకున్న సేవల గురించి, సిబ్బంది, మందుల వివరాలు సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, హైద రాబాద్, డాక్టర్ తుకారం, డిఎంహెచ్ఓ, ఖైరతాబాద్, డాక్టర్ పి.చంద్రశేఖర్, డిఎంహెచ్ఓ, ఎల్బీనగర్, డాక్టర్ రఘునాథ స్వామి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సాయి బాబా, డాక్టర్ మురళీధర్, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ హేమ లత, జిల్లా మాస్ మీడియా అధికారి జే రాములు పాల్గొని నిరంతరం వైద్య శిబిరాల పర్యవేక్షణ చేశారు. ఈ శిబి రాలలో వైద్య అధికారులు వైద్య సిబ్బందిపాల్గొన్నారు.

కృష్ణగౌడ్(కృష్ణ) అనారోగ్యంతో మృతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన నాయకులు, గిరినగర్ బస్తీ వ్యవస్థాపకుల్లో ముఖ్యులు, పోచమ్మ ఆలయ ప్రథమ పోతురాజు అలగోని కృష్ణగౌడ్ (కృష్ణ) గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ.. ఆదివారం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్లు పి.నరసయ్య, వంగాల చంద్రమ్మ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు వంగాల శ్రీనివాస్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బస్తీ వాసులు కృష్ణగౌడ్ మృతదేహంపై పుష్పగుచ్చాలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నేతల పలువురు మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా పలు ఉద్యమాలలో, పోరాటాలలో కీలక భూమిక పోషించే వ్యక్తి కృష్ణ అని గుర్తు చేసుకుని విచారం వ్యక్తం చేశారు. మంచి నాయకుడిని కోల్పో యామన్నారు. సాయంత్రం అంతిమ యాత్రగా గుబురుగుట్ట స్మశాన వాటికలో దహన సంస్కరాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌కు వినతి



- దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మెన్ మేకల నగేష్

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ పరిధిలో బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహనీయుల భవన్ నిర్మించాలని ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద గౌడ్‌కు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మెన్ మేకల నగేష్ నేతృత్వంలో.. వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను మూడుసార్లు అసెంబ్లీకి పంపినటువంటి నిజాంపేట్ ప్రజలకు ఎల్లకాలం రుణపడి ఉంటానని తెలిపారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరు అధైర్యపడవద్దని, బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్‌ల భవన నిర్మాణాలకు తాను సహకరిస్తానని తెలిపారు. అదేవిధంగా అధికారులతో సంప్రదింపులు చేసి, భవనం నిర్మించి పెద్ద ఎత్తున ప్రారంభోత్సవ కూడా చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో జలగం చంద్రయ్య, బురికి రాములు, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

మినీ క్రిస్మస్ వేడుకల్లో చిట్టిరెడ్డి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పాపిరెడ్డి నగర్ రోడ్డు నెంబర్ 12 సెంటర్ రోడ్‌లో శనివారం రాత్రి జరిగిన మినిస్ట్రీస్ మినీ క్రిస్మస్ వేడుకల్లో చర్చి ఫాదర్, ఇతరుల ఆహ్వానం మేరకు..పాపిరెడ్డి నగర్ కాంటెస్టింగ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారికి అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ శాంతికి మారుపేరే క్రిస్మస్ వేడుకలన్నారు. ఈ విధంగా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ సందర్భంగా చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డిని, ఇతర నాయకులను క్రిస్మస్ వేడుక నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్స్ అలిగశన్, సోలమన్, జైపాల్ రెడ్డి, తెట్టేబావి ఆనంద్, కృపాల్ రెడ్డి, ప్రమోద్, గడ్డం సునీల్, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఫిరోజ్ గూడలో గడప గడపకు కాంగ్రెస్ నినాదం

- కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడలో కాంగ్రెస్అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ మేరకు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి కార్యకర్తలు నినాదంతో చేస్తూ.. ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న సందర్భంగా గత రెండు రోజులుగా కార్యకర్తలు, నాయకులు బస్తీల్లో, కాలనీల్లో కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రచారం చేశామన్నారు. ఆదివారం బాలానగర్ డివిజన్‌లోని ఫిరోజ్ గూడలో ఇంటింటికి తిరిగుతూ స్థానిక ప్రజలకు వివరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏవిధంగా పని చేశామో అదే విధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల్లోనే కాకుండా కాంగ్రెస్ కార్యకర్తల్లో సైతం కాంగ్రెస్ విధానాలు, పథకాలను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మదుమోహన్, గజనంద్ శేఖర్, జెల్లా శివ, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మహా పడిపూజ



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీలో గోపాల్ గురుస్వా మి ఆధ్వర్యంలో.. ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పడిపూజ మహెూత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరించిన వేదికపై శ్రీగణపతి, కుమారస్వామి, అయ్యప్ప స్వాములకు భక్తులు పలురకా ల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాలానగర్ రాజు కాలనీలోని పరిహర ప్రాంతాలు అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు స్వామి నామ స్మరణతో పరవశించిపోయారు. అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తులను అమితంగా ఆకట్టుకు న్నాయి. కన్నె స్వాములు ఎరుమేలి ఆటల పాటలతో స్వామి శరణు ఘోషనాలతో ఆహుతులను ఆకట్టుకున్నాయి. తదుపరి స్వామి తీర్థ ప్రసాదాలతో పాటు స్వాములకు భిక్షను అందజేశారు.

బాలమల్లేష్ మృతి బాధాకరం



- సంతాప సభలో పలువురు సీపీఐ నేతలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ బాల మల్లేష్ మృతి బాధాకరమని పలువురు సీపీఐ శ్రేణులు విచారం వ్యక్తం చేశారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్, గిరినగర్ సీపీఐ కార్యాలయ ఆవరణలో కుత్బుల్లాపూర్ మండల కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ అధ్యక్షతన "సంతాపసభ" నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల,పేదప్రజల పక్షాన అనేక ఉద్యమాలు,పోరాటాలు చేసిన గొప్ప నాయకులు బాలమల్లేష్ లేడనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ప్రజా నాయకులు బాలమల్లేష్ అకాలమరణం రాష్ట్ర పార్టీ శ్రేణులకు,వారి కుటుంబానికి తీరనిలోటన్నారు. సీనియర్ కమ్యూనిస్టు నేతల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో గిరినగర్ సీపీఐ పార్టీ మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు వీ.హరినాధరావు, శాఖ కార్యదర్శి యాకూబ్, సీనియర్ నాయకులు బాల్ నరసయ్య, యాదగిరి, పార్టీ సభ్యులు గాంధీనగర్ హమాలీ కామ్రేడ్స్ మల్లారెడ్డి, హరీష్ రెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

బాల మల్లేష్, పోటు ప్రసాద్ మరణం సీపీఐ నేతలకు తీరని లోటు..

బాలానగర్ : బాలమల్లేష్,పోటు ప్రసాద్ మరణం సీపీఐ నేతలకు తీరని లోటు అని మహిళ సమైక్య మేడ్చల్ జిల్లా అధ్యక్షు రాలు హైమవతి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మండల పరిధిలోని బాలానగర్‌లోని పార్టీ శ్రీశ్రీ నగర్ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పోటు ప్రసాద్ సంతాప సభ, కూకట్‌పల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ జి. కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు వారి జ్ఞాపకర్థం సీపీఐ పార్టీ సభ్యులకు టిఫిన్ బాక్సలు అందజేశారు. ఈ కార్యక్రమనికి సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, మహిళా సమైక్య మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ హైమావతి, మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు కామ్రేడ్ పాల బిందెల శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బాల మల్లేష్, పోటు ప్రసాద్ విద్యార్థి దశ నుంచి అనేక విద్యార్థి ఉద్యమాలలో పాల్గొని అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా కీలక పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి దశ నుంచి సీపీఐ పార్టీలో కీలక బాధ్యతలు పోషించి ఆకస్మికంగా మరణిం చడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణం కేవలం సీపీఐ పార్టీకే కాదని పేద ప్రజలకు, వామపక్ష పార్టీలకు తీరని లోటని వారి కుటుంబ సభ్యు లకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.మనోచారి, ఎం.దావీద్, డీ.రాజు గౌడ్, సిహెచ్ బాలయ్య, కె.కృష్ణ చారి, లక్ష్మి డోలే, ఉమా రాణి, నాగ లక్ష్మి, నారాయణ్, గంగన్న, పెంటయ్య, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభను విజయవంతం చేయండి

- కో ఆర్డినేటర్ సతీష్ అరోరా



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చి, బహిరంగ సభను విజయవంతం చేయాలని కో ఆర్డినేటర్ సతీష్ అరోరా పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం 3:30ని॥లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా.. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనం దుండిగల్‌లో ప్రారభోత్సవం. అనంతరం బహిరంగ సభ ఉంటుంది.

ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కృష్ణారావు నాయకత్వములో, నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల నుంచి కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు భారీగా తరళి వచ్చి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, ప్రారంభోత్సవం, తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, హాజరుకానున్నారు. రాష్ట్రతొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు దీక్ష చేపట్టి.. అప్పటి కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి, తెలంగాణ ఏర్పాటు కు మొదటి ప్రకటన చేయించుకొని, దీక్ష విరమింప చేసిన రోజు.. కాబట్టి డిసెంబర్ 9 సోమవారం రోజున, మధ్యాహ్నం 3:30ని॥ లకు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భారత రాష్ట్ర సమితి కార్యాలయం (దుండిగల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) ప్రారంభోత్సవ కార్యక్రమం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చేతుల మీదుగా జరుగుతుంది. కావున ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రతి ఒక్కరూ హాజరై, అనంతరము జరిగే సభను విజయవంతం చేయవలసిందిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకా నంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు కోరారు.



'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలి

- మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మెన్ మన్నె రాజు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నేడు నిర్వహించనున్న మత్స్యకారుల 'చలో అసెంబ్లీ ముట్టడి'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా డి.ఎఫ్.సి.ఎస్ చైర్మెన్ మన్నె రాజు పిలుపునిచ్చారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... మత్స్యకారుల హక్కులను కాలరాచి, ముదిరాజుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా, సమస్యల పరిష్కారానికై మత్సకారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పాలనతో మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాలపై మత్స్యకారులు పోరు బాట పట్టాలన్నారు. తెలంగాణలోని 32 జిల్లాలకు సొసైటీ ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తుందన్నారు. కేవలం 50 శాతం మాత్రమే చేప పిల్లల పంపిణీ చేసి, చేతులు దులుపుకుందన్నారు. మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల, కార్మికదారుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. తెలంగాణలో భూముల ధరలు విపరీ తంగా పెరిగినందున రియల్ మాఫియా చెరువులు, కుంటలను కబ్జాలు చేసిందన్నారు. పారిశ్రామికాభి వృద్ధి పేరిట పట్ట ణాల నుంచి రసాయనిక డ్రయినేజీ నీరు చెరువులు, కుంటలలో కలవడంతో మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. జలవనరులను కబ్జాలు, కాలుష్య కొరలలో నుంచి మత్స్య సంపదను, వృత్తిదారులను కాపాడాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. బీసీ - డీ నుండి బీసీ-ఏ కు మార్చేలా అసెంబ్లీలో బిల్లు ఆమోదించాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి నిధుల కేటాయించాలన్నారు. మత్స్యకారుల సమస్యలను వెం టనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు నిర్వహించనున్న మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని " చలో అసెంబ్లీ ముట్టడి " కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రాజీవ్ గాంధీ నగర్‌లోని పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదేశించారు. ఆదివారం ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండలోని రాజీవ్ గాంధీ నగర్ కాలనీ వాసులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో పెండింగ్‌లో ఉన్న రెండు రోడ్లు 40 ఫీట్ రోడ్డులో ఉన్న డ్రయినేజీ పనులు జరగాల్సి ఉండగా.. మంచి నీరు మొదలగు సమస్యలపై, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. డివిజన్‌లో పెండింగ్ పనులన్నీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని.. వీలైనంత త్వరగా అన్ని పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇవ్వడం ఇచ్చారు. కాలనీలో ఏ రకమైన సమస్య తలెత్తినా పరిష్కారం దిశగా కృషి చేద్దామని కార్పొరేటర్ అన్నారు. కాలనీలో 90 శాతం పనులు పూర్తి చేసినందుకు కాలనీ వాసులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుడ్ల శ్రీనివాస్, సిహెచ్ భాస్కర్, పోశెట్టి గౌడ్, కాలనీ వాసులు మురళి, ఇంత్యాజ్, రవి, ధనుంజయ, గుడారయ్య, సురేష్, తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

సీనియర్ జర్నలిస్టుకు విశ్వగురు వరల్డ్ రికార్డు కామధేను స్టేట్ లెవల్ అవార్డు ప్రదానం



నవతెలంగాణ-బేగంపేట్

గత 27సంవత్సరాల నుంచి మీడియాలో ఉన్న సీనియర్ జర్నలిస్టు లక్ష్మీ నివాస్ గద్దెకు విశ్వ గురు వరల్డ్ రికార్డు వారు జర్నలిజం కేటగిరి కింద స్టేట్ లెవల్ కామధేను అవార్డును ప్రకటించారు. ఈ అవార్డు కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ బేగంపేట్ సీఎం క్యాంప్ ఆఫీస్ సమీపంలోని టూరిజం ప్లాజాలో నిర్వహించారు. దీనిని ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద హాజరై ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నివాస్ మీడియా, సామాజిక సేవలను హైకోర్టు జడ్జి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈఓ సత్యవోలు రాంబాబు, 9టీవీ చైర్మెన్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలుంటే ప్రశ్నించండి వ్యక్తిగత విమర్శలు వద్దు

తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

లోపాలుంటే ప్రశ్నించండి వ్యక్తిగత విమర్శలు వద్దు అని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ పంపిణీ సంస్థ టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఐఏఎస్‌పై కొంత మంది పని గట్టుకొని చేస్తున్న ఆరోపణలను సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. జీటీఎస్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉద్యోగుల బదిలీల పక్రియ ముగిసిన తర్వాత ఆయన కొంత మందిని బదిలీ చేశారని, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అవగాహన లేమితనంతో సీఎండీని తప్పుబట్టడం తగదనీ బదిలీల విషయంలో ఆయన పక్షపాతం చూపలేదని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీని వాస్, కోశాధికారి కె.లింగం, కార్య నిర్వాహక అధ్యక్షులు కె.సోనీ, పులికోటి, మాళవిక, ఉపాధ్యక్షులు సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై జోలికి వెళ్లకండి

● కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

చిరు వ్యాపారుల దుకాణాలను ధ్వంసం చేసిన బేగంపేట ట్రాఫిక్ సీఐ పాపయ్యపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కోట నీలిమ డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ నేత విశాల్ సుధాం, చిరు వ్యాపారులతో కలిసి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజును కలిసి సీఐ పాపయ్యపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏసీపీ ఈ ఘనటపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఫుట్ పాత్‌ను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. నిత్యం రోడ్లపై ఉంటూ ప్రజలకు సేవా చేస్తున్నామని తమకు వ్యాపారులు, నాయకులు సహకరించాలని కోరారు.

మినిస్టీరియల్ స్టాఫ్‌కు ప్రమోషన్లు ఇవ్వండి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు డాక్టర్ ముజీబ్ విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖలో మినిస్టీరియల్ స్టాఫ్‌కు తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్) ఆదివారం సెంట్రల్ యూనియన్ ప్రచార కార్యదర్శి, ఆర్టీఏ యూనిట్ అధ్యక్షుడు అరుణేందర్ ప్రసాద్, కార్యదర్శి పవన్ కుమార్, ఉపాధ్యక్షుడు పర్వేజ్ ఖాన్ ఇతర సభ్యులతో కలిసి రవాణాశాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తొలుత జిల్లాలో ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉద్యోగుల స్పోర్ట్ మీట్స్‌కు రావాలని మంత్రిని డాక్టర్ ముజీబ్ సాదారంగా ఆహ్వానించారు. అనంతరం రవాణాశాఖ మినిస్టీరియల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించ డంతో పాటు పెండింగ్ కేసుల విచారణలను త్వర తగతిన పరిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. త్వరలోనే ప్రమోషన్లు, ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలతో పెండింగ్ కేసులను పరిష్కరించేలా సంబంధిత అధికారులకు చెబుతానని వారికి హామీ ఇచ్చినట్టు తెలిపారు. రవాణాశాఖలో ఏమైనా సమస్యలుంటే టీఎన్జీవోస్ ఆర్టీఏ యూనిట్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలనీ వారికి మంత్రి సూచించారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

'ప్రజాపాలన విజయోత్సవాలు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. కోఠి గన్‌ఫౌండ్రీలో 'ఐఎస్ఐ' గుర్తు ఉన్న హెల్మెట్‌లను మేయర్ గద్వాల విజయ లక్ష్మి చేతుల మీదుగా మహిళలకు అందజేశామని మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా తెలిపారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ కంటోన్మెంట్

కంటోన్మెంట్ బాలంరాయి దండు మారెమ్మ దేవాలయం 38వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల లో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు భక్తులు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ కంటోన్మెంట్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూరైన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పికెట్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సెక్రటేరియట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని ఎమ్మెల్యే శ్రీగణేష్ జెండా ఊపి ప్రారంభించారు. సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సందీప్ యాదవ్ అధ్యక్షతన జరిగిన బైక్ ర్యాలీలో యువకులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ప్రొ. కవిత దేవి



నవతెలంగాణ,ఓయూ:

ఉస్మానియా విశ్వ విద్యాలయం యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఓయూ కామర్స్ విభాగానికి చెందిన ప్రొ. ఎస్.కవిత దేవి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఓయూ వీసీ ప్రొ. కుమార్ ఆమెకు నియామక పత్రం అందజేశారు.

దేవాలయంపై రైల్వే అధికారుల తీరు సరైనదికాదు



నవతెలంగాణ-బేగంపేట్

రైల్వే అధికారుల తీరుపై మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్ పేటలో గల హమాలీబస్తీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, ఫంక్షన్ హాల్‌ను రైల్ కళారంగ్ సమీపంలో గల నల్ల పోచమ్మ దేవాలయంలను రైల్వేశాఖకు చెందిన స్థలంలో నిర్మించారని వెంటనే ఖాళీ చేయాలని రైల్వే అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి రైల్వే అధికారులు ఇచ్చిన నోటీసులు చూపారు. సుమారు 123 సంవత్సరాల క్రితం వెలసిన ఆంజనేయ స్వామికి ఆలయాన్ని నిర్మించి నాటి నుండి పూజలు నిర్వహిస్తూ వస్తున్నామని వివరించారు. నల్ల పోచమ్మ దేవాలయంలో కూడా ఎన్నో సంవత్సరాల నుండి పూజలు జరుపుతున్న విషయాన్ని తెలిపారు. ఇప్పుడు రైల్వే అధికారులు తమ స్థలం ఖాళీ చేయాలని చెప్పడం పట్ల తమ ఆవేదనను వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాటాడుతూ రైల్వే అధికారులు వ్యవహరిస్తున్న విధానం సరైనది కాదన్నారు. వెంటనే రైల్వే అధికారులకు లేఖ రాస్తానని చెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని, వెంటనే తమ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తమ తీరును మార్చుకోకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హమాలీబస్తీకి చెందిన నాయకులు సుభాష్, కుషాల్, సత్తి, రవి కుమార్, అంజయ్య, నర్సింగ్ రావు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండలోని సాయి బాబా నగర్ నివాసి ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ గౌడ్ మృతి కి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని, ఎమ్మెల్యే పేరు చెప్పుకొని ప్రజలను మోసం చేస్తున్న శ్రీనివాస్ గౌడ్ చావుకు కారకులైన ముగ్గురిని బీఆర్ఎస్ పార్టీ నుండి తొలగించాలని ఎమ్మెల్యేని హెచ్చరిస్తూ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కు వ్యతిరేకంగా ఆయన దిష్టిబొమ్మను బొరబండ గౌడ సంఘం సభ్యులు దహనం చేశారు. బొరబండ గౌడ ఈ కార్యక్రమంలో బండారి అశోక్, బాలరాజ్ గౌడ్, బస్తి అధ్యక్షులు అనంద్, గౌడ నరసింహ, గోగుళ్ల వెంకటేశ్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంవత్సర పాలన ప్రగతి పథంలో అభివృద్ధి

● ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

సంవత్సరం పాలనలో సీఎం రేవంత్ రెడ్డి శరవేగంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోయారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఆదివారం రసూల్పురలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామ్సన్ రాజ్ అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో సీఎం ప్రజలకు అందుబాటులో ఉండేవాళ్లు కాదు, కాని రేవంత్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. అలాగే గత ప్రభుత్వం కమీషన్ల కోసం నిధులు వృథా చేసి రూ. 7 లక్షల కోట్లు అప్పులు చేయడంతో ప్రస్తుత ప్రభుత్వంపై వడ్డీల భారం భారీగా పడుతుందన్నారు. కాని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కారు అన్ని ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేయడంతో పాటు ఆరోగ్య శ్రీ రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిందని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఎమ్మెల్యే మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయడానిక, కోటీశ్వరులను చేయడానికి మహిళలకు, స్వయం సహాయక సంఘాలను భారీ స్థాయిలో వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. నేటి నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో కంటోన్మెంట్ అభివృద్ధి కోసం నిధులతో పాటు నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కూడా ఇవ్వమని కోరతానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుకర్, నరేష్, అంజయ్య , యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు అందుకున్న యువ న్యాయవాది ధర్మారపు శ్రీకాంత్



నవతెలంగాణ,ఓయూ

విద్యార్థి దశ నుండి దళిత సంఘాల ఆధ్వర్యంలో మానవ హక్కుల, విద్యార్థి హక్కుల పరిరక్షణకై ఉద్యమాలు చేసినందుకు గుర్తింపు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాల, ఓయూ విద్యార్థి దశలో దళిత హక్కుల పరిరక్షణ కోసం, దళిత విద్యార్థుల హక్కుల కోసం పోరాడడమే కాకుండా రాజ్యాంగ పైన దళితులకి అవగాహన కల్పించడం కోసం అనేక పోరాటాలు చేసిన దళిత విద్యార్థి నాయకుడు, యువ న్యాయవాది ధర్మారపు శ్రీకాంత్‌కి ఐక్యరాజ్య సమితి మెంబర్, అంతర్జాతీయ పార్లమెంట్ (ఐఎన్‌టీఎల్) ఆసియాకు విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి, ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ హ్యూమన్ చైర్ హెూల్డర్‌ను కూడా తీసుకుంటుంది హక్కుల ప్రముఖ శాస్త్రవేత్త వ్యవస్థాపక చైర్మెన్ ఏయుజీపీ /యుఎస్‌యుజీపీ యుఎస్ఏ యొక్క చీఫ్ రెక్టర్, డిప్లొమాటిక్ మిషన్, యుఎన్ జీడీఓ యుఎస్ఏ చైర్మెన్, మానవ హక్కులు, రాజ్యాంగ హక్కులు, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఆక్స్‌ఫర్డ్ హయ్యర్ అకాడమీ గవర్నర్ హెచ్.ఇ. ప్రొఫెసర్ డాక్టర్ మధు కృష్ణన్ చేతుల మీదుగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికన్ ఎక్సలెన్స్ అవార్డు- దళిత హక్కుల, శాంతి పరిరక్షణ విభాగంలో విద్యార్థి నాయకుడిగా చేసిన సేవలకు గుర్తింపుగా అమెరికన్ ఎక్సలెన్స్ అవార్డ్ అందుకున్నారు. ధర్మారపు శ్రీకాంత్ (యువ న్యాయవాది) మాట్లాడుతూ ఈ అవార్డు ఇవ్వడంతో అదనంగా బాధ్యతలను పెంచారని భారత రాజ్యాంగ పరిరక్షణకు అలాగే అంబేద్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, పౌరుడి జీవనం రాజ్యాంగం మీద ఆధారపడాలి అంబేద్కర్ ఆశయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ రెహ్మత్ నగర్ డివిజన్ శ్రీ రామ్ నగర్ చౌరస్తాలో పదిమంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ రూ.3,18,500, విలువగల చెక్కులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్, బషీర్, ఇలియకత్, చోటు, అరుణ్, రాకేష్, సమద్, అహ్మద్, సురేందర్, కె.ఎస్‌రెడ్డి, దనూజ, ప్రవంతి, బేగం, యాదమ్మ జగ్గు, వినోద్, తరుణ్, రఘు, విజయ్, యూనుస్, జావీద్, అస్లాం బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మాట్లాడుతూ రహ్మత్ నగర్ డివిజన్ కమలానగర్‌లో నిర్మించిన 210 డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఇచ్చిన వారికే మరల రెండవసారి కేటాయించారని, కొత్తగా తయారు చేసిన లిస్టులో అనేక మంది అనర్హులు ఉన్నారని, ఈ విషయమై ఆర్డీవోకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. బోరబండ బస్ స్టాప్ నుండి రోడ్డు వెడల్పు పనులకు ఇండ్లు కోల్పోయిన వారికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చెక్కులు మంజూరు చేసి వారికి ఇవ్వటం జరిగిందని, ఇప్పుడు కొంతమంది స్వార్ధపరులు బిల్డింగులు తొలగించకుండా అడ్డుపడుతున్నారని, ఈ విషయంపై కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేశానన్నారు.

డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'స్నాతక్' ఆవిష్కరణ



నవ తెలంగాణ,ఓయూ

యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, ఓయూ టెక్స్‌టైల్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'స్నాతక్' అనే వినూత్న ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ఉపయోగించే సాంప్రదాయ వస్త్రాల స్థానంలో భారతీయ వారసత్వాన్ని ప్రతిబింబించే విశిష్టమైన వస్త్రాలు అందుబా టులోకి తెచ్చే ప్రయత్నం చేస్తుందని విభాగం ఆచార్యులు వాపోయారు. టెక్స్‌టైల్ టెక్నాలజీ విద్యార్థులు చేపట్టిన ఈ విశేషమైన ప్రారంభం, సాంస్కృతిక స్థిరమైన ఆవిష్కరణలకు వారి సృజనాత్మకత నిబద్ధతను సూచిస్తుందన్నారు. చివరి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు "స్నాతక్" కాన్సెప్ట్ ప్రదర్శించారు. వారి ఫీడ్‌బ్యాక్ మరియు సూచనల ఆధారంగా, ఉత్పత్తి త్వరలో ఖరారు చేయబడుతుంది, తద్వారా ఇది త్వరలో అధికారికంగా ప్రారంభించబడుతుంది. ఈ వినూత్న కార్యక్రమం ఓయూ విద్యార్థుల వినూత్న స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, విద్యా సంప్రదాయాలలో భారతీయ వారసత్వ వస్త్రాలను పునరుద్ధరించడంలో ఒక ముఖ్యమైన అడుగు అని ఆచార్యులు ధీమా వ్యక్తం చేశారు. టెక్స్‌టైల్ టెక్నాలజీ విభాగం అధిపతి సీనియర్ ప్రొఫెసర్ జె.హయ వదన, డీన్, ఫాకల్టీ ఆఫ్ ఫార్మసీ, సీనియర్ ప్రొ. చింత. సాయిలు, డా.ఆర్.రేణు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని చాటిన ఖాదర్ అలీ

● అయ్యప్పలకు అల్పాహారం.. పలువురు ప్రశంసలు



నవతెలంగాణ, ఓయూ:

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాక డివిజన్ మానికేశ్వర్ నగర్‌కు చెందిన మిస్కిన్ బైతుల్ మాల్ ట్రస్ట్ చైర్మెన్ అహ్మద్ హుస్సేన్ ఖాద్రీ మతసామరస్యాన్ని చాటారు. మానికేశ్వర్ నగర్ లోని ఏడుగుల దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అల్పాహారం అందజేశారు. వారితో కలిసి అయ్యప్ప పూజలో నిర్వహించి అల్పాహారం ఆరగించారు. ఈ సందర్భంగా ఖాదర్ అలీ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఈ విధంగా అయ్యప్ప స్వాములకు ప్రతి ఏటా అన్నదానం, అల్పాహారం వంటి అందజేత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మనుషులందరూ ఒకటేనని అందరూ సోదర భావంతో ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని హుస్సేన్ ఖాద్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడు గుడుల ఆలయ కమిటీ చైర్మెన్ టీడీపీ సీనియర్ నేత గండికోట విజయకుమార్, గురు స్వాములు ఆనంద్, సహదేవ్ రవితేజ, 60 మంది స్వాములు పాల్గొన్నారు.

కొత్త సీసాలో పాత సారాయే?



● తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ..

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల మద్దతు కోరుతామని 27న ఆమరణ దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్ ప్రకటించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చెన్నమనేని స్వయంప్రభతో కలిసి మాట్లాడారు. సర్పంచ్ల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయకుంటే పల్లె బాట కార్యక్రమం చేపట్టి ప్రజల మధ్యకు వెళ్లి వారికి ప్రస్తుత ప్రభుత్వ తీరును వివరిస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 9వ నుంచి జరగబోవు అసెంబ్లీ సమావేశాలలో సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల అంశంపై మాట్లాడాలని రాష్ట్రంలోని అన్ని పార్టీలు మద్దతు కోరుతూ నాయకులందరికీ వినతి పత్రాలు అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా సర్పంచ్‌ల యొక్క పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం కక్ష సాధింపు చర్యగా మేం భావిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సర కాలం నుండి వినతి పత్రాలు ఇస్తూ శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నామనీ కానీ ఎలాంటి స్పందన లేదనీ ఇప్పటికే ఈ రాష్ట్ర ప్రభుత్వం లక్ష కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తతుందని అదే విధంగా గత ప్రభుత్వ అప్పులకు ప్రతినెల రూ.5 వేల కోట్ల వడ్డీ కట్టే ప్రభుత్వం ఈ హంగామా ఎందుకు సర్పంచులకు రావాల్సిన వెయ్యి కోట్లు మాత్రం విడుదల చేయకపోవడం బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తపరిచారు. ఆరు గ్యారెంటీలపై ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో పర్యటిస్తామని గత ప్రభుత్వ హయాలో పనిచేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బకాయిలు మాత్రం విడుదల చేసి ఆయన బకాయిల్లో ఒక వంతులేని సర్పంచుల నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అకెనపెల్లి కరుణాకర్, దుమ్మ అంజయ్య, గున్నాల లక్ష్మణ్, కెంద గంగాధర్, మల్యాల దేవయ్య ఆరె మహేందర్, లింగంపల్లి కరుణాకర్, రాసూరి రాజేష్, కాదస సంతోష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

మాదాపూర్‌లోని శిల్పారామంలో పద్మావతి ఆర్ట్ అకాడమీ, సూత్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువర్యులు కార్తీక కిరణ్ శిష్యబృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మొదమున, వినాయక కౌతం, పుష్పాంజలి, హిమగిరితనయే, కొలువైఉన్నదే, జతిస్వరం, దశావతరం, పలుకే బంగారమాయెనా, నమశ్శివాయతే, తిల్లాన అంశాలను వేదం, సహస్ర, జాహ్నవి, శ్రీ అంవిత, పర్ణిక, లక్ష్మి అభిష్ట, లక్ష్మి అక్షిత, లలిత శిరీష, హాస్య పద్మా వతి, సౌగంధిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. నాట్య గురువులు బిందు, అభినయలు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను అభినందిచారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-తలకొండపల్లి

గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలకేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహా ర దీక్షలు కొనసాగుతున్నాయి. ఆది వారం మండల సాధన జేఏసీ చైర్మెన్ ముకురాల అశోక్‌గౌడ్ మాట్లాడారు.. రిలే దీక్షలు చేపట్టిన ఇన్ని రోజులు అవుతున్నా కల్వకుర్తి ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధా కరం అన్నారు. ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ సమా వేశాల్లోనైనా తమకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశా రు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మెన్ ఏదుల శరత్ చంద్ర, అనిల్, కృష్ణాజీ, ముత్యాలు, చంద్రయ్య, తిరుమల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, బాల య్య, చెన్నయ్య, మల్లయ్య, జంగయ్య శివయ్య, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

- స్పీకర్‌ను కోరిన వీఆర్‌ఏల సంఘం



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసుల సమస్యలు పరిష్కరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. స్పీకర్ సానుకూలంగా స్పందిస్తూ వారి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. జిల్లా అధ్యక్షులు పూజారి శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్, నాయకులు ఉన్నారు.

సాహిత్యం, కళలు తెలంగాణ అస్తిత్వాన్ని నిలిపివుంచుతాయి

- తెలంగాణ రచయితల సంఘం సదస్సులో వక్తలు

నవతెలంగాణ-కల్చరల్

సాహిత్యం కళలు తెలంగాణ అస్తిత్వాన్ని నిలిపివుంచుతాయి అని తెలంగాణ రచయితల సంఘం సదస్సులో వక్తలు పేర్కొన్నారు రవీంద్ర భారతి లోని సమావేశ మందిరం తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలు సందర్భం గా తెలంగాణ అస్తిత్వ సాహిత్యం వర్ధమాన సందర్భం నేపథ్యం గా సదస్సు జరిగింది కీలక ప్రసంగం చేసిన వేణుగోపాల స్వామి ఉద్యమ కాలం లో రచయితలు కవులు తెలంగాణ గడ్డ ఉనికి కోసం తమ సహిత్యం తో వెన్ను దన్నుగా నిలిచారు అని గుర్తు చేసారు అలాంటి సోయి ఇప్పటికీ వుండాలని పాలకులు అస్తిత్వ చినహాలకు దూరం జరిగినప్పుడు ప్రశ్నించాలి అన్నారు ప్రసిద్ధ కవి నిఖిలేశ్వర్ మాట్లాడుతూ ప్రగతిశీల భావాలు తో నిత్యం తెలంగాణ రచయితలు తమ రచనలు చేయాలనీ సూచించారు ప్రముఖ కవి డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ కాకతీయ తోరణం బతుకమ్మ చార్మినార్ వంటి గుర్తులను చెరిపే ప్రయత్నాన్ని రచయిత లు ఖండించాలి అన్నారు విద్వేష సంస్కృతిని వ్యతిరేకించాలి అని తెలంగాణ లో విభిన్న సామరస్య సంస్కృతి నీ పరిరక్షించటానికి కషి చేయాలన్నారు తెలంగాణ భాష జీవితం సంస్కృతిని వ్యాపార సరుకుగా మారటం విచార కరం అన్నారు ఆచార్య కాశీ మ్ కొల్లపురం విమల బాణాల భుజంగ రెడ్డి లు తెలంగాణ వున్నంత కాలం తెలంగాణ సహిత్యం వికాసం చెందుతూ వుంటుంది అన్నారు ప్రజాస్వామిక మానవీయ విలువలు కోసం తమ రచనలు చేయలి అని కోరారు తెలంగాణ



రచయితల సంఘం ప్రచురించిన ఇల్లు కలువ దారిలో పచ్చ బొట్లు, నిషిత సంపుటి ల ఆవిష్కరణ జరిగింది రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం అధ్య క్షత న జరిగిన సదస్సు లో ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి శంకర్ నివేదిక సమర్పించారు.

పార్లమెంట్ కమిటీనీ సమ్మోహితులను చేసిన ఫణి నారాయణ్ గానం



నవతెలంగాణ-కల్చరల్

ప్రసార భారతి సంస్థ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది సంస్థ పని తీరుల పర్యవేక్షణ కు పార్లిమెంట్ కమిటీ హైద్రాబాద్ వచ్చిన సందర్భంలో ఫణి నారాయణ తన శిష్య బందంతో కళా ప్రదర్శన చేసి వారిని సన్నిహితుల చేశారు. అలనాటి సంఘటనను దూరదర్శన్ విశ్రాంత అధికారి డాక్టర్ వోలేటి పార్వతీశం గుర్తు చేశారు. ప్రముఖ సంగీత సంస్థ శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ 11వ వార్షికోత్సవం శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సుస్వర సంగీత భరితం గా నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వోలేటిపార్వతీశం పాల్గొని వైనిక కళా కారుడు వడలి ఫణి నారాయణకు వైనిక బ్రాహ్మ బిరుదు ప్రదానం చేసి మాట్లాడారు. శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటే అన్ని ప్రక్రియల సంగీతం పాడవచ్చునన్నారు. శివ పార్వతి తన సంస్థను పదకొండు సంవత్సరాల కాలంలో ఎందరో ఔత్సాహికులను సంగీత కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు . వేదికపై ప్రముఖ గాయకుడు త్రినాథరావు, వి. అన్నపూర్ణ, లక్ష్మీ శేష చార్యులు కళా పోషకుడు వెంకట రావు తదితరులు పాల్గొన్నారు. సంస్థ స్థాపకురాలు శివ పార్వతి స్వాగతం పలికగా కార్యదర్శి చేపూరి లక్ష్మి నివేదిక సమర్పించారు.

ఇతర పార్టీలో చేరినట్టు నిరూపిస్తే 11 లక్షలు ఇస్తా..

- గడ్డం శ్రీనివాసయాదవ్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తాను ఇతర పార్టీలో చేరినట్టు ఆధారాలతో సహా ఎవరైనా నిరూపిస్తే రూ.11లక్షల నజరానా అందజేస్తాననీ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడా గడ్డం శ్రీనివాసయాదవ్ వెల్లడించారు. ఆదివారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ఎంతో క్రమశిక్షణతో రాజకీయాల్లో కొనసాగుతున్న తనను అప్రతిష్ట పాలుచేసేందుకు కొంత మంది వ్యక్తులు తాను బీఆర్ఎస్ వీడి ఇతర పార్టీలో చేరానని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తనపై విశ్వాసంతో బీఆర్ఎస్ హైదరాబాద్ లోక్ సభ అభ్యర్థిగా టిక్కెట్టు ఇచ్చి ప్రోత్సహించిందని గుర్తు చేశారు. నైతిక విలువలకు కట్టుబడి, ప్రజాక్షేత్రంలో తాను ఏమిటో అన్ని



వర్గాలకు తెలుసునీ అన్నారు. గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. తాను ఏ రాజకీయ పార్టీలోనైనా చేరినట్టు రాజకీయాల్లో ఉన్నవారితో పాటు ఇతర రంగాల్లో ఉన్న వారెవరైనా ఆధారాలతో సహా నిరూపిస్తే చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి దేవాలయం సాక్షిగా రూ.11లక్షలు నజరానా అందజేస్తాననీ ఆయన తెలియజేశారు. గత 5 నెలల క్రితం బీఆర్ఎస్‌లో నెలకొన్న కొన్ని కారాణాల వల్ల తాను బీఆర్ఎస్ వీడుతున్నట్టు రాజీనామా పత్రాన్ని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్‌కు అందజేసినట్టు గుర్తు చేశారు. కొన్ని రోజులకే పార్టీ సిద్ధాంతాలు, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకుని తిరిగి తన రాజీనామాను ఉపసంహరించుకున్నట్లు గడ్డం శ్రీనివాసయాదవ్ తెలియజేశారు. ఉద్యమ పార్టీలోనే కొనసాగుతూ గోషామహల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

చాంపియన్ షిప్ నిర్వహించడం అభినందనీయం



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ టైక్వాండో ఓపెన్ చాంపియన్ షిప్ క్యోరిగి అండ్ పోంసే 2024 హైదరాబాద్ అధ్యక్షుడు మాస్టర్ బి.కష్ణ ఆధ్వర్యంలో చాంపియన్ షిప్ కార్యక్రమం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కయూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు వినయ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మీర్ వహీద్ అలీ ఖాన్ పాల్గొని ముఖ్య అతిథుల చేతుల మీదుగా విజేత లకు మోడల్స్, మోమెంటమ్స్ అంద జేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ అందరూ పిల్లల ప్రతిభ చాటడానికి ఆత్మ విశ్వాసం పెంచడానికి ఈ చాంపియన్ షిప్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. స్వామి వివేకానందా చెప్పినట్టు గెలిస్తే పొంగిపొవద్దు.. ఓడితే నిరుత్సాహపడొద్దన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు రఘు, స్వామి, మనీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 131 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని చింతల్ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో పద్మా నగర్, రింగ్ రోడ్ శ్రీరామ్ ఆటో యూని యన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హాజరైన చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించడం వల్ల ఆటోడ్రైవర్స్ నష్టపోయారని వారిని ఆదుకునే బాధ్యత కూడా ప్రభుత్వందే ఉందన్నారు. ఆటో ,క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.50,000 ఇవ్వాలని ఆయన డిమాం డ్ చేశారు. ఆటో రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పా టు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఎస్.టి మోర్చా అధ్యక్షులు కట్ట కుమార్, విశాల్, సత్త య్య, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, చిత్తారి, శివ, వరుణ్, హేమంత్, శ్రీరామ్ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



వైభవోపేతంగా శ్రీ కాలబైరవ స్వామి నూతన దేవాలయ విగ్రహ ప్రతిష్ట ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ ఫాక్స్ సాగర్ కట్ట వద్ద శ్రీ కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు.. విచ్చేసి స్వామి వారిని దర్శిం చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి అన్నదాన కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్లా, సంతోష్ గౌడ్, శ్రీను, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, చిత్తారి, శివ, వరుణ్,హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



మోడీ గ్యారంటీ ఏమైందో ప్రజలకి చెప్పాలి

- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆచారి తక్షణమే క్షమాపణ చెప్పాలి
- టీపీసీసీ రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు మోహన్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్

నవతెలంగాణ-తలకొండపల్లి

మోడీ గత పదేండ్లుగా చెప్పిన గ్యారంటీలు ఏమైపో యాయని టీపీసీసీ రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు మోహ న్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ ప్రశ్నించారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. ఏం మొహం పెట్టుకొని బీజేపీ నాయకుల ర్యాలీలు చేస్తున్నా రని అన్నారు. ఎదుటి వారిని వేలెత్తి చూపేముందు ముందు తమవీపు చూసుకోవాలన్నారు. 2014 నుంచి నేటి వరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ. 500కే సిలిండర్, ఆరోగ్య శ్రీ పెంపు, ధాన్యానికి బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తదితర పథకాలు అమలు చేసిందన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రం పీకల్లోతు అప్పు ల్లో ఉన్నా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. బీజేపీ నాయకులు ఆచారి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఏ పని పాట లేకుండా ఆడ వారు ఎర్ర బస్సులో ఎక్కి పట్నంలో తిరుగుతున్నారని మ హిళలను అవమానపరిచే విధంగా మాట్లాడ డం సబబు కాదన్నారు. తక్షణమే మహిళ లోకానికి ఆచారి క్షమా పణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమా వేశంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్య దర్శి డిగ్రీ కృష్ణ, మైనారిటీ మండల అధ్యక్షులు ఆరిఫ్, టౌన్ అధ్యక్షులు రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రా మ్మోహన్‌రెడ్డి, శేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకులు రమేష్, ఆంజనేయులు, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
12
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 266వ అన్నదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల పైన జీవిస్తున్న అనాథలు నిరాశ్రయులు అభాగ్యులకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 266వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని సభ్యులు నేహా తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు నిరంతర కృషి చేస్తానని కార్పొరేటర్ బీ. పద్మ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని శారద నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి సీనియర్ బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులతో భవిష్యత్తులో చేపట్టా ల్సిన అభివృద్ధి పనులు పెండింగ్ పనులు విద్యుత్ లైట్లు కమిటీ హాల్‌లో పెండింగ్ పనులు తదితర అంశాలపై కాలనీ వాసులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో శారద నగర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాదవ రెడ్డి, సెక్రటరీ శ్రీశేఖర్య అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

● కార్పొరేటర్ ఇ.విజయకుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అన్నపూర్ణ నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్‌లో కార్పొరేటర్ డెవలప్మెంట్ కార్యాలయంలో అన్నపూర్ణ నగర్ కాలనీవాసులు కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ ని స్థానిక సమస్యల పరిష్కారం కోసం కలిశారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే స్థానిక అధికారులతో కలిసి పర్యటించి పెండింగ్ పనులు నూతనంగా చేపట్టినవ్వాల్సిన పనులులో ప్రెషర్, వీధిలైట్ల సమస్యను బస్తీలో ఉన్న ప్రతి ఒక్కరితోని చర్చించి శాశ్వత సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ వాసులు ఎస్ నరసింహ, రఘు, టీ.నరసింహ, వెంకటయ్య, దేవేందర్, జి రాజు, సురేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇన్‌స్పైర్, బాల విజ్ఞాన ప్రదర్శిని

● రాష్ట్ర స్థాయికి 14 ప్రాజెక్టుల ఎంపిక
● ప్రథమ, ద్వితీయ స్థానం విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇన్‌స్పైర్ మానక్ 2023-24 సంవత్సరానికి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముషీరాబాద్‌లోని సెంట్ పాయిస్ పాఠశాలలో నిర్వహించారు. ఇందులో ఇన్‌స్పైర్ మానక్ సంబంధించి 150 ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపికయిన విద్యార్థులు ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన 14 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాల విజ్ఞాన్ ప్రదర్శనలో 140 మంది విద్యార్థులు ఏడు అంశాలలో ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో నుంచి రాష్ట్ర స్థాయికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రతి అంశం నుంచి ఒక్కరిని జూనియర్, సీనియర్ విభాగాల నుంచి ఏడుగురు చొప్పున ఎంపిక చేశారు. ఉపాధ్యాయులు రూపొందించిన టీఎల్ఎం ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకొన్నవి. బాల విజ్ఞాన ప్రదర్శనలో భాగంగా మిల్లెట్‌పై సెమినార్‌ను నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానంలో వచ్చిన విద్యార్థులకు బహుమతి డీఈవో ఆర్.రోహిణి ప్రదానం చేశారు. ఇదిలావుంటే ఈనెల 6న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఈ ప్రదర్శనను ప్రారంభించగా.. ఈ ప్రదర్శన 7వ తేదీన ముగిసింది. ఇందులో న్యాయ నిర్ణేతలుగా వరంగల్ నీట్ ప్రొఫెసర్ పులి రవి కుమార్, ప్లేనేటోరీ సొసైటీ డైరెక్టర్ రఘునందన్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నాథణియల్, తపస్య డిగ్రీ కాలేజ్ లెక్చరర్ దయాకర్, అసోసియేట్ ప్రొఫెసర్ స్రవంతి.. విద్యార్థుల ప్రాజెక్ట్ ఎంపిక చేసి జిల్లా స్థాయి విజేతలను ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్, బాల విజ్ఞాన్ ప్రదర్శనలో పాల్గొంటారని జిల్లా డీఎస్‌వో సి.ధర్మేందర్ రావ్ తెలియజేశారు.



ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

● సాయి దత్త హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రతిఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య రక్షణకు కృషి చేయాలని సాయి దత్త హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఈఎస్ ధనంజయ అన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్‌లో సాయి దత్త ఆస్పత్రిలో డాక్టర్ సిరి చందన రెడ్డి జనరల్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఈఎస్ ధనుంజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మన తీసుకునే ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పులు, ఇతర కాలుష్యాల వలన ప్రతి ఒక్కరు అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఇలాంటి పరిస్థితిలో ఆరోగ్యం పట్ల నిర్లక్షం వద్దని, ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పేదలకు వైద్యం అందించేందుకు ఎల్లప్పుడూ సాయి దత్త ఆస్పత్రి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి ఉచిత వైద్యం మందులు టెస్టులు చేయించారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి డాక్టర్ కుమార్, డాక్టర్ కరిష్మా డాక్టర్ పెర్నాడేజ్, కోఆర్డినేటర్ ప్రముఖ సంఘ సేవకులు బోనం వీరబాబుతదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నారాయణగూడ కేశవ మెమోరియల్ కాలేజ్ ప్రాంతంలో జరిగిన అయ్యప్ప స్వామి మహా పడి పూజలో కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి సి.కృష్ణ యాదవ్, బీజేపీ నాయకుడు మాజీ వార్డ్ మెంబర్ దినేష్ అంబా రే తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

కార్మికుల కనీస వేతనాలు అమలు చేయాలి

● ఇంటింటి సభ్యత్వ నమోదులో సీఐటీయూ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

కార్మికుల కనీస వేతనాలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, సీఐటీయూ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎం.డి అబ్బాస్ లు అన్నారు. సీఐటీయూ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి సభ్యత్వ నమోదు కార్యక్రమం చాంద్రాయణగుట్టలోని రవీంద్రనాయక్ నగర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు మాట్లాడుతూ.. సీఐటీయూ సంఘం కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. పని ప్రదేశాలలో కార్మికులకు అండగా ఉంటూ వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేసే సంఘం సీఐటీయూ మాత్రమే అని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఇఎస్ఐ అమలు చేసి ప్రతి కార్మికునికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన నాలుగు లేబర్ కోర్డ్ రద్దు చేయాలన్నారు. కార్మికులకు ఉపయోగ పడే చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిరంతరం కార్మికుల పక్షాన పోరాడే సంఘం సీఐటయూలో కార్మికులు పెద్ద ఎత్తున్న సభ్యులుగా చేరాల ని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.మీనా, జిల్లా సీనియర్ నాయ కులు జి. విట్టల్, జిల్లా నాయకులు కిషన్, రాంకుమార్, కోటయ్య, కృష్ణ, జంగయ్య, రాష్ట్ర నాయకులు శోభన్, శ్రీను, రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులకు బెల్టుల ప్రధానోత్సవం



నవతెలంగాణ-అంబర్‌పేట

జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50మంది విద్యార్థులు కలర్ బెల్ట్ గ్రేడింగ్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థి, విద్యార్థులకు మహిళా సంక్షేమ విభాగం అడిషనల్ డీసీపీ బురహాన్ అలీ చేతుల మీదుగా బెల్ట్‌లు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా బుర హాన్ అలీ మాట్లాడుతూ కరాటే వంటి ఆత్మరక్షణ విద్య మహిళలు, బాలికలు మాత్రమే కాకుండా అన్ని వయసుల వారికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కరాటే సాధన ద్వారా వారు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆరోగ్యం మానసిక ఉల్లాసాన్ని పొందుతారని, ఆత్మరక్షణ విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమాజంలో మహిళల భద్రతను, స్థాయిని మెరుగుపరచవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి, బ్లాక్ బెల్ట్‌లు కరీం, అమృత రెడ్డి, గణ సంతోషిని, మహేందర్, రంజిత్ సింగ్, షైనీ, వెంకట్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అందరికి సమాన ఆరోగ్య సంరక్షణను అందించాలి'

● ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్ ఎవిటా ఫెర్నాండెజ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అందరికి సమాన ఆరోగ్య సంరక్షణను అందించడానికి మెరుగైన నమూనాను అభివృద్ధి, అధ్యయ నం చేయడం, ప్రోత్సహించడం తమ సంస్థల ముఖ్య ఉద్దేశమని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్ ఎవిటా ఫెర్నాండెజ్, ఈహెచ్ఏసీ చైర్ పర్సన్ డివిఆర్.శేషాద్రి, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీ ఈఐ), ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సంస్థలు ఎనిమిదో ఈక్విటబుల్ హెల్త్ కేర్ యాక్సెస్ కన్సార్టియం (ఈహెచ్ఏసీ) సభ్యుల సమావేశాన్ని ఈ నెల 6, 7వ తేదీల్లో నగరంలోని ఎల్వీపీఈఐ క్యాంపస్‌లో నిర్వహించినట్లు తెలిపారు. 6న ప్రారంభమైన ఈ సమా వేశానికి ఎల్వీపీ ఈఐ, ఫెర్నాండెజ్ ఫౌండేషన్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఐఐఎం ఉదయపూర్ సెంటర్ ఫర్ హెల్త్ కేర్, సెయింట్ జాన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అరవింద్ ఐ కేర్ సిస్టమ్ వంటి సంస్థల నుంచి చాలా మంది హాజరయ్యారని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన..

● నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన విజయోత్సవాలు రాష్ట్రంలో ఘనంగా నిర్వహిస్తున్నారని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలలో బాగంగా నియోజకవర్గంలోని దూద్ బౌలి, కిషన్ బాగ్ డివిజన్లలో డివిజన్ అధ్యక్షులు భాను చందర్ యాదవ్, నజీర్ ఖాన్ ఆధ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధులుగా పాల్గొని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా పేల్చడం, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేళా కోట్ల అభివృద్ధి పనులను శంకుస్థాపన చేస్తూ, ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేలకు పైన నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. మైనారిటీ సోదరులకు అధ్యాధిక బడ్జెట్ కేటాయించిన నేతగా, మహిళల బాధలు తెలుసుకొని ఉచిత బస్ సౌకర్యం ఇచ్చిన మహిళలకు పెద్ద అన్నగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి బహదూర్‌పూర నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులూ, అలీ షాన్, అబేద్ అలీ, బారి ఖాన్, మఖ్బూల్, నసీర్ ఫారూకీ, యువజన కాంగ్రెస్ నాయకులూ జ్యోతి శెట్టి, ఇబ్రహీం, జహంగీర్, అరవింద్, రామకృష్ణ, షఫీ, అహ్మద్, సంతోష్, సుమన్ 7, అంబికా తదితరులు పాల్గొన్నారు.

రూ.4500 కోట్ల ఫీజుల బకాయిలు విడుదల చేయాలి

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ
● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ



నవతెలంగాణ-ముషీరాబాద్

16లక్షల మంది బీసీ,ఎస్‌సీ,ఎస్‌టీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థుల గత మూడు సంవత్సరాల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని అలాగే బీసీ, ఈబీసీ ఇంజనీరింగ్ తదితర వృత్తి విద్య కోర్సులు పూర్తి ఫీజు స్కీంను పునరుద్దరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.అనేక స్కీములకు - కాంట్రాక్టర్ల వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్నారు. కానీ చదువుకునే విద్యార్థుల మెస్ బిల్లులు - స్కాలర్షిప్ల చెల్లించడానికి బడ్జెట్ లేదా అని ప్రశ్నించారు. ఈ నెలల కాలం లో ఏయే బిల్లులు చెల్లించారో శ్వేత పత్రం ప్రకటిం చాలని కోరారు. ఆర్థిక శాఖ వ్యవహారాలపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించాలని అలాగే స్కాలర్‌షిప్ రేట్లను పెంచాలని గత 4నెలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తు న్న ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. విద్యార్థుల యొక్క స్కాలర్షిప్‌లను రూ.5500 నుండి రూ.10వేలకు పెంచాలని కోరారు. ప్రస్తుత స్కాలర్‌షిప్ రేట్లు 8 సంవత్సరాల క్రితం నిర్ణయించారు. పెరిగిన విద్యార్థుల కనీస అవసరాలు పరిగణంలో తీసుకొని స్కాలర్‌షిప్ రేట్లు పెంచాలని ముఖ్యమంత్రిని కోరారు. విద్యాపై పెట్టే బడ్జెట్‌ను వ్యయం కోణంలో చూడరాదని దీనిని పెట్టుబడిగా చూడాలన్నారు. విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని 10న జరిగే కలెక్టరేట్లు, ఎంఆర్‌ఓ, డీఆర్‌ఓ ఆఫీసుల ముట్టడి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా ర్యాలీలు ధర్నాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'12న 'హలో కళాకారుడా-ఛలో హైదరాబాద్'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఈ నెల 12, 13వ తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వానికి తమ గళం వినిపించేందుకు "హలో కళాకారుడా-ఛలో హైదరాబాద్" పేరుతో పాటల పల్లకిలో 32 గంటల ఆట-పాట, దగపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమాన్ని నేర్నెల కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమ కళాకారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యమ కళాకారులు కంటే సాయన్న, భూంపల్లి అశోక్, గర్భమీది సంపత్, శ్రీరామ్, కొడముంజ రవి, పాట రాజశ్రీ, మహేష్, గౌరయాకన్న, కళ్యాణి, మౌనిక తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు పెంచి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సంస్కృతిక శాఖ చైర్మెన్ వెన్నెల తదితర ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో పని చేసిన కళాకారుల కోసం సాంస్కృతిక సారధి ఏర్పాటు చేసి 550 మంది ఉద్యోగాల నియామకాల్లో చాలా అవకతవకలు జరిగాయన్నారు. ఎంతో మంది అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. నిజమైన కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నిలదీసిన కళాకారులకు రెండవ విడతలో ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ నెరవేర్చకుండానే దిగిపోయారన్నారు.

బీసీ కులగణన సర్వే నిర్వహించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు

● గౌడ సంఘాల సమన్వయ కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన నిర్వహించినందుకు కాంగ్రెస్‌కి రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ తెలిపింది. ఆదివారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా లోక్‌సభ సభ్యులు రామ కృష్ణను ఢిల్లీలోని తన నివాసంలో సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, నాయకులు వి.నాగ భూషణంలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జరుగుతున్న కులగణన సర్వేతోపాటు బీసీల అభివృద్ధి, గౌడ్‌ల సంక్షేమం తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకుపోయారు. రాష్ట్రంలో గౌడలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధిష్టా నానికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు.

గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలి

● సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థుల వినతి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలోని గ్రంథాలయల్లో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ తదితర అనుబంధ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయాలని లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు ఆదివారం హిమాయత్ నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అభ్యర్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, తెలంగాణ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ సంఘం కన్వీనర్ ఆకుల సాయిలు మాట్లాడుతూ తెలంగాణలోని వివిధ విద్యా సంస్థ లలో గల ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, గురుకుల, వివిధ ప్రభుత్వ కళాశాలలు, ఐటీఐ, సాంకేతిక, మెడికల్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పౌర గ్రంథాలయంలో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్, వాటి అనుబంధ పోస్టులు గత 35 సంవత్సరాల నుండి ఎలాంటి ప్రత్యక్ష నియామకాలు చేపట్టకపోవడం వల్ల పౌర గ్రంథాలయాలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. వాటిలో సిబ్బంది లేక పౌరులకు ఎంతో ఇబ్బందుగా ఉందని, లైబ్రరీ సెంట్రల్ ఎక్సైజ్, సేవా పన్ను 8 శాతం వసూలు చేస్తున్నప్పటికీ వాటిని లైబ్రరీలకు కేటాయించకపోవడం వల్ల వాటిలో అన్ని వసతులు లేక పౌర గ్రంథాలయాలు మూసివేసే పరిస్థితులలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా గురుకుల పాఠశాలల్లో నియమించిన ప్రకారమే మిగతా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేయాలని, వాటిలో అర్హతలు గల లైబ్రేరియన్లను నియ మించాలని వారు డిమాండ్ చేశారు. లైబ్రరీ సైన్స్ నిరు ద్యోగ అభ్యర్థుల విషయంలో అసెంబ్లీ సెషన్ లో చర్చిస్తా మని, సీపీఐ పార్టీ తరపున తన వంతుగా సీఎం ఎ.రేవంత్ రెడ్డి, క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, తెలంగాణ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ అసోసియేషన్ సభ్యులు ఎం. మంజుల, సుమన్, ఎం.రాము, ఎస్. ప్రశాంత్, ఎస్.శివ, సిద్దుల శివ, బాలబ్రహ్మం పాల్గొన్నారు.

ప్రజాపాలనకు ప్రజల మద్దతు పెరిగింది

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అరవింద్ కుమార్ యాదవ్




నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో ప్రజా పాలనకు ప్రజల మద్దతు పెరిగిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎం.అరవింద్ కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకున్నందుకు సంబరాలు నిర్వహించారు. అరవింద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో అభివృద్ధి కార్యక్ర మాలు చురుకుగా సాగుతున్నాయన్నారు. గతంలో జరిగిన అవినీతి పాలనపై ప్రజలు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి హయాంలో పెద్ద ఎత్తున రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల వారికి ఈ ప్రభుత్వంలో సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాంనగర్ డివిజన్ ఇన్‌చార్జి లోకేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాసాని ఆనంద్, శ్యామ్యాదవ్, వాజీద్ హుస్సేన్, జాహెద్, అజయ్, మీరాభాయ్, రాజు వర్మం, జబ్బార్, నరేష్, ప్రేమ్, మురళీ, అంజియాదవ్ రవి, గంగాధర్, సతీష్ అజార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సేవ దినోత్సవం పురస్కరించుకొని గ్లోబల్ పీస్ సేవా అవార్డుని అందుకున్న అంబర్‌పేట నియోజకవర్గంలో చెందిన నేతకానీ దీప కుమార్

నవతెలంగాణ-అంబర్‌పేట



ప్రజా పాలన విజయోత్సవాల్లో ఘనంగా పాలాభిషేకం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వరి సింగ్ నేతృత్వంలో గోషామహల్ పురాణపూల్ చౌరస్తా గాంధీ విగ్రహం ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటో కి పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఏడాది ఉత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్జు, ఠాకూర్, భద్రినాథ్, ముంద్రాయి శ్రీనివాస్, కైలాష్ సింగ్, శశిరాజ్‌సింగ్, ఖదీర్, వెంక టేష్, అనిల్, మల్లేష్, ధర్మేష్ సునీల్ సాహు, గులాబ్ సింగ్, శోభా బాయి, రేణుక శంకరమ్మ పి శాంత తదితరులు..

కిషన్ బాగ్ పార్క్ వద్ద..

నవతెలంగాణ-ధూల్‌పేట్

కిషన్ బాగ్ పార్క్ వద్ద ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నియోజక వర్గం ఇన్‌చార్జీ రాకేష్ కుమార్, స్థానిక నాయకులు..



గుమ్మడి గింజలతో...

తరచూ గుమ్మడి గింజలు తీసుకుంటే.. అనేక అరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అధిక బరువుతో బాధపడేవారు గుమ్మడి గింజలు తింటే.. మేలు జరుగుతుంది.

క్యాన్సర్‌కు చెక్..

గుమ్మడి గింజల్లోని కెరొటినాయిడ్లు, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. గుమ్మడి గింజలు తరచుగా తీసుకుంటే.. గ్యాస్ట్రిక్, ప్రోస్టేట్, బ్రెస్ట్, లంగ్, పేగు కేన్సర్ల నుంచి రక్షణ లభిస్తుంది. మహిళలు గుమ్మడికాయ విత్తనాలను తరచుగా తీసుకుంటే బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. నెలసరి నిలిచిన మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ముప్పు తగ్గటానికీ గుమ్మడి గింజలు తోడ్పడుతున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది..

షుగర్ పేషెంట్స్‌కు గుమ్మడి గింజలు మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి గింజల్లో యాంటీడయాబెటిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచుతాయి. గుమ్మడికాయ విత్తనాలలో ట్రిగోనెలైన్, నికోటినిక్ యాసిడ్, డి-కైరో-ఐనాసిటాల్ అనే సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచుతాయి.

జుట్టు స్ట్రాంగ్‌గా ఉంటుంది..

రోజూ చెంచా గుమ్మడి విత్తనాలను తీసుకుంటే జుట్టు దృఢంగా ఉంటుంది. గుమ్మడి గింజల్లోని సెలెనియం, మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం, కాపర్, ఏ, బీ, సీ విటమిన్లు జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి తింటే చుండ్రు సమస్య కూడా రాదు.

పని చేసే చోట ఇలా...

ప్రతి మనిషిలోనూ పాజిటివ్, నెగెటివ్... ఇలా రెండు రకాల భావోద్వేగాలుంటాయి. అయితే పాజిటివ్ ఎమోషన్స్ వల్ల ఎలాంటి సమస్యలూ తలెత్తకపోయినా, నెగెటివ్ ఎమోషన్స్ మాత్రం మనల్ని మానసికంగా కుంగదీస్తాయి. మహిళలకు ఈ సమస్య మరీ ఎక్కువ. ముఖ్యంగా పని చేసే చోట ఇలాంటి భావోద్వేగాలు అస్సలు ప్రదర్శించకూడదంటున్నారు నిపుణులు. లేదంటే వాటి ప్రభావం మన కెరీర్‌పై పడే అవకాశాలున్నాయంటున్నారు. అవేంటో తెలుసుకుందాం...



అబ్బబ్బా... ఎంత చేసినా ఈ పని మాత్రం అయిపోవట్లేదు. దీనికి తోడు ఎవరైనా రాకపోతే వారి పనీ నేనే చేయాలి అంటూ కోపం తెచ్చుకుంటుంటారు కొంతమంది. అయితే దీనివల్ల నిరాశానిస్పృహలు ఆవహించడం తప్ప మరే ప్రయోజనమూ ఉండదు. ఇక ఆ సమయంలో ఎవరు మాట్లాడించినా ఆ కోపాన్నంతా వారిపై చూపిస్తుంటారు. ఇలాంటి ధోరణి పని చేస చోట అస్సలు మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల ఇటు మీ పనీ పూర్తి కాదు... అటు ఇతరులతోనూ అభిప్రాయభేదాలు ఏర్పడతాయి. కాబట్టి పని భారం ఎక్కువగా ఉన్నప్పుడు కోపం తెచ్చుకోకుండా శాంతంగా ఆలోచించాలి. ఈరోజే కచ్చితంగా పూర్తి చేయాల్సిన పనులేంటో చూసుకొని మీకున్న సమయంలోనే వాటిని పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాత సమయం ఉంటే మిగతా పనులు చేయడం, లేదంటే వాటిని మరుసటి రోజు పూర్తి చేయడం... ఇలాంటి చిన్న చిన్న ప్రత్యామ్నాయ మార్గాల్ని అనుసరిస్తే పని ఎక్కువగా ఉందన్న చికాకు మీపై పడకుండా ఉంటుంది.

బాధపడుతున్నారా..?

మంచి మంచి ఉద్యోగాలు చేస్తూ ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్న వారికి కూడా ఇటు వృత్తిపరంగా, అటు వ్యక్తిగతంగా ఎన్నో సమస్యలుంటాయి. అయితే కొందరు ఈ రెండింటినీ సమన్వయం చేసుకోలేక సతమతమవుతుంటారు.







ఈ భావోద్వేగాల్ని అదుపు చేసుకోలేక అక్కడే ఏడ్చేస్తుంటారు. కానీ ఇలా సహోద్యోగుల ముందు, పై అధికారుల ముందు ఏడవడం వల్ల వారికి మీరు చులకనయ్యే అవకాశముంది. కాబట్టి సమస్య ఏదైనా భావోద్వేగాల్ని అదుపు చేసుకోవడం, వాటి ప్రభావం మీరు చేసే పనిపై పడకుండా చూసుకోవడం ఉత్తమం. మరీ అంతలా బాధనిపిస్తే మీకు కాస్త క్లోజ్‌గా ఉన్న సహోద్యోగులతో లేదంటే మీ కుటుంబ సభ్యులతో పంచుకొని దాని పరిష్కారం కోసం వారి సహాయం తీసుకోవడంలో తప్పు లేదు.

ఈర్ష్యాద్వేషాలకు దూరంగా...

ఆఫీసన్నాక అందరు ఉద్యోగులూ ఒకే రకంగా పని చేయాలని, అందరి ఆలోచనలూ ఒకే తరహాలో ఉండాలని రూలేం లేదు. కొందరికి పని విషయంలో ఉత్తమమైన ఆలోచనలు రావొచ్చు. దాంతో వారు పై అధికారుల మెప్పు పొందవచ్చు. మరికొందరు తటస్థంగానే ఉండచ్చు. అయితే ఇలా సహోద్యోగుల్ని ప్రశంసించేటప్పుడు కొందరు వారిపై అసూయ పడుతుంటారు. 'అబ్బా... ఆ మాత్రం పనికే పొగడాలా..' అంటూ వారిపై ఈర్ష్యాద్వేషాలు పెంచుకుంటుంటారు. కానీ ఇలాంటి వాటి వల్ల ఇతరులకు మీపై చెడు అభిప్రాయం కలగడం తప్ప మరే ప్రయోజనాలు ఉండదు. కాబట్టి సహోద్యోగుల విషయంలో ఇలా ఆలోచించడం మాని.. మీకు తెలియని విషయాలు వారి నుంచి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఉద్యోగులందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి విజయాన్ని మనస్ఫూర్తిగా అభినందించడం నేర్చుకోవాలి.

మనసు పాడుచేసుకోవద్దు

పై అధికారులు అప్పగించిన పనిని సరైన సమయంలో పూర్తి చేయకపోయినా, పని చేయడానికి పెట్టుకున్న డెడ్‌లైన్లో అది పూర్తవ్వకపోయినా, అందులో తప్పులున్నా చాలా మంది ఉద్యోగుల మనసుల్లో అపరాధ భావం మెదులుతుంటుంది. అయితే దీని ప్రభావం ఆ తర్వాత మనం చేసే పనులపై పడడంతో పాటు... అది మన మనసునూ కుంగదీస్తుంది. కాబట్టి మీలో ఉన్న అపరాధ భావాన్ని వెంటనే తొలగించడం మంచిది. ఇందుకోసం పదే పదే దాని గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోవడం కాకుండా అనుకున్న సమయంలో పని పూర్తిచేయలేకపోవడానికి గల కారణాలేంటో తెలుసుకొని వాటిని పునరావృతం కాకుండా చూసుకోవాలి. తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చెక్ చేసుకోవాలి. ఫలితంగా మరోసారి ఈ భావన మనసులోకి రాకుండా పనిపై పూర్తి ఏకాగ్రత నిలిపి దాన్ని శ్రద్ధగా చేయగలుగుతాం.

అభద్రతా భావం వద్దు

కొత్తగా ఉద్యోగంలో చేరినా, అందులో కొన్నేండ్ల అనుభవం గడించినా కొందరికి వారు చేసే ఉద్యోగం పట్ల అభద్రతా భావం ఉంటుంది. పని విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాకపోవడం, ప్రతి విషయంలోనూ ఇతరులతో పోల్చుకోవడం... వల్ల ఈ సమస్య వస్తుంది. తద్వారా మీపై మరింత ఒత్తిడి పడి, చేస్తున్న పని కూడా సరిగ్గా చేయలేరు. కాబట్టి పని విషయంలో అప్‌డేట్‌గా ఉండడం, పోల్చుకోవడం మాని మీకు తెలియని విషయాలను సహోద్యోగులను అడిగి తెలుసుకోవడం వల్ల అభద్రత మీ దరి చేరకుండా జాగ్రత్తపడొచ్చు. అలాగే కెరీర్‌లోనూ రాణించవచ్చు.

కలిసి మెలిసి ఉండండి

కొంతమంది మన పనేదో మనది ఇతరులతో అవసరం లేదన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. కానీ కొన్ని పనులకు ఇతరుల సహాయం అవసర ఉన్నా, లేకపోయినా... మరికొన్ని పనులు బృందంతో కలిసి చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు సహోద్యోగులతో సులభంగా కలిసిపోతేనే పనులు విజయవంతంగా పూర్తవుతాయి. కాబట్టి అందరితో కలిసిపోతూ మీకు సందేహం ఉన్న విషయాల్లో సహోద్యోగుల సలహాలు తీసుకోవడం మంచిది. తద్వారా వాళ్లతో చెలిమి పెరుగుతుంది. మీకూ మనసు ప్రశాంతంగా ఉంటుంది. సకాలంలో పనులు పూర్తి చేయగలుగుతారు.

ఇంటి గోడలపై మరకలు పోవడం లేదా?

ఇంటి గోడలపై మరకలు పడితే వదిలించడం కాస్త కష్టమే. కొన్నిసార్లు అయితే వీటిని తొగించడానికి ఎంతో కష్టపడాలి, అయినా సరిగ్గా వదలవు, కొన్ని సార్లు గోడ రంగు కూడా ఊడిపోతూ ఉంటుంది.కొన్నిసార్లు ఈ మరకలు పోవాలంటే మళ్లీ పెయింటింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ మరకలు పడ్డప్పుడల్లా పేయింటింగ్ వేయలేం కదా.ఇది ఖర్చుతో కూడుకున్న పని. అలాంటప్పుడు ఖర్చులేకుండా సింపుల్ చిట్కాలతో మరకల్ని పోగొట్టి కొత్త ఇంటిలా మెరిసేలా చేయొచ్చు. అదేలాగో ఇప్పుడు చూద్దాం.



హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో ఎలాంటి మొండి మరకల్ని కూడా ఈజీగా పోగొట్టొచ్చు. దీనికోసం ఏం చేయాలంటే..

- హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను బేకింగ్ సోడాతో 1:1 నిష్పత్తిలో కలపండి. ఈ మిశ్రమాన్ని స్పాంజ్ లేదా మైక్రోఫైబర్ క్లాత్‌ని ఉపయోగించి గోడలపై అప్లై చేసి కాసేపు అలాగే వదిలేయండి. కాసేపటి తర్వాత తడి గుడ్డతో తుడిస్తే గోడలపై ఎలాంటి మరకలైనా పోతాయి.
- బేకింగ్ సోడా స్క్రబ్బింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది.పెరాక్సైడ్ బ్లీచింగ్‌లా పనిచేసి మరకల్ని సులభంగా పోగొడుతుంది. ఒకవేళ గోడలపై మరకలు లేకపోయినా ఈ కెమి కల్‌ను స్ప్రే చేస్తే దుమ్ము, దూళి క్షణాల్లో వదలగొడుతుంది.

మాపై చార్జిషీట్ కాదు

(మొదటిపేజి తరువాయి)

ఫోన్లను టాప్ చేయటం, డబ్బు మూటలు పట్టుకొచ్చిన వారిని తప్ప ఎవరినీ కలవకపోవడం, ప్రజలు నోరు తెరవకుండా ధర్నా చౌక్‌లను ఎత్తేయడం, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలవకపోవడం, భారత రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన స్వేచ్ఛను హరించివేయటం, ప్రశ్నించిన ప్రతీవాడినీ బెదిరించటం... పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగింది ఇదే...' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది తుగ్లక్ పాలన అంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారనీ, నిత్యం సచివాలయానికి వస్తూ, ప్రజలతో మమేకమవుతున్న తమది తుగ్లక్ పాలనా? లేక పదేండ్లపాటు ఫామ్‌హౌస్ నుంచి పరిపాలన సాగించిన కేసీఆర్‌ది తుగ్లక్ పాలనా? చెప్పాలంటూ సూటిగా ప్రశ్నించారు. ఎర్రవెల్లిని రాజధానిగా చేసుకుని, ఫాంహౌస్‌ను సెక్రటేరియట్‌గా చేసుకుని ఎవరి మాటా వినకుండా రాష్ట్రాన్ని తన ఇష్టం వచ్చినట్టు పాలించిన కేసీఆర్‌ది తుగ్లక్ పాలన కాదా? అంటూ నిలదీశారు. ఆయన భారతదేశంలో ఓ మోడ్రన్ తుగ్లక్ అంటూ ఎద్దేవా చేశారు. ఆ టైటిల్‌కు కేసీఆర్ తప్ప మరో యాభై ఏండ్ల వరకూ ఎవరూ పోటీపడబోరంటూ విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు విడుదల చేసిన చార్జిషీట్...'దొంగే.. దొంగా..దొంగా...' అని అరిచినట్టుగా ఉందని దుయ్యబట్టారు.

నిలదీద్దాం

(మొదటిపేజి తరువాయి)

శాసనసభ, శాసన మండలిలో పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం కలసి రాకపోతే అర్జెంటు మోషన్ ఇచ్చి అయినా.. చర్చలకు పట్టు పడుతామని తెలిపారు.



అసెంబ్లీ సమావేశాలకు మూడంచెల బందోబస్తు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు మూడంచెల బందోబస్తును పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దాదాపు రెండు వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లను చేశారు. అసెంబ్లీ ప్రధాన గేట్ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద అడుగడుగునా సాయుధ పోలీసులను ఏర్పాటు చేయటమేగాక లోనికి వచ్చే ప్రతి ఒక్కరినీ వాహనాలతో సహా సోదా చేసి మరీ లోపలికి వదిలేలా భద్రతా సిబ్బందికి ఆదేశాలు అందాయి. అలాగే, అసెంబ్లీ లాబీలో సివిల్ దుస్తుల్లో పరిసరాలపై కన్నేసి ఉంచేలా సిబ్బందిని నియమించారు. అసెంబ్లీ ప్రధాన గేటు మొదలుకొని లాబీలోకి ప్రవేశించే మార్గాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో పరిసరాలపై దృష్టిని వేసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు. మరోవైపు, అసెంబ్లీ వెలుపల కిలోమీటర్ దూరం వరకు ఎలాంటి సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించకుండా నిషేదాజ్ఞలను విధించారు. అలాగే, అసెంబ్లీ వైపునకు వచ్చే ప్రధాన కూడళ్ల వద్ద సాయుధ పోలీసులతో పాటు అశ్వికదళాలను కూడా బందోబస్తులో వినియోగించారు. అసెంబ్లీలోకి పాసులు లేకుండా ఏ ఒక్కరినీ అనుమతించరాదని నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఆదేశాలు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తుకు ముందస్తుగా అవసరమైతే రంగంలోకి దింపటానికి ఎస్‌ఐబీ, టీఎస్ఎస్పీ బలగాలను కూడా సిద్ధంగా ఉంచారు. ముఖ్యంగా, అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకొని విపక్షాలతో పాటు వివిధ యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు అసెంబ్లీ వద్ద ఆందోళనకు దిగే అవకాశమున్నందున వారిని అసెంబ్లీ గేట్ల సమీపంలోకి రాకుండా నిరోధించటానికి నగర టాస్క్‌ఫోర్స్‌తో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే, ఆదివారం ఉదయం అసెంబ్లీ వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్ స్వీయపర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించారు.

సిరియాలో తిరుగుబాటు

(మొదటిపేజి తరువాయి)

స్వాగతించాయి. సిరియాలోని డమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ప్రభుత్వ ప్రసార కేంద్రాలతో సహా కీలకమైన కేంద్రాలను వశపరచుకున్న తర్వాత తిరుగుబాటు దళ కమాండర్ అహ్మద్ అల్ షరా మొదటిసారి జాతి నుద్దేశించి టెలివిజన్‌లో ప్రసంగిస్తూ, ప్రభుత్వ సంస్థలు వేటితోను మిలిటరీ అప్రోచ్ కాకూడదని హుకుం జారీ చేశారు. అధికారికంగా అధికార మార్పిడి జరిగేంత వరకు మాజీ ప్రధాని మహ్మద్ అల్ జలాలీ ఆధ్వర్యంలోనే పరిపాలన ఉంటుందని చెప్పారు. అయిదు దశాబ్దాల బాత్ పార్టీ నిరంకుశ పాలనకు నేటితో తెర పడిందన్నారు. మరో వైపు ప్రధాని మహ్మద్ అల్ జలాలి మాట్లాడుతూ, అధికార బదలాయింపు సాఫీగా సాగేందుకు తాను సహకరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ఏ నాయకత్వంతోనైనా కలిసి పనిచేయడానికి తాను సుముఖంగా ఉన్నానన్నారు. సిరియాలో 'అసాధారణ పరిణామాలను' అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిశితంగా పరిశీలిస్తున్నారని' వైట్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. పదవీచ్యుతుడైన అధ్యక్షుడు అల్‌అసద్ కుటుం బం అయిదు దశాబ్దాలకు పైగా సిరియాను పాలిస్తూ వచ్చింది. 2000లో తన తండ్రి హఫీజ్ అసద్ మరణం తర్వాత అల్ అసద్ అధికారం చేపట్టారు. సిరియాలో అతి ప్రాచీన నగరమైన పల్మీరా, హామ్. అలెప్పో నగరాలను వశపరచుకున్న తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను అన్ని వైపుల నుంచి ఆదివారం చుట్టుముట్టారు. పెద్దగా ప్రతిఘటన లేకుండానే డమాస్కస్ తిరుగుబా టుదారుల వశమైంది. దీంతో రాజధానిలోని మెయిన్‌స్క్వేర్‌లో తిరుగుబాటు దారులు సంబరాలు చేసుకున్నారు. డమాస్కస్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయాన్ని తిరుగుబాటు దారులు ధ్వంసం చేశారు. అంతకుముందు సైద్నాయ సైనిక జైలుపై దాడి చేసి అక్కడ ఉన్న ఖైదీనలందరినీ విడుదలజేశారు. 'దీంతో క్రూరమైన నిర్బంధం నుంచి మా ఖైదీలకు విముక్తి లభించిందని' తిరుగుబాటు దళ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. 2011లో మొదటి సారి అసద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. అప్పటి నుంచి అమెరికా దన్నుతో జిహాదిస్టులు, స్థానిక మిలీషియా గ్రూపులు ప్రభుత్వ దళాలతో ఘర్షణలకు దిగుతూ సిరియాను అంతర్యుద్ధంలోకి నెట్టాయి. ఈ అంతర్యుద్ధంలో దాదాపు మూడున్నర లక్షల మందికిపైగా చనిపోయినట్లు ఐరాస నివేదికలు పేర్కొంటున్నాయి.

ఎవరీ అల్ జొలాని?

సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని తిరుగుబాటుద్వారా కూల్చివేసి అధికారం చేజిక్కించుకున్న ఇస్లామిక్ అలయెన్స్ నాయకుడు 45 ఏండ్ల అబూ మహ్మద్ జొలాని వార్తల్లో వ్యక్తి అయ్యాడు. అసలు ఎవరీ జోలానీ? ఏమిటి ఈయన నేపథ్యం? వంటి ప్రశ్నలు తలెత్తడం సహజం. జొలాని 1982లో సిరియా రాజధాని డమాస్కస్‌కు సమీపంలోని మజె పట్టణంలోజన్మించాడు. వీరి మూలాలు పాలస్తీనాలో ఉన్నాయి. 1967లో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ పూరిత యుద్ధం సాగించినప్పుడు వీరి తాత పాలస్తీనాలోని గొలాన్ హైట్స్ నుంచి శరణార్థిగా సిరియాకు బలవంతంగా తరలించబడ్డారు. మొదట జిహాదిస్టుగా ఆరంభమైన జొలాని జీవితం అనేక మలుపులు తిరిగింది. ఈ తిరుగుబాటు నాయకుడి మూల లు ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ అల్‌ఖైదాలో ఉన్నాయి. మొదట అల్‌ఖైదాలో చేరి పట్టుబడ్డాడు. . అయిదేండ్ల పాటు జైలులో ఉన్నాడు. ఇరాక్‌లో జిహాదిస్టుగా తర్ఫీదు పొందాడు. 2001 సెప్టెంబరు 11 దాడుల తర్వాత అమెరికా ఇరాక్‌పై దాడి చేసినప్పుడు అతను ఆ దేశం వీడి స్వదేశమైన సిరియాకు తిరిగి వచ్చి అల్‌ఖైదా సిరియా శాఖగా హయత్ తెహ్రిర్ అల్‌షామ్ (హెచ్‌టీఎస్)ను ను స్థాపించి ఉగ్రవాద కార్యకలాపాలు సాగించాడు. 2011 మార్చిలో అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదటిసారి తలెత్తిన తిరుగుబాటులో పాల్గొన్నాడు. అమెరికా, ఇజ్రాయిల్ ఇతర పశ్చిమ దేశాల అండతో సిరియాలో ఇస్లామిస్ట్ తీవ్రవాద గ్రూపులను, స్థానిక మిలీషియాలను కలుపుకుని ఇస్లామిక్ అలయెన్స్ (దీనినే అల్ నుస్రా ఫ్రంట్) ను ఏర్పాటు చేశాడు. 2013లో అల్‌ఖైదా నుంచి చీలి ఐఎస్‌ను అబు బకర్ ఏర్పాటు చేసినప్పుడు దానిలో చేరేందుకు జొలాని తిరస్కరించి, అల్‌ఖైదాపట్ల తన విధేయతను చాటుకున్నాడు. అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని సాయుధ, తీవ్రవాద గ్రూపులను కలుపుకుని పశ్చిమ దేశాల అండతో అసద్ ప్రభుత్వాన్ని కూలదోశాడు.

రైతులపై మళ్లీ జులుం

(మొదటిపేజి తరువాయి)

మోహరించి రైతులను అడ్డుకుంటూనే ఉన్నారు. ఇప్పుడు కూడా అదే యుద్ధ వాతావరణం కనిపించింది. ఢిల్లీ సరిహద్దుల్లో ముండ్లకంచెలు, ఇనుప బారికేడ్లతో దారులు మూసేశారు. దీంతో రైతులు తమ పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి కార్యాచరణను సోమవారం నిర్ణయిస్తామని నేతలు తెలిపారు. 101 మందితో కూడిన బృందం ఆదివారం కాలినడకన సాగింది. అనుమతి లేని కారణంగా అక్రమ పాదయాత్ర చేయలేరని పోలీసులు మైక్ లో తెలిపారు. 'మీరు రైతులని రుజువు ఉందా?' అంటూ ప్రశ్నించడం వాగ్వాదానికి దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిపై టియర్‌గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. రైతుల కండ్లు మండుతుంటే.. సహచర రైతులు అండగా నిలిచారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అదే కొనసాగడంతో పాదయాత్రను నిలిపివేశారు. పది మంది గాయపడ్డారనీ, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పాండర్ తెలిపారు. సమస్యను కేంద్రం పరిష్కరించే వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు.కాగా, ఖనోరీ సరిహద్దులో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించి ఆదివారం నాటికి 13 రోజులు పూర్తయింది. రైతులు సమ్మె తీవ్రతరం చేయడంతో ఖనోరి, శంభు ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శంభులో నిషేధ ఉత్తర్వులు ప్రకటించారు. ఆ ప్రాంతంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిషేధించారు. ఢిల్లీ సరిహద్దుల్లో కూడా భద్రతను పెంచారు. రైతుల డిమాండ్లలో రుణ మాఫీ, మద్దతు ధరలకు చట్టపరమైన రక్షణ వంటివి ఉన్నాయి.

పరిహారం కోసం ఉద్యమించిన రైతులు జైల్లోనే నిరాహారదీక్షలు

యూపీలోని నోయిడాలో ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టి అరెస్టయిన రైతులు జైల్లో నిరాహారదీక్షను ప్రారంభించారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి గౌతమ్ బుద్ధనగర్ జిల్లా జైలులో రైతులు నిరాహార దీక్షలు ప్రారంభించినట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తెలిపింది. గ్రేటర్ నోయిడాకు చెందిన 150 మందికి పైగా రైతులు జిల్లా జైలులో ఉన్నారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ నిర్ణయం తీసుకోవాల ని వారు డిమాండ్ చేశారు. పెద్ద ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమికి తగిన పరిహారం, అభివృద్ధి చేసిన భూమికి పది శాతం వాటా కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో ఎస్‌కేఎం వారం రోజులుగా నిరసనలు చేస్తోంది. ఆదివారం కూడా నోయిడాలో రైతులు నిరసన తెలిపారు. మరోవైపు, యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. 1997 నుంచి వివిధ ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన వారి జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అధిక నష్ట పరిహారం చెల్లించడంలో భాగంగానే ఈ చర్య తీసుకుంది. అయితే దీనికి సంబంధించి ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదని రైతు నాయకులు తెలిపారు.

ఎయిర్ షో..అదరహో

(మొదటిపేజి తరువాయి)

కోణంలో తిరగడం, ఫల్టీలు కొట్టడం, ఒకదానినొకటి క్రాస్ చేసుకోవడం, త్రివర్ణ పతాకాన్ని సూచించేలా మూడు రంగుల పొగను ఒక స్వీక్వెన్స్‌లో విడుదల చేయడం, లవ్ సింబల్, దాని మధ్యలో బాణం గుర్తును గీయడం లాంటి విన్యాసాలు అబ్బురపరిచాయి. 'మా ప్రదర్శనలూ వీక్షించండి' అన్నట్టుగా ఎయిర్‌షో జరుగుతున్న క్రమంలోనే పక్షులు కూడా గుంపులుగా ట్యాంక్‌బండ్‌పై చక్కర్లు కొట్టడం వీక్షకులను కట్టిపడేసింది. ఎయిర్‌షోను, రాహుల్ సిప్లిగంజ్ పాటలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, ఆయా శాఖల ఉన్నతాధికారులు ట్యాంక్‌బండ్, ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ వేదికల నుంచి వీక్షించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు సమాచార శాఖ కమిషనర్ హరీశ్ స్వాగతం పలికారు.

నమస్తే చిచ్చాస్ 1,2,3,4....

'నమస్తే చిచ్చాస్...1,2,34...అరె పొద్దుగాలే బయలెళ్ల..బోనంపెట్టి బయలెళ్ల..గండిమైసికి మొక్కెళ్ల...గాలిమోటరెక్కెళ్ల..అరె..పెద్దపులి...' అంటూ తన గానంతో రాహుల్ సిప్లిగంజ్ హుషారెక్కించారు. పోతురాజు వేషం వేసిన కళాకారులతో ఆడిపాడారు. ఆయన ఆ పాట పాడుతున్నంత సేపు వీక్షకులు కూడా డ్యాన్స్ వేసి మరింత జోష్ పెంచారు. 'ఓహో ఓహో జంబియా..వలంపల్లి జంబియా..నాతో మాట్లాడు జంబియా..' అని పాడుతూ ఉర్రూతలూగించారు.

నాటునాటు..సాంగ్‌తో పాటు పలు పాటలను పాడి వీక్షకులను మెప్పించారు. రాహుల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సత్కరించారు. మరో రెండు వేదికల్లో జి.నీల బృందం బోనాల కోలాటాన్ని, మైథిలి అనూప్ బృందం మోహని అట్టం, ప్రమోద్‌రెడ్డి బృందం భరతనాట్యాన్ని పదర్శించాయి. టీఎస్ఎస్ కళాకారులు పాటలు పాడి వినిపించారు. బిర్రు కిరణ్ టీమ్ థియేటర్ స్కిట్‌ను ప్రదర్శించింది.

ఏడాది పాలనంతా ఎడతెగని వంచనే

(మొదటిపేజి తరువాయి)

ఎండగట్టారు. ఆరు గ్యారెంటీల అమల్లోని డొల్లతనాన్ని బట్టబయలు చేశారు. ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్య పాలనను అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్... నిరంకుశత్వాన్ని మిగిల్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరగని నిర్బంధకాండను రుచి చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్లు, హాస్టళ్ల ముందు పికెట్లు, ముఖ్యమంత్రి సొంతూరుకు వెళ్లేందుకు కూడా పోలీసుల అనుమతి, మీడియా, సోషల్ మీడియాపై ఆంక్షలు, రాజకీయ కక్షతో తప్పుడు కేసు బనాయింపు, లైబ్రరీల్లో సైతం లాఠీఛార్జీలు, అశోక్ నగర్‌ను శోకసంద్రంగా మార్చిన వైనాన్ని ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. బుల్డోజర్లతో ఇండ్లను కూల్చి పేదల జీవితాలను ఛిద్రం చేశారని వాపోయారు. లగచర్ల లంబాడీల మీద థర్డ్ డిగ్రీని ప్రయోగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన పాలనంతా ప్రతిపక్షాలకు తిట్లు, ప్రజలను కొట్టుడు, దేవుళ్ల మీద ఒట్లు, తనకు, తన వారికి దోపిడీ సొమ్ము నోట్లంటూ ఎద్దేవా చేశారు. ప్రతీరోజూ ప్రజా దర్బార్ హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్... దాన్ని ఒక్క రోజు బాగోతంగా మార్చారని సెటైర్లు విసిరారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామనే హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. కేసీఆర్ మార్క్ పాలన దేశానికి దిక్సూచి అయితే, రేవంత్ మార్క్ పాలన దేశం ముందు నవ్వుల పాలైందని దుయ్యబట్టారు. ఎయిర్ పోర్టు రద్దు, ఫార్మాసిటీ రద్దంటూ అనాలోచిత ప్రకటనలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని విమర్శించారు. ప్రభుత్వంలో పరిపాలనా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని తెలిపారు. శాంతిభద్రతలు దిగజారి, క్రైమ్ రేట్ పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదిలోనే సంక్షేమాన్ని విధ్వంసం చేశారని చెప్పారు. కూల్చిన ఇండ్లే తప్ప నిర్మించిన ఇండ్లు లేవని ఎద్దేవా చేశారు. ముసలోళ్లను కూడా ముంచిన ముదనష్టపు ప్రభుత్వమని దుయ్యబట్టారు. దివ్యాంగులనూ దోఖా చేసిన దిక్కుమాలిన ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలోనే హంసపాదులా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను సీఎం రేవంత్ కేఆర్ఎంబీకి అప్పగించారని తెలిపారు. ఆయన పాలనలో ఇరిగేషన్‌కు బదులుగా ఇరిటేషన్ పెరిగిపోయిందని చెప్పారు. హామీలతో ప్రజలను, ఓట్లతో దేవుళ్లనూ మోసం చేశారన్నారు. తెలంగాణ వ్యవసాయాన్ని నిలబెట్టిన రైతుబంధు పథకం ఊసే లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కొనుగోళ్ల ఆలస్యంతో రైతులకు తీరని నష్టం కలిగిందనీ, పంట బోనస్ పత్తా లేకుండా పోయిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాదూ క్యాలెండర్‌ను ప్రకటించారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులను నిర్బంధించారనీ, నిరుద్యోగ భృతి రూ.4 వేలు అంటూ కాంగ్రెస్ జాతీయ నేత ప్రియాంక గాంధీ చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక గురుకులాలకు గ్రహణం పట్టిందనీ, 49 మంది విద్యార్థులను బలి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు డీఏలకు బదులుగా ఒక్క డీఏను ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులకు మొండి చెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చారని తెలిపారు. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు వెనుకేసుకునే పథకంలో లంకెబిందలు చూశారని ఆరోపించారు. మూసీ నిర్వాసితులు, హైడ్రా బాధితులు ఏడాది పాలన మీద దుమ్మెత్తి పోస్తున్నారని హరీశ్‌రావు ఈ సందర్భంగా తెలిపారు.

ఈవీఎంలపై విశ్వాసం లేదు

ఎన్నికల ప్రక్రియపై ఓటర్లలో అనుమానాలు : శరద్ పవార్

ముంబయి: మహారాష్ట్ర లో మహాయుతి ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) సభ్యులు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. షోలాపూర్ జిల్లాలోని మర్కద్వాడి గ్రామంలో యాంటి-ఈవీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు జరుగుతాయి. కొందరు గెలుస్తారు. కొందరు ఓడిపోతారు.అయితే "ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలున్నాయి. ఈవీఎంలపై ప్రజల్లో విశ్వాసం లేదు. అయినా.. ఓటు వేశారు. అమెరికా, ఇంగ్లాండ్‌తో సహ ప్రపంచమంతా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తోంది. భారత్‌లో మాత్రమే ఈవీఎంలు ఎందుకు? ఇక్కడి ప్రజలు బ్యాలెట్‌లతోనే ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారు" అని పేర్కొన్నారు.

'ఫియర్' రిలీజ్‌కి రెడీ



కథానాయిక వేదిక లీడ్ రోల్‌లో నటించిన సినిమా 'ఫియర్'. దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డా. హరిత గోగినేని ఈ మూవీని రూపొందించారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే పలు అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులను గెల్చుకుని, కొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో ఆదివారం ఈ మూవీ నుంచి టైటిల్ సాంగ్‌ను కొరియోగ్రాఫర్, హీరో రాఘవ లారెన్స్ రిలీజ్ చేశారు. అనూప్ రూబెన్స్ కంపోజ్ చేసిన ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, మేఘన, నీల్ క్రితస్ ఆకట్టుకునేలా పాడారు.

ఈ టైటిల్ సాంగ్ లిరిక్స్ ఇంగ్లీష్‌లో ఉండటం విశేషం. నాయిక వేదిక క్యారెక్టర్‌ను భయాలు ఎలా చుట్టుముట్టాయి?, ఆ ఫియర్ ప్రభావం ఆమె మీద ఎంతగా ఉందో చెప్పేలా ఈ పాటను డైరెక్టర్ హరిత గోగినేని ఆసక్తికరంగా డిజైన్ చేశారు.

జెపి (జయప్రకాష్), పవిత్ర లోకేష్, అనీష్ కురువిల్ల, సాయాజి షిండే, సత్య కృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు నటించిన ఈచిత్రానికి మ్యూజిక్ - అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ - ఐ ఆండ్రూ, లిరిక్స్ - కృష్ణ కాంత్, కొరియోగ్రఫీ - విశాల్, నిర్మాత - డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి, రచన, ఎడిటింగ్, దర్శకత్వం - డా. హరిత గోగినేని.



విజయ్ సేతుపతి

ఆసక్తికరంగా 'విడుదల 2' ట్రైలర్

విజయ్ సేతుపతి, వెట్రీమారన్ కలయికలో రూపొందిన చిత్రం 'విడుదల1'. ఈ చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా విజయ్‌సేతుపతి, వెట్రీమారన్ కాంబినేషన్‌లోనే 'విడుదల2' తెరకెక్కింది. ఈనెల 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ చిత్ర తెలుగు హక్కులను శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు దక్కించుకున్నారు. ఆదివారం చెన్నైలో ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి విడుదల చేశారు.

పెరుమాళ్‌గా విజయ్‌సేతుపతి పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రీమారన్ ప్రజెంట్ చేశాడు.

ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ,'తెలుగునాట విజయ్ సేతుపతికి ఉన్న అభిమాన గణం ఎంతో బలంగా ఉంది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఎమోషన్స్, యాక్షన్ అన్ని వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ప్రధాన ఆకర్షణ. 'పుష్ప-2' ఎంతటి బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుందో తెలిసిందే. ఆ కోవలోనే ఈ సినిమా కూడా అఖండ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

థ్రిల్ చేసే 'కిల్లర్'


"శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో సినీ ప్రేమికుల దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్.

ఆయన తాజాగా 'కిల్లర్' (పార్ట్ 1 డ్రీమ్ గర్ల్) అనే యాక్షన్ థ్రిల్లర్‌ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన ఒక హీరోగా నటిస్తుండటం విశేషం.

ఏయు అండ్ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మిస్తున్నారు.

ఈ కలయికలో నిర్మాణమవుతున్న రెండవ చిత్ర మిది. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో పూర్తి చేశారు.

10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వాజ్, హీరోయిన్ జ్యోతి పూర్వాజ్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్



జ్యోతి పూర్వాజ్

చిత్రీకరణ ప్రారంభిస్తున్నారు.

ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిలిం సిటీ, మొయినాబాద్ లొకేషన్స్‌లో జరిగే ఈ రెండో షెడ్యూల్‌లో గౌతమ్ అనే యాక్టర్‌తో పాటు జ్యోతి పూర్వాజ్ కూడా జాయిన్ కాబోతున్నారు. ఈ షెడ్యూల్‌లో కూడా సినిమాకి సంబంధించి కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. భిన్న యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. పవర్‌ఫుల్ కాన్సెప్ట్‌తో దర్శకుడు పూర్వాజ్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - జగదీశ్ బొమ్మిశెటి,
మ్యూజిక్ - అషీర్ ల్యూక్, సుమన్ జీవరతన్, నిర్మాతలు - పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి, రచన, దర్శకత్వం - పూర్వాజ్.

భారత్‌కు గులాబీ స్ట్రోక్

- డే నైట్ టెస్టులో దారుణ పరాజయం
- బ్యాట్‌తో, బంతితో రోహిత్‌సేన విఫలం

1-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సమం

టీమ్ ఇండియాకు గులాబీ స్ట్రోక్ తగిలింది. అడిలైడ్ టెస్టులో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పింక్ బాల్‌ను ఎదుర్కోవటంలో రోహిత్‌సేన పూర్తిగా విఫలమైంది. ఇటు బ్యాట్‌తో, అటు బంతితో నిరాశపరిచే ప్రదర్శనతో రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో దారుణ ఓటమి చవిచూసింది. ట్రావిశ్ హెడ్, లబుషేన్ ఆసీస్‌కు మంచి స్కోరు అందించగా.. స్టార్క్, కమిన్స్, బొలాండ్ త్రయం భారత బ్యాటర్ల కథ ముగించింది. 10 వికెట్ల తేడాతో అడిలైడ్ టెస్టులో గెలుపొందిన ఆసీస్.. 1-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని సమం చేసింది.

నవతెలంగాణ-అడిలైడ్



పింక్ బాల్ టెస్టులో భారత్ దారుణ పరాజయం చవిచూసింది. రోహిత్‌సేన నిర్దేశించిన 19 పరుగుల లక్ష్యాన్ని ఆతిథ్య ఆస్ట్రేలియా 3.2 ఓవర్లలోనే ఊదేసింది. నాథన్ మెక్‌స్వీనీ (10 నాటౌట్), ఉస్మాన్ ఖవాజా (9 నాటౌట్) అలవోకగా లాంఛనం ముగించారు. మరో రెండున్నర రోజుల ఆట మిగిలి ఉండగానే 10 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో మరో మూడు టెస్టులు మిగిలి ఉండగా సమీకరణం 1-1తో ఆసక్తికరంగా మారింది. అంతకుముందు, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 175 పరుగులకు కుప్పకూలింది. 128/5 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ మొదలెట్టిన భారత్.. ఓ గంట పాటు ఆసీస్ పేసర్లను ఎదుర్కొగలిగింది. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి (42, 47 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ (5/57) ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా.. స్కాట్ బొలాండ్ (3/51), మిచెల్ స్టార్క్ (2/60) రాణించారు. సూపర్ సెంచరీతో ఆసీస్‌ను ముందంజలో నిలిపిన ట్రావిశ్ హెడ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు ఈ నెల 14 నుంచి బ్రిస్బేన్‌లో జరుగనుంది.

నితీశ్ ఒక్కడే.. : ఓవర్‌నైట్ స్కోరు 128/5తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ మరో 47 పరుగులే జోడించింది. చివరి ఐదు వికెట్లను స్వల్ప విరామంలో కోల్పోయిన భారత్ డే నైట్ టెస్టులో మరోసారి నిరాశపరిచింది. రిషబ్ పంత్ (28) ఓవర్‌నైట్ స్కోరుకు ఒక్క పరుగు జోడించకుండానే అవుటయ్యాడు. మిచెల్ స్టార్క్ ఓవర్లో పంత్ వికెట్ కోల్పోయాడు. ఉదయం సెషన్లో తొలి ఓవర్లోనే వికెట్ కోల్పోయిన భారత్.. ఆ తర్వాత వరుసగా ఆలౌట్ దిశగా సాగింది. రవిచంద్రన్ అశ్విన్ (7), హర్షిత్ రానా (0), మహ్మద్ సిరాజ్ (7) తేలిపోయారు. జశ్‌ప్రీత్ బుమ్రా (2 నాటౌట్) అజేయంగా నిలిచాడు. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి (42) భారత ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిసిన నితీశ్ కుమార్ రెడ్డి క్రీజులో ఆసీస్ బౌలర్లను సౌకర్యవంతంగా ఎదుర్కొన్నాడు. మంచి షాట్లతో బౌండరీలు రాబట్టాడు. నితీశ్‌కు పంత్ సైతం తోడై ఉంటే.. భారత్ ఆసీస్‌కు కనీసం మూడెంకల లక్ష్యాన్ని నిర్దేశించేది!. 36.5 ఓవర్లలో 175 పరుగులకు భారత్ కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 180 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. 19 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా అలవోకగా ఛేదించింది.

ఓపెనర్లు నాథన్ మెక్‌స్వీనీ (10, 12 బంతుల్లో 2 ఫోర్లు), ఉస్మాన్ ఖవాజా (9 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్) 3.2 ఓవర్లలోనే లాంఛనం ముగించారు. మూడో రోజు ఆటలో లంచ్ విరామానికి ముందు ఆసీస్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పెర్త్ టెస్టు ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 180/10

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 337/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : జైస్వాల్ (సి) కేరీ (బి) బొలాండ్ 24, రాహుల్ (సి) కేరీ (బి) కమిన్స్ 7, గిల్ (బి) స్టార్క్ 28, కోహ్లి (సి) కేరీ (బి) బొలాండ్ 11, పంత్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 28, రోహిత్ (బి) కమిన్స్ 6, నితీశ్ (సి) మెక్‌స్వీనీ (బి) కమిన్స్ 42, అశ్విన్ (సి) కేరీ (బి) కమిన్స్ 7, రానా (సి) ఖవాజ (బి) కమిన్స్ 0, బుమ్రా నాటౌట్ 7, సిరాజ్ (సి) హెడ్ (బి) బొలాండ్ 7, ఎక్స్‌ట్రాలు : 13, **మొత్తం :(36.5 ఓవర్లలో ఆలౌట్)175.**

వికెట్ల పతనం : 1-12, 2-42, 3-66, 4-86, 5-105, 6-128, 7-148, 8-153, 9-166, 10-175.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 14-1-60-2, పాట్ కమిన్స్ 14-0-57-5, స్కాట్ బొలాండ్ 8.5-0-51-3.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : మెక్‌స్వీనీ నాటౌట్ 10, ఖవాజా నాటౌట్ 9, మొత్తం : (3.2 ఓవర్లలో) 19.

బౌలింగ్ : బుమ్రా 1-0-2-0, సిరాజ్ 1.2-0-9-0, నితీశ్ 1-0-8-0.

చేజారిన అగ్రస్థానం!

ఐసీసీ డబ్ల్యూటీసీ పాయింట్లు



దుబాయ్ : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025 పాయింట్ల పట్టికలో భారత్ అగ్రస్థానం చేజార్చుకుంది. పెర్త్ టెస్టులో విజయం తర్వాత మళ్లీ టాప్‌లోకి వచ్చిన టీమ్ ఇండియా.. అడిలైడ్ టెస్టు ఓటమితో ఏకంగా మూడో స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా అగ్రస్థానం కైవసం చేసుకుంది. దక్షిణాఫ్రికా రెండో స్థానానికి చేరుకుంది. ఆసీస్ 60 శాతం పాయింట్లు, సఫారీలు 59 శాతం పాయింట్లు సాధించగా.. భారత్ 57 శాతం పాయింట్లతో కొనసాగుతుంది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

కివీస్‌పై ఇంగ్లాండ్ విక్టరీ

2-0తో టెస్టు సిరీస్ వశం



వెల్లింగ్టన్ : భారత్‌పై చారిత్రక టెస్టు సిరీస్ విజయం సాధించిన ఉత్సాహంలో ఉన్న న్యూజిలాండ్‌ను ఇంగ్లాండ్ గట్టి దెబ్బ కొట్టింది. వరుసగా తొలి రెండు టెస్టుల్లో మెరుపు విజయాలు సాధించింది. మరో మ్యాచ్ ఉండగానే 2-0తో టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. 583 పరుగుల రికార్డు ఛేదనలో న్యూజిలాండ్ చేతులెత్తేసింది. టామ్ బ్లండెల్ (115, 102 బంతుల్లో 13 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీతో మెరిసినా.. న్యూజిలాండ్ 54.2 ఓవర్లలో 259 పరుగులకు కుప్పకూలింది. నాథన్ స్మిత్ (42), డార్లీ మిచెల్ (32), టామ్ లేథమ్ (24) ఫర్వాలేదని పించగా.. కేన్ విలియమ్సన్ (4), రచిన్ రవీంద్ర (6), డెవాన్ కాన్వే (0) విఫలమయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ (3/5), క్రిస్ వోక్స్ (2/20), బషీర్ (2/110) రాణించారు. ఇంగ్లాండ్ వరుస ఇన్నింగ్స్‌ల్లో 280, 427/6 పరుగులు చేయగా.. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన హ్యారీ బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

బీజేపీ విధానాలతో ఇబ్బందుల్లోకి దేశం

- శశి థరూర్



న్యూఢిల్లీ: బీజేపీ విధానాలతో భారత దేశం ఇబ్బందుల్లోకి వెళుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శశి థరూర్ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ, వ్యాపారవేత్త గౌతమ్ అదానీని లక్ష్యంగా చేసుకుంటూ భారత్‌ను అస్థిరపరచడానికి అమెరికా ప్రయత్నిస్తోందని బీజేపీ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. అమెరికాపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు ఆ పార్టీ నేతల కుటిల మనస్తత్వాలను తెలియజేస్తున్నాయని విమర్శించారు. ఇటువంటి ప్రవర్తన భారత్‌కు ఇబ్బందికరంగా మారొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

'కమలం పార్టీకి ప్రజాస్వామ్యం, దౌత్యం అంటే ఏమిటో అర్థం కావడం లేదని స్పష్టమవుతోంది. చిల్లర రాజకీయాల్లో వారు పూర్తిగా కూరుకుపోయారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను విస్మరించారు. ఇతర దేశాలతో సత్సంబంధాలను కొనసాగించే విధంగా ప్రవర్తించట్లేదు. వారి బాధ్యతలను విస్మరిస్తున్నారు. ముఖ్యమైన దేశాలతో బిజెపి అనుసరిస్తున్న ఇటువంటి ప్రవర్తన భారతదేశానికి ఇబ్బందికరంగా మారవచ్చు' అని శశి థరూర్ పేర్కొన్నారు.

సరిహద్దుల్లో యాంటీ డ్రోన్ యూనిట్

- అమిత్ షా



జోధ్‌పూర్ : దేశ సరిహద్దుల్లో త్వరలో యాంటీ డ్రోన్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. రాజస్థాన్‌లో జోధ్‌పూర్‌లో ఆదివారం బీఎస్ఎఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా బలగాలను ఉద్దేశించి ప్రసంగించారు. సరిహద్దుల్లో ముఖ్యంగా పాకిస్థాన్‌తో నియంత్రణ రేఖ వెంబడి ప్రాంతాల్లో డ్రోన్ల అనుమానాస్పద కదలికలు భద్రతాబలగాలకు సవాల్ విసురుతున్నాయని, ఈ క్రమంలోనే సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర యాంటీ-డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్టు అమిత్ షా ప్రకటించారు. లేజర్‌తో కూడిన యాంటీ-డ్రోన్ గన్-మౌంటెడ్ మెకానిజం ప్రాథమిక ఫలితాలు సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. దీనిద్వారా పంజాబ్‌లో భారత్- పాక్ సరిహద్దులో ప్రత్యర్థి డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతల కేసులు 3 శాతం నుంచి 55 శాతానికి పెరిగాయని వెల్లడించారు."రానున్న రోజుల్లో డ్రోన్ల ముప్పు మరింత పెరగనుంది. ఈ సమస్య పరిష్కారానికి డీఆర్‌డీఓ, ఇతర రక్షణ, పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. త్వరలో సమగ్ర 'యాంటీ డ్రోన్ యూనిట్'ను ఏర్పాటు చేయనున్నాం. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో దేశ సరిహద్దులను శత్రుదుర్భేద్యం చేసేందుకు కొనసాగుతున్న 'సమగ్ర సమీకృత సరిహద్దు నిర్వహణ వ్యవస్థ' (సీఐబీఎంఎస్) పురోగతిలో ఉంది. ఉత్తరాది సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ఉద్దేశించిన 'వైబ్రంట్ విలేజ్ ప్రోగ్రామ్'ను దేశంలోని అన్ని సరిహద్దు పల్లెలకు అమలు చేయనున్నాం. దాదాపు 3,000 గ్రామాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నాం. సరిహద్దుల్లో ఇప్పటికే 1,812 కి.మీ రోడ్ల నిర్మాణంతోపాటు 573 కొత్త బార్డర్ పోస్టులను సృష్టించాం" అని అమిత్ షా తెలిపారు.

పెద్దల కోసం పిల్లల కవిత్వం

'ఏనుగమ్మ ఏనుగు' పుస్తకావిష్కరణలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి





హైదరాబాద్ : ఊహను కవిత్వంగా మలిచే అద్భుతశక్తి కవికి ఉంటుందని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి అన్నారు. ఆదివారం సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో కవి వసీరా రాసిన 'ఏనుగమ్మ ఏనుగు' పుస్తకాన్ని శివారెడ్డితో పాటు పిల్లలు అన్విత్ వంకలంక, నాని, అరుణిన్ రాజిరెడ్డి, జెన్సీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. అటు ప్రపంచం, ఇటు సమాజం రెండింటిని జోడించి రాసే కవులు అరుదుగా ఉంటారనీ, అలాంటి కవుల్లో వసీరా ఒకరని వివరించారు. కవి చేసే అంతర్, బహిర్ ప్రయాణమే అతని కవిత్వమన్నారు. మూడు సంపుటాలతో ఇప్పటికే మంచి కవిగా ముద్ర వేయించుకున్న వసీరా తన నాలుగో సంపుటితో ఆ ముద్రను శాశ్వతం చేసుకున్నాడని తెలిపారు. ఏ వయసుకా ముచ్చట అంటారు కదా... అలా ఉంటుంది వసీరా కవిత్వమని అభివర్ణించారు. "ఈ ఆరు పదుల వయసులో తాతయ్యాడు. తన మనవడు, మనవరాలికే కాదు తనలాంటి ఎంతో మంది తాతలకి ఆనాటి ఏనుగమ్మ... ఏనుగు పద్యాన్ని మరోసారి గుర్తు చేశారు" అని వక్తలు కొనియాడారు. ఇప్పుడు, ఆ సమస్త ప్రపంచంలోని మనవలు, మనవరాళ్లను తన వీపుపై ఎక్కించుకుని ఏనుగాట ఆడుకుంటున్నారని వివరించారు.

తెలుగు కవిత్వంలో ఉన్న అన్ని వర్గాల వారు లోలోపల వసీరాని తమ వర్గం వాడే అని సంబర పడ్డారనీ, నిజానికి వసీరా ఏ వర్గం వాడూ కాదని చెప్పారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని కవిత్వీకరించినట్టుగానే తనకు తారసపడిన సాదాసీదా అంశాలను కూడా అంతే సాదాసీదా భాషలో కవిత్వీకరించారని కొనియాడారు. "కవిగా వసీరాకి ఏది వస్తువో ఎంత తెలుసో... దాన్ని ఎలా చెప్తే రక్తి కడుతుందో కూడా బాగా తెలుసు. బహుశా విప్లవాన్నీ కాంక్షిస్తూ రాసిన పద్యాలకి మురిసిన వీవీ, శివారెడ్డి వంటి కవులు వసీరా మృదు కవిత్వానికి కూడా అంతే ఆనందించారు. తన మూడో సంపుటి సెల్ఫీలో అయితే తన విప్లవ కాంక్ష, ప్రకృతి మీద ప్రేమలకు తోడుగా ఆధ్యాత్మిక కవిగా కూడా తనని తాను నిరూపించుకున్నాడు. ఇంతకు ముందు అన్నట్టు ఆ వయసుకు ఆ ముచ్చట అది. డీహ్యూమనైజేషన్ బ్రాండ్ ఏఐ (వర్షన్ 2024) అని నామకరణం చేసి ఏనుగు ఎక్కుదాం అనుకున్న మనల్ని అది ఎక్కే ముందు సమాజం ఇలా ఉంది" అని వక్తలు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు, ప్రసాద్ మూర్తి, పసునూరి శ్రీధర్‌బాబు ప్రసంసించారు. సాహితీప్రియులు, కవులు హాజరై కవి వసీరాను అభినందించారు.

దొంగల చేతివాటం

- 'మహా' సీఎం ప్రమాణ స్వీకారోత్సవంలో విలువైన వస్తువులు చోరీ



ముంబయి: మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకరణ కార్యక్రమంలో దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో వచ్చిన ప్రజల నుంచి బంగారం, విలువైన వస్తువులు కాజేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర సీఎం ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖులతో కలిపి దాదాపు ఐదు వేల మందికి పైగా హాజరయ్యారు. ఈ క్రమంలోనే కొందరు కేటుగాళ్లు దొంగతనానికి పాల్పడ్డారు. 13 బంగారు గొలుసులను కాజేసినట్టు సమాచారం. మరికొందరి నుంచి రూ. 12 లక్షలకు పైగా విలువైన వస్తువులను చోరీ చేశారు. మరో మహిళ 20 గ్రాముల నగ పోయిందని తెలిపారు. ఇలా 13 మంది ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇటీవల వెలువడిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి 230 స్థానాలతో అఖండ విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే.

కీలక శాఖలపై శిండే కన్ను

- కాసులు కురిపించే శాఖల కోసం డిమాండ్



ముంబయి : అయిష్టంగానే మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని బీజేపీకి వదిలేసిన శివసేన నేత ఏక్‌నాథ్ శిండే ఇప్పుడు కీలక శాఖలపై కన్నేశారు. మొన్నటి వరకూ మరాఠా పీఠంపై కూర్చున్న శిండే ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కనీసం కీలక శాఖలైనా దక్కించుకునేందుకు ఆయన శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. హోం శాఖను ఇవ్వాలని శిండే పట్టుపట్టినప్పటికీ బీజేపీ నాయకత్వం అంగీకరించలేదు. దీంతో ఆయన కాసులు గలగలలాడే నీటిపారుదల, పీడబ్ల్యూడీ, రెవెన్యూ శాఖల కోసం ప్రయత్నిస్తున్నారు. 'తప్పనిసరిగా ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. అయితే శిండే పరిస్థితి అంత బలంగా లేదు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ ప్రధాన డిమాండ్లు ఏవీ చేయడం లేదు. ఎందుకంటే పవార్‌పై నమోదైన అనేక అవినీతి కేసులకు సంబంధించిన ఫైల్స్ ఇప్పుడు బీజేపీ చేతిలో ఉన్నాయి. దీంతో ఆయన ఇచ్చింది పుచ్చుకొని సర్దుకుపోతున్నారు' అని ముంబయికి చెందిన రాజకీయ విశ్లేషకుడు రాజన్ ఖన్నా వ్యాఖ్యానించారు.

కీలకమైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక శాఖలు తమ పార్టీకి లభిస్తే శిండే సంతృప్తి చెందుతారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే రాష్ట్ర ఖజానాను నింపే ఈ కీలక శాఖలు మహారాష్ట్రను దేశంలోనే రెండవ అతి పెద్ద పారిశ్రామిక రాష్ట్రంగా మార్చాయి. జాతీయ పారిశ్రామిక ఉత్పత్తిలో మహారాష్ట్ర వాటా 20 శాతం మేర ఉండడం గమనార్హం. జల వనరులు సుసంపన్నంగా ఉన్న మహారాష్ట్రలో నీటి పారుదల ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

రాష్ట్రంలో ప్రస్తుతం అనేక ముఖ్యమైన ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో నీటి సరఫరా, పారిశుధ్య శాఖకు రూ.3,545 కోట్లు, జల్ జీవన్ మిషన్‌కు రూ.20,000 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో 39 నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉంది. బృహన్ ముంబయి కార్పొరేషన్ (బీఎంసీ)కి ఈ ఏడాది కానీ లేదా వచ్చే సంవత్సరం ప్రారంభంలో కానీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ముంబయిలోని 60-65 శాతం నియోజకవర్గాల్లో మరాఠాల ఆధిపత్యం కొనసాగుతోంది. కాబట్టి శిండే కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

మార్కెట్‌లో లీడ్‌లెస్ పేస్‌మేకర్ !

- రోగులకు ప్రయోజనకరమేనంటున్న వైద్యులు
- దీర్ఘకాల ప్రభావాలపై పరిశీలన అవసరమంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : దేశంలో లీడ్‌లెస్ పేస్‌మేకర్ల వినియోగం క్రమేపీ పెరుగుతోంది. రోగి హృదయ స్పందనను క్రమబద్ధం చేసేందుకు గుండెలో దీనిని అమరుస్తారు. లీడ్‌లెస్ పేస్‌మేకర్ చిన్నదిగా ఉంటుంది. ఇది బ్యాటరీ సాయంతో నడుస్తుంది. గుండె జబ్బులతో బాధపడే రోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పరికరాన్ని అందించడం ప్రయోజనకరమే అయినప్పటికీ అది చూపే దీర్ఘకాలిక ప్రభావాలకు సంబంధించి మరింత సమాచారం, మరిన్ని విశ్లేషణలు అవసరమని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో సంప్రదాయ పరికరాలతో పాటు పేస్‌మేకర్ ఇంప్లాంట్స్ వినియోగానికి సంబంధించి జాతీయ రిజిస్ట్రీ లేకపోవడాన్ని పరిశోధకులు ప్రస్తావించారు.

రోగి హృదయ స్పందన సరిగా లేనప్పుడు దానిని పేస్‌మేకర్ ద్వారా నియంత్రిస్తారు. అమెరికాకు చెందిన వైద్య పరికరాల ఉత్పత్తి సంస్థ అబ్బోట్ గత నెలలో మన దేశంలో లీడ్‌లెస్ పేస్‌మేకర్లను ప్రవేశపెట్టింది. హృదయ స్పందన తక్కువగా ఉన్న వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. ఈ పరికరానికి సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ సంస్థ అనుమతి ఇచ్చిందని అబ్బోట్ ఓ ప్రకటనలో తెలిపింది. దీనిని నేరుగా గుండెకు కుడి వైపున దిగువ కవాటంలో ప్రవేశపెడతారు. ఛాతిపై ఎలాంటి కోతలు ఉండవు. సంప్రదాయ పేస్‌మేకర్‌తో పోలిస్తే ఇది ఆధునికమైనదని వైద్యులు తెలిపారు. సంప్రదాయ పేస్‌మేకర్ల వినియోగం కారణంగా ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఉంది. హృదయ స్పందన సరిగా లేని వారికి అందించే చికిత్సలో లీడ్‌లెస్ పేస్‌మేకర్ అత్యుత్తమమైన పరికరమని వైద్య నిపుణుడు డాక్టర్ బల్‌బీర్ సింగ్ తెలిపారు. ఆయన ఇటీవల 74 సంవత్సరాల వృద్ధురాలికి ఈ పరికరాన్ని అమర్చారు. సంప్రదాయ పేస్‌మేకర్ వాడుతున్న ఆ మహిళ హృదయ కవాటానికి ఇన్‌ఫెక్షన్ సోకిందని, దీంతో ఆ పేస్‌మేకర్‌ను తొలగించి లీడ్‌లెస్ పరికరాన్ని అమర్చామని బల్‌బీర్ సింగ్ చెప్పారు. ప్రస్తుతం ఆమె తన రోజువారీ కార్యకలాపాలను యథావిధిగా నిర్వర్తిస్తున్నారని అన్నారు. సంప్రదాయ పేస్‌మేకర్‌కు ఉండే లీడ్స్ కారణంగా అనేక సమస్యలు ఎదురవుతుంటాయని, లీడ్‌లెస్ పరికరంలో అవి ఉండవని వివరించారు. తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే రోగులకు కూడా ఇది ప్రయోజనం కలిగిస్తుందని తెలిపారు. అయితే ఇది నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించింది కావడంతో దాని దీర్ఘకాల ప్రభావాలపై కొన్ని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు.

జమ్మూకాశ్మీర్‌లో అనుమానాస్పద స్థితిలో ఇద్దరు పోలీసుల మృతి

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో ఉధంపుర్ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున పోలీస్ వ్యాన్‌లో ఇద్దరు పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంటడం సంచలనంగా మారింది. మృతుల శరీరాలపై బుల్లెట్ గాయాలు ఉన్నాయి. ఉత్తరకాశ్మీర్‌లోని సోపోర్ నుంచి రియాసి జిల్లాలోని ట్రైనింగ్ సెంటర్ (ఎస్‌టీసీ) తల్వారాకు ప్రయాణిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే.. దుండగులు వారిపై దాడికి పాల్పడ్డారా..? లేదా వారే ఒకరినొకరు కాల్చుకున్నారా..? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. 'ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఉధంపుర్‌లోని కాళీమాత దేవాలయం సమీపంలో పోలీసు వ్యాన్‌లో బుల్లెట్ గాయాలతో, అనుమానాస్పద స్థితిలో ఇద్దరు పోలీసుల మృతదేహాలను గుర్తించాం. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించాం' అని పోలీసులు అధికారులు పేర్కొన్నారు. విచారణ ప్రారంభించామని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



అభివృద్ధి పేరిట పర్యావరణానికి తూట్లు

- అటవీ భూములకు సత్వర అనుమతులు
- రాష్ట్రాలకు కేంద్రం సూచన

"ప్రతి మనిషి అవసరాలను తీర్చడానికి భూమి తగినన్ని వనరులను అందిస్తుంది. అందులో అడవులు ప్రధానమైనవి. అటవీ సంపద బాగున్నప్పుడే పర్యావరణం పచ్చగా ఉంటుంది. మానవాళి అభివృద్ధి పేరిట చేసే విధ్వంసం..భావితరాలకు ప్రమాదంగా మారటం ఖాయం..

మహాత్మా గాంధీ అన్న మాటలు..

న్యూఢిల్లీ : మానవవిస్ఫోటనం గణనీయంగా పెరుగుతోంది. అభివృద్ధి పేరుతోనో..కేంద్రంలో ఉన్న పాలకులు పచ్చటి పర్యావరణాన్ని పెట్టుబడిదారుల చేతుల్లో రెడీఅయిపోతున్నాయి. అక్కడి సంపదను దోచుకునేలా తమ వారు అనుకున్న పెద్దలకు అప్పగించేలా ఉత్తర్వులు జారీఅయిపోతున్నాయి. తాజాగా మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల స్వాధీనానికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. అటవీ భూములకు అనుమతులు మంజూరు చేయడానికి చాలా సమయం పడుతోందని, దీనిని తగ్గించాలని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, అటవీ శాఖకు చెందిన చీఫ్ కన్సర్వేటివ్‌లకు పంపిన కార్యాలయ మెమోరాండంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సూచించింది. 2023వ సంవత్సరపు వన సంరక్షణ ఎవమ్ సంవర్ధన నిబంధనల్లో నిర్దేశించిన గడువును పరిగణనలోకి తీసుకోని అధికారులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేయాలని ఆ నోటీసులో ఆదేశించింది.

అటవీ భూముల్లో చేపట్టే ప్రాజెక్టుల విషయంలో అనుసరించాల్సిన ప్రక్రియను, నిర్దేశించుకోవాల్సిన కాలపరిమితిని ఆ నిబంధనలు నోటిపై చేశాయి. అనుమతుల మంజూరు ప్రక్రియకు ఎంత సమయం పడుతోందన్న విషయంపై సమీక్ష జరిపామని మంత్రిత్వ శాఖ తెలిపింది. వన సంరక్షణ ఎవమ్ సంవర్ధన్ అధినియంలో నిర్దేశించిన కాలపరిమితికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులు కట్టుబడి ఉండడం లేదని చెప్పింది. పలు సందర్భాల్లో నిర్దేశించిన దాని కంటే రెట్టింపు సమయం తీసుకుంటున్నారని ప్రస్తావించింది. అయితే ఈ జాప్యానికి కారణాలేమిటో ఆ అధికారులు వివరించలేదని తెలిపింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నానని అంటూ నిబంధనలకు ప్రాసెసింగ్ అధికారులు కట్టుబడి ఉండేలా చూడాల్సిన అవసరం ఉన్నదని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది.

కొడుకును బావిలో తోసి తల్లి ఆత్మహత్య

- వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో ఘటన



నవతెలంగాణ-నవాబుపేట్

కొడుకును బావిలో తోసి ఆపై తల్లి కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గేట్ వనంపల్లి గ్రామానికి చెందిన గుళ్ల రాములు, అరుంధతి(35) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు రుత్విక్(7), కూతురు ప్రజ్వల ఉన్నారు. శనివారం సాయంత్రం రాములు పొలం వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో అరుంధతికి ఫోన్ కాల్ వచ్చింది. ఆ ఫోన్ మాట్లాడిన తరువాత ఆమె ఏడుస్తూ కూతురు, కుమారుడిని తీసుకుని గ్రామంలోని ఓ బావి వద్దకు వెళ్లింది. మొదట తన కొడుకుని బావిలో తోసేసింది. ఇది చూసిన ఆమె కూతురు భయపడి అక్కడి నుంచి పారిపోయింది. అనంతరం అరుంధతి కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని మృతురాలి కూతురు గ్రామస్తులకు చెప్పడంతో వారు పోలీసులకు, మృతురాలి భర్తకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. చనిపోవడానికి ముందు మృతురాలికి ఎవరు ఫోన్ చేశారు. ఆమె మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణ కొరియా

మాజీ రక్షణ మంత్రి అరెస్ట్

సియోల్ : దక్షిణ కొరియాను గందరగోళంలోకి నెట్టిన మార్షల్ లా విధింపులో కీలక పాత్రధారుల్లో ఒకరైన రక్షణ శాఖ మాజీ మంత్రి కిమ్ యోంగ్ హ్యాన్‌ను అరెస్ట్ చేసినట్టు స్థానిక మీడియా ఆదివారం తెలిపింది. సైనిక పాలన యత్నం విఫలమైన తరువాత రక్షణ మంత్రిగా యోంగ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. పార్లమెంటులో అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానానికి మూడింట రెండొంతుల మెజార్టీ లభించనందున అది ఆటోమేటిక్‌గా రద్దయింది. ఈ పరిణామం జరిగిన మరుసటి రోజే రక్షణ శాఖ మాజీ మంత్రి అరెస్టు కావడం గమనార్హం.ఆయన ఇతర దేశాలకు పారిపోకుండా ప్రయాణాలపై నిషేధం విధించింది. అధ్యక్షుడు యూన్, మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ సహా ఇతరులపై తిరుగుబాటు ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కిమ్‌యోంగ్ అరెస్ట్‌పై అధికార యంత్రాంగం స్పందించాల్సి వుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్‌బార్

- 300 కిలోల బంగారు కడ్డీ తయారీ
- గిన్నిస్ బుక్‌లో చోటు



దుబాయ్ : ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు కడ్డీ (గోల్డ్ బార్)ని దుబాయిలో ఆవిష్కరించారు. 300.12 కిలోల బరువు ఉన్న ఈ కడ్డీ ధర రూ.211 కోట్లుగా తయారీదారులు పేర్కొన్నారు. ఎమిరేట్స్ మింటింగ్ ఫ్యాక్టరీ ఎల్ఎల్‌సి తయారు చేసిన ఈ గోల్డ్‌బార్‌ను దుబాయి సౌక్స్ టెన్షన్‌లో శనివారం ప్రదర్శించారు. ప్రపంచంలోనే అత్యధిక బరువున్న బంగారు కడ్డీగా ఈ గోల్డ్ బార్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. గతంలో అత్యధిక బరువున్న (250కిలోలు) బంగారు కడ్డీని తయారు చేసిన రికార్డు జపాన్ పేరిట ఉండేది. తాజాగా 300 కిలోల గోల్డ్ బార్‌ను తయారుచేసి దుబాయ్ ఆ రికార్డును బద్దలుకొట్టింది. స్వచ్ఛమైన బంగారంతో ఈ భారీ కడ్డీని తయారు చేయడానికి దాదాపు పది గంటల సమయం పట్టిందని ఎమిరేట్స్ మింటింగ్ ఫ్యాక్టరీ ఎల్ఎల్‌సి డిప్యూటీ జనరల్ మేనేజర్ మహమ్మద్ ఖర్సా తెలిపారు. '300 కిలోల గోల్డ్ బార్‌ను తయారు చేయడానికి 8-10 గంటల సమయం పట్టింది. బంగారు కడ్డీని నిర్దీత ప్రమాణాల ప్రకారం తయారు చేశాం. మేము తయారు చేసింది 300 కిలోల బంగారు కడ్డీ అని నిర్ధరించుకోవడానికి ప్రతిదీ కచ్చితంగా డాక్యుమెంట్ చేశాం. వాటినే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు పంపించాం. బంగారు కడ్డీ విలువ సుమారు 25 మిలియన్ డాలర్లు (93 మిలియన్ యుఎఇ దిర్హామ్‌లు ఉటుంది)' అని ఖర్సా తెలిపారు. ఈ బంగారు కడ్డీని మింటింగ్ ఫ్యాక్టరీ దుకాణం వెలుపల గాజు పెట్టెలో ప్రదర్శనకు ఉంచారు. దీన్ని చూసేందుకు సందర్శకులు పోటెత్తారు. అనేక మంది సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. భారత్‌లో బంగారం, వెండి ధరలు స్థిరంగా ఉన్నాయి. శనివారం 10 గ్రాముల బంగారం ధర రూ. 78,520 ఉండగా, ఆదివారం నాటికి రూ.30 తగ్గి రూ.78,490కి చేరుకుంది. కిలో వెండి ధర శనివారం రూ.92,978 ఉండగా, ఆదివారం నాటికి అంతే మొత్తంలో ఉంది.

పోరాటాలే.. అమరులకు సరైన నివాళి

- పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితమవుదాం
- మోడీ పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యం
- అంబానీ, అదానీలకు దేశ సంపదను కట్టబెట్టే యత్నం : పోటు ప్రసాద్ సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ- ఖమ్మం

ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ బహుముఖ పోరాటాలకు నేతృత్వం వహించి అమరులైన వారికి ప్రజా పోరాటాల కొనసాగింపే సరైన నివాళి అని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్ తెలిపారు. విద్యార్థి దశ నుంచి కార్మిక నాయకునిగా, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గత నెల 27న మరణించిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఖమ్మంలోని పాత మమత మెడికల్ కళాశాలలోని పువ్వాడ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో అమర్జిత్ కౌర్ మాట్లాడారు. పోటు ప్రసాద్ కుటుంబం మూడు తరాల నుంచి కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ వచ్చారని, మూడో తరం వారైన ప్రసాద్ విద్యార్థి ఉద్యమంలోనూ, కార్మిక ఉద్యమంలోనూ ఎంతో నిబద్ధతతో పని చేశారని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ శ్రేణులను ప్రజా పోరాటాలకు సన్నద్ధం చేసేవారని గుర్తుచేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై ప్రజా పోరాటాలు ఉధృతి చేయాల్సిన సమయంలో ప్రసాద్ మరణం యావత్ ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. యువశక్తి నిర్వీర్యం అవుతుందని, ప్రభుత్వ రంగంలో నియామకాలు లేవని, ప్రభుత్వ రంగాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తూ అంబానీ, అదానీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 25 శాతం మంది రోజు వారి కూలీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరుగుతుండటంతో దేశ వ్యాప్తంగా పలు పోరాటాలు మొదలవుతున్నాయన్నారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను సైతం కేంద్ర ప్రభుత్వం హరించివేస్తుందని విమర్శించారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. తుదిశ్వాస వరకు నిబద్ధత, నిస్వార్థంతో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి కృషి చేసిన పోటు ప్రసాద్‌కి నివాళిగా సీపీఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపు సభ ఖమ్మంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, వనజ, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, నాయకులు పోట్ల మాధవరావు, జర్నలిస్టు సంఘా ల నాయకులు కె.రాంనారాయణ, ఎ.ఆదినారా యణ తదితరులు మాట్లాడారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఝాన్సీ, లింగయ్య, సూర్యాపేట జిల్లా నాయకులు ఎం వెంకటేశ్వరావు, సీపీఐ నాయకులు ఎస్, సాబీర్ పాషా, మహ్మద్ మౌలానా, బి.అయోధ్య ప్రసాద్ కుమారుడు రాజా సాత్విక్, సతీమణి పోటు నిర్మల, తల్లి సక్కుబాయి, సోదరి పోటు కళావతి, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏసీకే జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, కార్పొరేటర్ బీజీ క్లెమెంట్ పాల్గొన్నారు.

43 వేల మంది సైనికుల్ని కోల్పోయాం : జెలెన్‌స్కీ

రష్యాతో మూడేండ్లుగా ఉక్రెయిన్ యుద్ధం



కీవ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఇరువైపుల భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరిగినట్టు నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీటికి సంబంధించి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ప్రకటన చేశారు. దాదాపు మూడేండ్లుగా చేస్తున్న యుద్ధంలో 43వేల మంది సైనికులను కోల్పోయామన్న ఆయన.. మరో 3.70లక్షల మది సైనికులు గాయాలపాలయ్యారని వెల్లడించారు. డోనాల్డ్ ట్రంప్ మక్రాన్‌లతో భేటీ అయిన ఆయన.. భవిష్యత్తులో మరోసారి రష్యా దాడి చేసే అవకాశం లేనివిధంగా శాంతి ఒప్పందం అవసరమన్నారు. "శాంతికి విఘాతం కలిగించడానికి రష్యా ప్రయత్నాలు చేసింది. మాపై దురాక్రమణకు పాల్పడింది. మాకు న్యాయమైన, శాశ్వత శాంతి అవసరమని డోనాల్డ్ ట్రంప్‌తో చెప్పా. గతంలో మాస్కో పదే పదే వ్యవహరించినట్టుగా కాకుండా మరో సారి తమ శాంతికి విఘాతం కలగకుండా ఆ ఒప్పందం ఉండాలి" అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి తేవాలని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు.



మహారాష్ట్ర స్పీకర్ పదవికి నామినేషన్

- సీఎం,డిప్యూటీ సీఎంల సమక్షంలో రాహుల్ నర్వేకర్ నామినేషన్.

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పదవికి బీజేపీ నేత రాహుల్ నర్వేకర్ నామినేషన్ దాఖలు చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే, చంద్రకాంత్ పాటిల్ సమక్షంలో నర్వేకర్ రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

షెడ్యూల్ ప్రకారం మహారాష్ట్ర అసెంబ్లీలో సోమవారం స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. మధ్యాహ్నం స్పీకర్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది.

పేరెంట్, టీచర్స్ మీట్ కొత్తేమీ కాదు

- వైసిపి అధినేత వైఎస్ జగన్

అమరావతి :తల్లికి వందనం పథకంలో, వారికి ఇస్తానన్న రూ.15 వేలు ఎప్పుడు ఇస్తారనే అంశం ప్రస్తావించకుండా మెగా పేరెంట్, టీచర్స్ మీట్ అంటూ సిఎం చంద్రబాబు హడావుడి చేస్తున్నారని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు కొత్తేమీ కాదని, ఈ సమావేశాలకు పేరు మార్చి కూటమి ప్రభుత్వం హడావుడి చేయడం తప్ప మరేమీ లేదంటూ 'ఎక్స్'లో ఆదివారం పోస్టు చేశారు. వైసిపి ప్రభుత్వం ఎంతో కష్టించి విద్యా రంగాన్ని తీర్చిదిద్దితే... కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేస్తూ తల్లికి వందనం అంటూ తల్లిదండ్రులకు సున్నం రాసిందన్నారు. తల్లికి వందనం పథకానికి బడ్జెట్‌లో రూ.12,450 కోట్లు కేటాయించాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు.

తల్లిదండ్రులపై ఈ భారం పడదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ హయాంలో విద్యార్థులకు కల్పించిన వాటన్నిటినీ కూటమి ప్రభుత్వం రద్దు చేసి వారికి అన్యాయం చేస్తోందన్నారు.

గొప్ప ప్రజాకళాకారుడు

గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభలో వక్తల నివాళి




తాడేపల్లి : చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడన నిలిచి కళారంగంలో విశిష్ట సేవలందించిన గాదె సుబ్బారెడ్డి ఉత్తమ కమ్యూనిస్టుగా, గొప్ప ప్రజాకళాకారుడిగా నిలిచారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి కొనియాడారు. ప్రముఖ సినీ నటులు అజయ్‌ఘోష్ మాట్లాడుతూ ప్రజా కళాకారులకు మరణంలేదని అన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సిఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ముందుగా సుబ్బారెడ్డి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి అధ్యక్షతన జరిగిన సభలో పుణ్యవతి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధిగా నెరవేర్చేవారని గుర్తు చేశారు. కవి, రచయిత అయిన సుబ్బారెడ్డి ప్రజాక్షేత్రంలో కమ్యూనిస్టుగా, కళాకారునిగా రాణించారని తెలిపారు. విజయవాడ కేంద్రంగా పని చేస్తున్న జాషువా విజ్ఞాన కేంద్రం, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బాలోత్సవాలు, పిల్లల్లో విజ్ఞాన సముపార్జనకు అనేక కళారూపాలను తయారు చేయడంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. మరణానంతరం తన దేహం కూడా ప్రజలకు ఉపయోగపడేలా వైద్య పరిశోధనకు అప్పగించాలన్న ఆయన ఆశయాన్ని కుటుంబ సభ్యులు నేరవేర్చడం అభినందనీయమన్నారు. వారి కుటుంబానికి పార్టీ యావత్తు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, విజయవాడ ఎంబివికె చైర్మన్ పి.మధు మాట్లాడుతూ సుబ్బారెడ్డి మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి, సాంస్కృతిక, కళా రంగాలకు తీరని లోటని తెలిపారు. దేశంలో మతోన్మాద శక్తులు విజృంభిస్తున్న నేటి తరుణంలో సుబ్బారెడ్డి లాంటి వ్యక్తుల అవసరం ఎంతో ఉందన్నారు. మరింత పట్టుదలతో మతోన్మాద వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టడమే ఆయనకు అర్పించే నిజమైన ఘన నివాళి అని అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 1980, 2000 సంవత్సరాల మధ్య కృష్ణా జిల్లా ఉయ్యూరులో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగంలో సుబ్బారెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. సినీ నటులు అజయ్‌ఘోష్ మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి డప్పు మోగినంత కాలం సుబ్బారెడ్డి లాంటి ప్రజా కళాకారులు బతికే ఉంటారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించామా లేదా అన్నదే చూడాలని, అలాంటి వారిలో సుబ్బారెడ్డి ముందు వరుసలో ఉన్నారని, తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వై.వెంకటేశ్వరరావు, బి తులసీదాసు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, ఎపి ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు చంద్రా నాయక్, తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకన్న, రాష్ట్ర నాయకులు పి.దేవేంద్ర, గాయకులు ఎ.జగన్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు ఎం.జగ్గరాజు, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, దోనేపూడి కాశీనాథ్, సుబ్బారెడ్డి సతీమణి శివలీల, కుమార్తెలు మేడగం శిరీష, జెట్టి ఆషాదేవి, అల్లుళ్లు మేడిగం శ్రీకాంత్‌రెడ్డి, జెట్టి శివనాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మరో సర్దుపోటు

- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న డిస్కమ్‌లు
- తాజా ఎఫ్‌పిపిసిని కూటమి ప్రభుత్వం రద్దు చేయదా?



అమరావతి :విద్యుత్ వినియోగదారులపై ప్రతి నెల, ప్రతి ఏటా సర్దుబాటు చార్జీలు వేస్తున్నారు. ఇప్పటికే నాలుగు భారాలు మోపిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఐదో భారాన్ని కూడా మోపాలని చూస్తున్నాయి. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) ఛార్జీలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కమ్‌ల) వసూలు చేస్తున్నాయి. ఈ భారాలు చాలవని, ఇంకా వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సమర్పించేందుకు సిద్ధమవుతున్నాయి. కొత్త చార్జీలు మోపబోమని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నా తాను అధికారంలోకి వచ్చిన తరువాత కాలానికి సంబంధించిన ఎఫ్‌పిపిసిఎ చార్జీలను రద్దు చేసి వినియోగదారులకు భారాల నుంచి కొంత ఉపశమనం కలిగించే దిశగా ఎలాంటి ఆలోచన చేయడం లేదు.

కొత్త భారాలు మోపాలంటే ఎపిఇఆర్‌సి నుంచి డిస్కమ్‌లు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ఎఫ్‌పిపిసిఎ పేరుతో ఇఆర్‌సి అనుమతి లేకుండానే యూనిట్‌కు 40పైసలు వరకు వినియోగదారులపై భారం మోపేందుకు కేంద్రప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అంత కన్నా ఎక్కువ ఉంటే దాన్ని ఆర్థిక సంవత్సరం ముగిశాక వేయొచ్చని చెప్పింది. ఈ ఆదేశాల మిగతా 7లో

ప్రకారం గత రాష్ట్రప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. దీంతో ప్రతి నెల కూడా ఎపిఇఆర్‌సికి చెప్పకుండానే ఎవరికీ తెలియకుండానే యూనిట్‌కు 40 పైసలు వసూలు చేస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా అదనంగా విద్యుత్ చార్జీల భారాన్ని మోపబోమని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా ఐదు నెలల కాలంలోనే రూ.15,484కోట్ల భారాన్ని మోపింది. ఇది గత వైసిపి చేసిన పాపంగా ప్రభుత్వం చెబుతోంది. తాను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెల బిల్లు నుంచి 2024-25 ఎఫ్‌పిపిసిఎ కింద వసూలు చేస్తున్న యూనిట్‌కు 40 పైసలు గురించి ప్రస్తావించడం లేదు. భారాలు మోపబోమని చెప్పి వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్న ఎఫ్‌పిపిసిఎ భారాన్ని రద్దు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే యూనిట్‌కు 40 పైసలు చొప్పున వసూలు చేసిన భారం కాకుండానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ వినియోగదారుల నుంచి ఎంత వసూలు చేయాలో డిస్కమ్‌లు లెక్కలు తేల్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు ఎపిఇఆర్‌సికి ప్రతిపాదనలు పంపించనున్నాయి. భారాలు మోపబోమని చెబుతున్న ప్రభుత్వం ఈ ఎఫ్‌పిపిసిఎ చార్జీల భారాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని వినియోగదారులు, విద్యుత్ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

కొసరే భారం

వినియోగదారుల నుంచి డిస్కమ్‌లు నాలుగు చార్జీలను ఇప్పటికే వసూలు చేస్తున్నాయి. జనవరిలో వినియోగదారులకు అందించే బిల్లులో 2014-19 ట్రూఅప్, 2022-23, 2023-24 ఎఫ్‌పిపిసిఎ భారాలతో పాటు ప్రతి నెల వసూలు చేసే 40పైసలు కూడా అదనం. అసలు బిల్లు కాకుండా చార్జీల రూపంలోనే వినియోగదారులు యూనిట్‌కు సుమారు రూ.1.70లు చెల్లించాలి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) ఎఫ్‌పిపిసిఎ చార్జీలకు కూడా ఎపిఇఆర్‌సి అనుమతి ఇస్తే యూనిట్ ధర రూ.2లు దాటి అసలు కంటే కొసరే భారమనట్లుగా పరిస్థితి తయారవుతోంది.

2024-25 సంవత్సరంలో డిస్కమ్‌లు లెక్కకట్టిన ఎఫ్‌పిపిసిఎ భారం

నెల	సిపిడిసిఎల్	ఎస్‌పిడిసిఎల్	ఈపిడిసిఎల్
ఏప్రిల్	0.5435	0.5053	0.435
మే	0.7491	0.4394	0.6381
జూన్	0.8193	0.6255	0.8099
జులై	0.6528	0.5357	0.6742
ఆగస్టు	0.5086	0.6198	0.4468
సెప్టెంబర్	0.6874	0.6502	0.6878
అక్టోబర్	0.4325	0.4756	-